# లోకానికి నేనే వెలుగు

## కుటుంబంలో ప్రేమానందం



సంపుటి - 41 అక్టోబర్ - డిసెంబర్ 2018 సంచిక - 4

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

## సంపాదక వర్గం

ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్
ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి
ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ దాసి సురేష్ కుమార్

## గురువిద్యార్థుల బృందం

బ్రదర్ కత్తుల సునీల్ బాబు
బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్
బ్రదర్ మానూరి మార్కో
బ్రదర్ కల్లేపల్లి యేసుబాబు
బ్రదర్ సిగినం ప్రకాశ్
బ్రదర్ యానాద్రి బాలయేసు
బ్రదర్ కొప్పర డేవిడ్
బ్రదర్ గోన పీటర్
బ్రదర్ కంకిపాటి అనిల్

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ. 100/- యం.ఓ., డి.డి..ల ద్వారా
St. John's Regional Seminary Society, Hyderabad
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్ :

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph : 040-27201427, 27200370, Fax : 27209505
e-mail : stjohnshyd2@gmail.com

Printed at : holycrossprinters 9848145417

# లోకానికి నేనే వెలుగు

సంపుటి-41 అక్టోబరు - డిసెంబరు 2018 సంచిక-4

## కుటుంబంలో ప్రేమానందం -

### నూతన దర్శనం మరియు తెలుగునాట కుటుంబ జీవన నమూనా చిత్రపు సంరక్షణ

**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**

**ప్రధాన సంపాదకులు**

**ఫాదర్ దాసి సురేష్ కుమార్**

**సంచిక సంపాదకులు**

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
website : stjohnseminaryhyd.org

# విషయసూచిక


**సంపాదకీయం**

**ఉద్ఘాటన పత్రం**

**1. వివాహం – దివ్య సంస్కారం – ఐక్యతకు పవిత్రతకు పిలుపు......... 15**
*– ఫాదర్ పిల్లి అంతోని దాస్*

**2. కుటుంబంలో యువత: మారుతున్న సామాజిక సంస్కృతి.............. 34**
*– ఫాదర్ అలెక్స్ జయరాజ్, SDB*

**3. క్రైస్తవ కుటుంబాలలో విశ్వసనీయత .................................. 44**
**తల్లిదండ్రులు, మత గురువుల పాత్ర**
*– శ్రీమతి పల్లి జయమ్మ*

**4. అడ్డకత్తెరలో కాపురాలు ................................................... 61**
**కుటుంబాలకు కారుణ్యపూరిత ప్రేషిత సేవలు మరియు తోడ్పాటు**
*– ఫాదర్ మద్దినేని ఆనంద ప్రసాద్, MSFS*

**5. కుటుంబ సత్యోపదేశంలో బైబిలు యొక్క భావసార్థకత ................ 74**
*– శ్రీ గొర్డెన్ మోరిస్, B.Th.*

**6. గృహస్య శ్రీసభగా కుటుంబం ............................................ 85**
*– ఫాదర్ సెల్వకుమార్ అలోషియస్*

**7. కుటుంబం ఒక అపురూప నిలయం .................................... 95**
*– ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్*

# సంపాదకీయం



నేటి సమాజంలో ఎక్కువగా శ్రద్ధ చూపవలసిన అంశములు కుటుంబము, వివాహ వ్యవస్థ. ఆదిలో దేవుడే స్వయంగా ఆదాము ఏవలకు ప్రథమ వివాహాన్ని చేసి మొదటి కుటుంబాన్ని ఏర్పరిచారు. వారిని పెక్కుమంది బిడ్డలను కని, పెంచి, భూమిని వశపరచుకొని, సృష్టి ఫలాలను అనుభవించమని దీవించారు. మనిషిని కుటుంబ యజమానిగా చేసి, యజమానురాలుగా అతని భార్యను నియమించారు. ఈ విధముగా అనాది కాలం నుండి వివాహము, కుటుంబం మనిషి జీవితములో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. సమాజానికి, కుటుంబ బంధానికి 'బయట' వాటికి 'అతీతం'గా మనిషి ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరిగే అస్కారం లేదు. అయితే నేటి అత్యాధునిక పరికరాల కాలంలో మానవ విలువలకు తిలోదకాలిచ్చి వివాహ వ్యవస్థ ఔన్నత్యాన్ని కుటుంబ వ్యవస్థ గొప్పదనాన్ని కాలరాస్తున్నట్లు అక్కడక్కడ ఉదాహరణలు, కొన్ని సంఘటనలు కన్పిస్తున్నాయి. నేటి సమాజ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మన జగద్గురువులు పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు 2015వ సంవత్సరములో కుటుంబము, వివాహ వ్యవస్థలను గూర్చి 'విశ్వ కతోలిక మేత్రాణుల సమాఖ్య సదస్సులు' (సినడ్స్) నిర్వహించి, మానవ వివాహ, కుటుంబ వ్యవస్థలను దృఢపరుస్తు, వాటి స్థానాన్ని మరోసారి ఉటంకిస్తూ "కుటుంబంలో ప్రేమానందం" అను అపోస్తోలిక ప్రబోధంను వ్రాశారు. అందుకే, ఈ తరుణంలో మనం 13వ భక్తినాథ పాపుగారి మాటలను జ్ఞాపకపరచుకుందాం. "మంచి కుటుంబాలు ఉంటేనే, మంచి సమాజం ఏర్పడుతుంది. ఒక దేశ భవిష్యత్తు దేశ ప్రగతి దేశంలోని ఆరోగ్యకరమైన కుటుంబ మనుగడపైననే ఆధారపడి ఉంటుంది".

ఈ నేపథ్యంలోనే 29, 30 ఆగష్టు 2018లో పాపుగారి "అమోరిస్ లతీసియా" అనే అపోస్తోలిక ప్రబోధం ఆధారంగా "రానున్న కాలంలో ఆంధ్ర,

తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాలలో శ్రీసభ యాత్ర కొరకు, కుటుంబ శ్రేయస్సు కొరకు ముఖ్యమైన పర్యవసానాల దృష్ట్యా నూతన పంథాలను గుర్తించుటలో కార్యక్రమ ప్రాధాన్యత గల సంకల్ప పత్రమే ఈ "కుటుంబంలో ప్రేమానందం" అనే శీర్షికను భక్త యోహాను గురువిద్యాలయ ప్రాంగణంలో, దివ్యవాణి విభాగంలో (హైదరాబాద్) తెలుగు కతోలిక దైవశాస్త్ర విభాగంవారు ఏటా జరిపే సదస్సును ఆరవసారి నిర్వహించారు. ఈ సదస్సులో ఏడుగురు ఉపన్యసితులు నివేదించిన పత్రాలనే ఈ సంచికలో మా ప్రియపాఠకులకు అందజేస్తున్నాము.

పత్ర వ్యాసాలను అచ్చువేయుటకు ముదములో అనుమతించిన విభాగ అధ్యక్షులు పూజ్యశ్రీ ప్రకాశ్ మల్లవరపు అగ్రపీఠాధిపతులకు ప్రప్రథమంగా మన:పూర్వక అభివందనాలు. అలానే, ముద్రణకు అభిమానంతో అంగీకరించిన విభాగ అభినయ కార్యదర్శి, ఫాదర్ రెడ్డిమాసు పాపయ్య గారికి కృతజ్ఞతాంజలులు. దైవశాస్త్రంలో పట్టభద్రులయిన వక్తలు: ఫాదర్ పిల్లి అంతోనిదాస్, ఫాదర్ అలెక్స్ జయరాజ్, ఎస్.డి.బి., శ్రీమతి పల్లి జయమ్మ, ఫాదర్ మద్దినేని ఆనంద ప్రసాద్, ఎం.ఎస్.ఎఫ్.ఎస్., శ్రీ గొర్రెదైన్ మోరిస్, బి.టి.హెచ్., ఫాదర్ సెల్వకుమార్ అలోషియస్, ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్ గార్లకు కడు ప్రేమతో నమస్సుమాంజలులు. సదస్సు యొక్క నివేదికను అందించిన సమితికి స్తోత్రాలు. ఆ నివేదికను "ఉద్ఘాటన పత్రం" అనే శీర్షికనందు అందిస్తున్నాం. ఐదవ ఆంగ్ల ఉపన్యాసంను అనువదించిన బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్, ఆరవ ఆంగ్ల ఉపన్యాసంను అనువదించిన బ్రదర్ మానూరి మార్కోకి మా ప్రశంసలను వ్యక్తపరుస్తున్నాం.

అదే విధముగా, ప్రియ పాఠకులారా! ఈ ఆగమనకాలంలో ప్రవేశించిన మనం క్రీస్తు జయంతి మహోత్సవమునకు సంసిద్ధులమవుతున్నాం. సాధారణముగా జననం అంటే జగతిలో అడుగిడుట, జగతిలో జీవించుట, జగతిలో అంతమగుట. కాని క్రీస్తు జననం అంటే జగతికి రక్షణ. జగతికి పాప విమోచన, జగతికి జ్యోతి. క్రీస్తు ప్రభువు మానవులందరి రక్షణ కొరకు దివి నుండి భువికి దిగివచ్చారు. కాని దైవకుమారుడైన క్రీస్తు ప్రభువును ఈ లోకంలోని ప్రజలు కనుగొనలేక

పోయారు, ఆహ్వానించలేకపోయారు. “మరియమ్మ తన తొలిచూలు కుమారుని కని, పొత్తి గుడ్డలలో చుట్టి పశువుల తొట్టిలో పరుండబెట్టెను. ఏలయన వారికి సత్రములో స్థలము లేకుండెను” (లూకా 2:7). ఏ మానవుడు కూడా క్రీస్తు ప్రభువుకు స్థానాన్ని, స్థలాన్ని ఇవ్వలేదు. చివరకు మూగజీవాలు లోక రక్షకున్ని ఆహ్వానించాయి. పశువుల పాకయే మన రక్షకుని జన్మస్థలంగా మారి పావనమైంది. మరి అటువంటి బాలయేసును కనుగొని స్వీకరించిన వారి జీవితాలు ధన్యము కావాలంటే, మనం నేటి గాయపడి, బాధామయమై, మలినమైన శ్రీసభలో, కుటుంబ వ్యవస్థలో చిన్నారి బాలయేసు ముఖ దర్శనాన్ని మన అనుదిన జీవితాల ద్వారా పొరుగువారికి చూపించాలి. తద్వారా, క్రీస్తు అందించే శాశ్వతానందం, నిత్యజీవం, రక్షణ అందరికీ ఒసగబడుట ద్వారా మనం ప్రభు జన్మమును మనసారా కొనియాడుదాం, ఆనందించుదాం.

చివరిగా సంపాదక వర్గానికిని, రవాణాకు ఉపయుక్తంగా సాయం చేసిన బ్రదర్ల బృందానికి మా ప్రశంసలతో కూడిన సన్నుతులు. పత్రికను ఆదరిస్తున్న మా పాఠక ప్రియులకు నిండు వందనాలు తెలుపుతూ మీ అందరికి క్రీస్తు జయంతి, నూతన సంవత్సర శుభాకాంక్షలతో...

ఇట్లు ప్రభు సేవలో...
**ఫాదర్ దాసి సురేష్ కుమార్**
సంచిక సంపాదకులు

# ఉద్ఘాటన పత్రం



తెలుగు కతోలిక పీఠాధిపతుల సమాఖ్య- కతోలిక సిద్ధాంత, దైవశాస్త్ర విభాగ అధికృతులయిన మల్లవరపు ప్రకాశ్ అగ్రపీఠాధిపతుల అధ్యక్షతన, ఫాదర్ రెడ్డిమాసు పాపయ్య గారి పర్యవేక్షణలో అయిదవ సదస్సు 29-30 ఆగష్టు 2019న భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, రామాంతపురం, హైదరాబాదులో జరిగింది. దీనిలో 58 మంది పాల్గొన్నారు. ఈ సదస్సు ఫ్రాన్సిస్ పాపుగారు వ్రాసిన "కుటుంబంలో ప్రేమానందం" అను అధికార పత్రంపై నూతన దర్శనం మరియు తెలుగునాట కుటుంబ జీవన నమూన చత్రపు సంరక్షణ రాబోయే కాలంలో ఆంధ్ర, తెలంగాణా ప్రాంతములలోని శ్రీ సభ ప్రబోధ పయనం కోసం నూతన మార్గాలను అందించే కార్యక్రమ ప్రాముఖ్యతను, ముఖ్యమైన పరిణామాలను తెలియజేసే కార్యచరణ అంశాల ద్వారా ఏ విధంగా లబ్ధిపొందగలదని ఆరుగురు వక్తలు చక్కని వ్యాసాలను అందించారు. బృంద చర్చలందు స్థానిక శ్రీసభలో ఎదుర్కొంటున్న భిన్న సంస్కృతుల సవాళ్లు గురించియు, రాగల మార్పులను జాగ్రత్తగా పరిశీలించి ఎంచుకోవలసిన విషయాలను పేర్కొంటూ, అనవసరమగు విషయాలను తిరస్కరించి తమ తమ అభిప్రాయాలను ఉగ్గడించారు.

**1. పత్రాలు - వాక్పతులు**

ఈ సదస్సులో దైవశాస్త్ర నిపుణులైన ఆరుగురు వాక్పతులు, "కుటుంబంలో ప్రేమానందం" పత్రాన్ని ఆధారము చేసుకొని పరిశోధనాత్మకంగా ఉభయ రాష్ట్రాల శ్రీసభను దృష్టిలో ఉంచుకొని ప్రాయోజిత పత్రాలను సమర్పించారు. వరుసగా

(1) శ్రీ గోర్డన్ మోరీస్, "కుటుంబ సత్యోపదేశంలో బైబులు యొక్క భావసార్థకత– సువార్త ప్రేమానందం నుండి దృష్టికోణం", (2) ఫాదర్ పిల్లి ఆంతొని దాసు "వివాహం (దివ్యసంస్కారం) మరియు శ్రీ సభ పత్రాలలో కుటుంబ వ్యవస్థ – ఐక్యతకు", (3) ఫాదర్ మద్దినేని ఆనంద్ ప్రసాద్, MSFS "కీలక కూడలి వద్ద కుటుంబం – దయతో కాపుదల యొక్క పరిశీలన మరియు క్లిష్టమైన వివాహ పరిస్థితుల్లో తోడ్పాటు", (4) శ్రీమతి పల్లి జయమ్మ "కుటుంబాలలో విశ్వాసాన్ని సంరక్షించుట (విశ్వాసమును ప్రసారం చేయుట)– నేటి తల్లిదండ్రుల, కాపరుల యొక్క పాత్రలు, సవాళ్లు", (5) ఫాదర్ సెల్వకుమార్ అలోసియస్ "గృహస్య శ్రీసభగా కుటుంబం –సువార్తా ప్రబోధకు ప్రథమ వనరుగ కుటుంబం గనుక, కుటుంబంలోని ప్రేమానందమే శ్రీసభ యొక్క సంతోషం", (6) ఫాదర్ అలెక్స్ జయరాజ్, SDB "కుటుంబంలో యువత: సంస్కృతిలో వస్తున్న మార్పులను బట్టి, తెలుగునాట శ్రీసభ ప్రయోగ సందర్భంలో మతపరిచర్యపు దృష్టికోణం." తమ తమ పత్రాలను చక్కగా చదివి సభకు వినిపించారు. వాటిపై స్పందనలు ప్రతిస్పందనలు కూడా వినవచ్చాయి.

**బృంద చర్చలు – నివేదికలు**

ఈ సదస్సులో పాల్గొన్నవారు బృందాలుగా ఏర్పడి, ఇచ్చిన ప్రశ్నలను చర్చించి, నివేదికలను సమర్పించారు. ఈ చర్చలు రెండు దపాలుగా జరిగాయి. ఈ రెండింటి నివేదికలను కూడ ప్రశ్న జవాబుల రూపంలో మీ ముందు ఉంచుచున్నాము.

**2.1. వివాహము ఒక దివ్యసంస్కారం. ఇది మన కతోలిక విశ్వాసం. సంతోషం పట్టణాలలో, నగరాలలో ముఖ్యముగా కతోలిక సాంప్రదాయ కుటుంబాలలో ఈ విశ్వాసం బలంగా ఉంది. దానిని శ్రద్ధగా ఆచరిస్తున్నారు కూడా మరి గ్రామస్థాయిలో విచారణ స్థాయలో జ్ఞానవివాహ సాంగ్యాన్ని, కతోలిక ఆచారము ప్రకారము జరుగుతుందా? వివాహ ప్రశ్నావాళి పత్రాన్ని నింపుటలోని అర్థాన్ని, దాని వెనుక ఉన్న కతోలిక శ్రీసభ ఉద్దేశాన్ని కాబోవు వధూవరులు అవగాహన చేసుకోవడంలో గురువులు ఎంతవరకు నిజంగా, సమయాన్ని కేటాయించి వారికి**

**సహాయం చేస్తున్నారు? వివాహసాంగ్యపు పూజలో వివాహములోని లోతైన క్రైస్తవ బోధన ఎంతవరకు చేయబడుతుంది? వివాహన్ని ఒక దివ్య సంస్కరముగా గుర్తంచి, దానిని విశ్వాసంతో ప్రభలింపజేయడంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, జాగరూకతలు పరిశోధించుము?**

వివాహం ఒక దివ్య సంస్కారం. విశ్వాస కేంద్రమైన పట్టణాల, గ్రామాలలో వివాహ ఔన్నత్యాన్ని గురించి ఒక 20,30 సం॥ల క్రితం కాస్త ఆసక్తిగా జరిగేది. సమయం, సందర్భం అనుకూలించకపోవడం చేత ఈ దివ్య సంస్కారం గూరించి బోధించడం కుదరడం లేదు. కాని వివాహ సాంఘ్యాలు గూరించి వివహం జరగకముందు మరియు వివాహం చేసుకోనేటప్పుడు వివాహం గూరించి క్షుణ్ణంగా వివరించాలి. వివాహంలోని శరతులను, ప్రమాణాలను క్షుణ్ణంగా అభ్యసించి అర్థమైన విధంగా ఇటు గురువులు అటు విశ్వాసులు ముఖ్యంగా వివాహమైన వధూవరులు తెలుసుకోవలసిన అవసరం ఎంతైన ఉన్నది.

కొన్ని పరిస్థితులు, వత్తిడిల వలన గురువులు కొంతమంది శ్రీసభ నియమాలకు కట్టుబడి విశ్వాస సత్యాలను నేర్పంచలేకపోతున్నారు. అయిన విడిపోయిన వారిని జాలితో గుర్తుంచి దగ్గరకు తీయలి.

వివాహం ఒక సంస్కారమే కాదు సంబరం కూడా. అయితే నేటి సమాజం సంబరానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తుంది. వివాహ సాంగ్యం నిర్వాహణలో హైందవ సంప్రదాయాలు నిర్వర్తిస్తున్నారు. మూహూర్తాలు చూసుకోవడం, ఊరేగింపును అధికవ్యయంతో వివాహ చేసుకొని అప్పులు పాలు అవుచున్నారు. క్రీస్తు ద్వారా ఈ సాంగ్యం నిర్వర్తించబడుతున్నది. గురువు, కాబోయే దంపతలు మరియు అతిధులు క్రైసవ సాంగ్య అవగాహనతో నిర్యవర్తిచండం అవసరం.

**2.2. కతోలిక, మతాంతర వివాహాలలో శ్రీసభ ప్రతినిధులుగా గురువుల పాత్ర ఏమిటి? మన కతోలిక యువతులు ఇటువంటి వివాహబంధంలో చేరినప్పుడు – కతోలిక విశ్వాసులంగా – అటు వివాహములో ప్రవేశించు వ్యక్తి తల్లిదండ్రుల,**

**మతపెద్దల విశ్వాసస్పందన ఎలా ఉందలి, ఎలాఉంది? విశ్వాసప్రమాదం జరిగినప్పుడు క్రమబద్ధీకరనకు తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి?**

కతోలికేతర, మతాంతర వ్యక్తుల వివాహలలో శ్రీసభ ప్రతి నిధులుగా గురువుల పాత్ర ఎంతైన ఉన్నది. కుటుంబ సందర్శన, యువకులకు నైతిక మతపరమైన విలువలను అంచలంచలుగా నేర్పించాలి. అదే విధంగా తల్లిదండ్రులు ప్రేరణాత్మకమైన జీవిత విలువలను బోధించాలి. తమ జీవన విధానం ద్వారా వారి బిడ్డలను ఆకట్టుకోవాలి.

**2.3. శ్రీసభ చట్టానికి ప్రతికూలముగా పెళ్లి చేసుకుని వారికి, విడాకులు తీసుకుని మరో వివాహము చేసుకున్న (ఔట్‌సైడ్ చర్చ్) వారికి దివ్యసత్ప్రసాదము నిరాకరించుట సముచితమా?**

వ్యక్తిగత విశ్వాసం, జీవన విధానాన్ని పరిగణంలోకి తీసుకొని దివ్యసత్ప్రసాదం ఇవ్వవచ్చు అని కొంతమంది ఉద్దేశాన్ని వ్యక్తపరిచారు. అయితే మరి కొంతమంది కతోలికుల విశ్వాసం యొక్క పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. మరియు కొంతమంది సక్రమమైన క్రమ శిక్షణ కలిగి ఉండాలి అని కూడా తెలియజేసారు.

కాని ప్రస్తుత సమాజంలో ఉన్నటువంటి రకరకాల/వివిధమైన ప్రాంతీయ కతోలిక శ్రీసభ దయకు, కనికరమునకు స్థానము తప్పని సరిగా వుండాలి. అదేవిధముగ వ్యక్తిగత విశ్వాస జీవితమే కాకుండా,ఎవరైతే దివ్యసత్ప్రసాదం స్వీకరించాలనుకుంటున్నారో, వారి పట్ల సంఘము శ్రద్ధకలిగి మరియు వారి గురించి తెలిసి ఉండాలి. ఎందుకంటే దివ్యసత్ప్రసాద స్వీకరణ/ పంచడం సంఘములో మాత్రమే జరుగుతుంది. అదే విధముగా వారితో మాట్లాడటం సంభాషించడం ద్వారా వారి తప్పులను ఖండించి వారిని సన్మార్గంలో సిద్ధపరచడానికి వీలుంటుంది. అదే విధముగా ఇటువంటి విషయాలలో వారికి సత్యోపదేశం చేయాలి.

**2.4. ఆధునిక సమాజంలో వచ్చే మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరికరాలు మాస్ మీడియాను వినియోగించి క్రైస్తవ సంఘాన్ని అటు కుటుంబము, ఇటు మత గురువులు విశ్వాసాన్ని, ప్రేమను ఎలా పెంపొందించగలరు?**

క్రైస్తవ విలువలు, బైబిల్ కథలు మరియు వ్యక్తిగత దేవుని యందు విశ్వాస అనుభవం కుడా ఇతరులకు తెలియపరచాలంటే సరైన క్రమబద్ధీకరణమైన ఎలక్ట్రానిక్ మీడియాను ఎన్నుకోవడం ద్వారా, కుటుంబాలను, గురువులను మరియు మఠవాసులను ఉత్తేజపరచగలం. కతోలిక పత్రికలు మరియు పిరియాడికల్స్ పంపిణి చేయడానికి... భాగస్తులు అవ్వడానికి అనుకులంగా వుండవచ్చు. ఎలక్ట్రానిక్ మీడియ ప్రాముఖ్యతను ప్రజలకు తెలుయచేయడానికి, విచారణ స్థాయిలో కొన్ని కార్యక్రమాలు "ప్రపంచ కమ్యునికేషన్ రోజున" నిర్వహించాలి.

వివిధ రకాల ప్రాంతీయ సంస్థలు ఇటువంటి కార్యక్రమాలు మేత్రాసన స్థాయిలో మేత్రాసన డైరెక్టర్స్ ద్వారా నిర్వహించబడాలి. విచారణ స్థాయిలో గాని డీనరీ స్థాయిలో గాని విశ్వాసాన్ని మరియు దైవ ప్రేమను నూతనంగ ఉత్తేజపరచడానికి వార్త పత్రికలును ప్రచరింపచేయాలి. ఈ వార్త పత్రికలో బైబిల్ గ్రంథానికి చెందిన ప్రవచనాలు కుడా ఇవ్వాలి.

విచారణలో వున్న కొన్ని దైవ సంఘాలు (మరియదళం...) ప్రజల యొక్క విశ్వాసమును మరియు ప్రేమను బలపరడానికి ఉపయోగకరమైన ఉపన్యాసాలు భావాలు పంచుకోవాలి.

విచారణ స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్విహించాలి. విచారణలో జరుగుతున్న అనుదిన కార్యక్రమాలే కాకుండ, విచారణ గురువు ప్రజలకున్న విశ్వాసాన్ని, ప్రేమ అభివృద్ధిపరచడానికి మంచి ఆలోచనలు ఇవ్వకలిగిన అర్హత వున్న వ్యక్తులను బయట నుంచి ఆహ్వానించాలి. విశ్వాసులను కూడా ఆహ్వానించి, వాళ్ళకున్న కుటుంబ అనుభావాలను పంచుకోనేటట్లు చేయాలి. వీటిని అన్నింటిని పాటించడం, చేయడం ద్వారా విచారణ గురువు క్రైస్తవ కుటుంబాలను సమైక్యంగా వుంచగలడు.

❊ ❊ ❊ ❊

# 1. వివాహం - దివ్య సంస్కారం ఐక్యతకు పవిత్రతకు పిలుపు

**- ఫాదర్ పిల్లి అంతోని దాస్**

**ఉపోద్ఘాతం**

**వివాహము - దేవుని దివ్యమైన అనుగ్రహం**



దేవుడు క్రీస్తు ద్వారా మానవాళికి దివ్యలోకపు ప్రతి ఆధ్యాత్మికమైన ఆశీస్సును ప్రసాదించుచున్నాడు (ఎఫేసీ 1:3). ఇటువంటి మేలైన వరములలో ఒకటి 'వివాహానుగ్రహం' - వివాహం అను దివ్యసంస్కారం. ఆయన ఆ వివాహ పిలుపును స్త్రీ పురుషుల తత్వంలోనే (in the very nature of man and woman) లిఖించాడు (ఆది 1:27-28; 2:21-24). జన్మపాపం కీడును అతిక్రమమును ప్రపంచానికి పరిచయం చేసింది. దేవునితో బంధం తెగిపోయింది. ఈ ఆదిపాపము స్త్రీకి పురుషునికి మధ్య తొలి ఐఖ్యతను విచ్ఛిన్నం చేసింది. అయినా వివాహపు తొలి అనుగ్రహం మాత్రం తీసివేయబడలేదు. మనం వివాహ ఆశీర్వాద ప్రార్ధనలో వింటున్నాం: "స్త్రీ పురుషుల బంధము ద్వారా మీరు స్థాపించిన ప్రథమ కుటుంబమునకు మీరొసగిన ఆశీర్వాదము మాత్రమే జన్మపాపశిక్ష వలన గాని జలప్రళయ నిర్ణయముచే గాని అంతరించలేదు". వారిని అర్థవంతమైన, ఫలవంతమైన వివాహబంధమునకు సిద్ధం చేస్తున్నాయి. వారి ప్రయత్నాన్ని అభినందించుదాం.

ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. ఇంకోవైపు ఉంది. మన కళ్లముందు చోటు చేసుకుంటున్న వివాహ వ్యవస్థను నిలువరించే వాస్తవాలు: వివాహ నిరాకరణ - సంతాన నిరాకరణ.

## వివాహనిరాకరణ

వివాహజీవిత ఆటంకాలు, కుటుంబజీవిత కలహాలు, వివాహవిశిష్టత తెలియక విడాకులు, ఆత్మైకజీవిత మర్మం మరచి మనస్పర్థలు. ఈ పరిస్థితులు వివాహ పవిత్రతను విచ్ఛిన్నం చేస్తున్నాయి. కుటుంబ విలువలను కాలరాస్తున్నాయి. ఇప్పటికీ, వివాహమును ఒక సహజసిద్ధకార్యంగా (natural institution), క్రైస్తవ దివ్యసంస్కారముగా (Christian sacrament) దేవుడే దయచేసిన ఒక వరమని గుర్తించనివారు, అంగీకరించిలేని వారు ఎందరో ఉన్నారు. మారుతున్న ఈ యాంత్రిక యుగంలో ఈ విధంగా ఆలోచించేవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. వీరు దాదాపుగా వివాహము ఒక గొప్పకార్యమని నమ్ముతారు, కాని దానిలో ఇమిడియున్న నిబద్ధతలు, షరతులు, పరిధులు చూసి భయపడి, తమను తాము సమర్పించుకోడానికి వెనుకడుగు వేసి, వివాహానికి దూరంగా ఉండటం బాగుందని ఒక భ్రమలో బ్రతుకుతున్నారు. వీరి వలన కుటుంబ జీవితానికి ఒక అడ్డుకట్ట పడుతుంది, మానవజాతి అభివృద్ధిని నిలిపివేస్తుంది.

## సంతాన నిరాకరణ

నేటి సామాజిక వ్యవస్థలో వివాహం ఒక ప్రశ్నార్థకంగా మారుతుంటే, సంతాననిరాకరణ మరో మహమ్మారిగా మారిపోతుంది. జన్మకు పూర్వమే పసిగుడ్డును నిర్దాక్షిణ్యంగా తొలగించడం, జన్మానంతరం పసిబిడ్డను నిర్దయగా విస్మరించడం రోజురోజుకు పెరిగిపోతున్న అమానవీయ చర్యలు. సంతానం ద్వారా మానవజీవితానికి సేవ చేయవలసిన, మానవ జీవితాన్ని సంరక్షించవలసిన బాధ్యతను చాలామంది నిరాకరిస్తున్నారు. ఈ విధంగా వివాహపు ప్రధాన ఉద్దేశాన్ని (purpose), దాని విలువలను మరచిపోతున్నారు. బిడ్డలను భారంగాను భావిస్తున్నారు. సంతానాన్ని సౌందర్యానికి విఘాతమని తలస్తున్నారు. దీని వలన ఇటు బిడ్డలకే కాదు, వివాహ వ్యవస్థ మొత్తానికే తీరని నష్టం వాటిల్లుతుంది. దీనికి తోడు, నేడు వివాహాన్ని ఒక 'వ్యక్తిగత' విషయంగా, 'రహస్య క్రియ'గా చూస్తూ, అవసరానికి ఉపయోగపడు ఒక సాంగ్యగా చిత్రీకరిస్తున్నారు. పెద్దలు అక్కరలేని, పవిత్రసాంగ్యములు అవసరంలేని వివాహాలు ఎక్కువవుతున్నాయి.

ఈ పోకడలను, స్థితిగతులను తెలుసుకొని, సవాళ్లను స్వీకరించి, వివాహ వ్యవస్థను పునరుద్ధరించే అత్యవసర పరిస్థితిలో మనం ప్రస్తుతం ఉన్నాము. అయితే ఈ అవసరతను రెండవ జాన్ పాల్ పాపుగారు చాలాకాలం క్రితమే తెలియపరచియున్నాడు.

నేటి చరిత్రలో కుటుంబం అసంఖ్యాక శక్తుల వలయంలో చిక్కుకొని యుంది. అవి దానిని నాశనం చేస్తున్నాయి. దానికి వికృతరూపాన్ని ఇస్తున్నాయి. సామాజిక అభివృద్ధి, కుటుంబ శ్రేయస్సు రెండు ఒక దానికి ఒకటి అంటిపెట్టుకొని యున్నాము. ఈ సత్యాన్ని పరిశోధించిన శ్రీసభ ఒక అత్యవసర బృహత్తర కార్యాన్ని చేపట్ట సిద్ధం కావాలి: అందరికి వివాహం గురించి, కుటుంబం గురించిన దైవ ప్రణాళికను ప్రబోధించాలి. వాటి ఔన్నత్యమునకు, మానవ-క్రైస్తవ ప్రగతికి భరోసా ఇవ్వాలి. తద్వారా సంఘము, దైవప్రజల నూత్నీకరణకు తనవంతు సహకారాన్ని చేయూతను శ్రీసభ అందించాలి.

ఈ పిలుపును అందుకొని మనం ముందుకు రావాలి. ముఖ్యంగా మనం, మేత్రానులు మరియు గురువులు, సంఘ కాపరులుగా, వేదప్రచారకులుగా ఈ బాధ్యతను మన భుజస్కందాలపై మోయాలి. వివాహ వ్యవస్థపై జరిగే పలురూపాల దాడులను అరికట్టాలి. వివాహము మరియు కుటుంబము యొక్క పరమార్థము, ప్రసన్నత, పవిత్రతలను కాపాడాలి. మనం విశ్వసించిన దేవుడు ఆదేశించిన సత్యాన్ని సూటిగా చాటిచెప్పడానికి పూనుకోవాలి. విశ్వాస సత్యాలను సరియైన భాషలో, అర్థవంతమైన రీతిలో, సాక్షీబూత తీరులో ప్రజలకు అందుబాటులో ఉంచడానికి ప్రయత్నించాలి. ఆ ప్రయత్నంలో భాగమే ఈ మన సదస్సు అని మనం గట్టిగా నమ్ముతున్నాం. ఈ దివ్యమైన అనుగ్రహము దివ్యసంస్కార రూపములో క్రీస్తు శ్రీసభ చేతులలో ఉంచాడు.

ఈ పత్రములో రెండు ప్రధానమైన అంశాలను పొందుపరచి సమర్పించడం జరుగుతుంది. మొదటిది, వివాహము ఒక దివ్యసంస్కారము; రెండవది, వివాహము: ఐక్యత, పవిత్రతకు ఒక పిలుపు.

## అధ్యాయం ఒకటి:
## వివాహము - క్రీస్తుని దివ్యమైన సంస్కారము

"వైవాహిక ఒప్పందం ద్వారా స్త్రీ పురుషుని మధ్య భాగస్వామ్య ఏర్పాటు జరుగుతుంది. దాని స్వభావ రీత్యా దంపతుల శ్రేయస్సు కోసం, సంతానం కోసం, వాళ్ళ విద్య కోసం నిర్దేశింపబడింది. జ్ఞానస్నానం తీసుకున్న ఇద్దరు వ్యక్తుల మధ్య ఒప్పందానికి క్రీస్తు ప్రభువు హోదా కల్పించాడు." ద్వితీయ వాటికన్ మహాసభ అధికార పత్రాలు కూడా వివాహము కేవలం మానవుని ఏర్పాటు కాదని ధ్రువీకరిస్తున్నాయి: "వివాహమూ కుటుంబ జీవనమూ పవిత్రమైనవి; ఎందుకంటే – వాటిని పరమపావనుడైన భగవానుడే స్థాపించాడు. తాను సృష్టించిన స్త్రీ పురుషుల మధ్య అత్యంత సన్నిహితమైన ప్రగాఢమైన అనురాగ బంధాన్ని వైవాహిక సంబంధాన్ని సృష్టికర్త భగవానుడే ఏర్పరచాడు. కుటుంబ జీవితానికి ఈ వైవాహిక బంధమే పునాది. ఈ వివాహ బంధాన్ని, కుటుంబ జీవనాన్ని అదుపాజ్ఞలలో ఉంచే నైతిక చట్టాలను కూడా సాక్షాత్తు భగవానుడే నిర్దేశించాడు." అనగా దేవుడు వివాహానికి కొన్ని లక్షణాలను పొందుపరచాడు. వాటిని అవలంభించనపుడు ఆయన తలంచిన వివాహం చోటుచేసుకోనట్లే.

వివాహము ఒక పురుషుడు ఒక స్త్రీ మధ్య వుండే ఒక ప్రత్యేకమైన సంబంధంగా శ్రీసభ తరతరాలుగా ప్రకటిస్తూనే ఉంది. వివాహబంధంలో ప్రవేశించి, శరీరకలయిక ద్వారా దానిని పరిపూర్ణం చేసిన తర్వాత ఆ బంధము, ఆ ఐక్యత వధూవరుల చిత్తప్రకారం కూడా అది తొలగించబడలేదు. ఆ బంధం చివరివరకు సాగాలి. అందుకే వివాహం విశ్వసనీయతతో నిర్మింపబడింది, వధూవరులు గాఢమైన లోతైన సాన్నిహిత్యాన్ని పంచుకునే ఒక అవకాశం. మరణం వరకు ఈ ఐక్యతను ఎవరూ విడదీయలేరు. "దేవుడు నిర్దేశించిన దాంపత్యబంధం సుస్థిరమైంది, శాశ్వతమైంది. వివాహ సంస్కారంలో అంతర్భాగంగా దంపతులు ఒకరిపట్ల ఒకరు చూపుకునే దాంపత్య ప్రేమ – ఒకరి కొరకు ఒకరు ఆత్మ సమర్పణం కావించుకోవడం ద్వారా వ్యక్తమవుతుంది; ఇందులో భాగమైన లైంగిక జీవనం పవిత్రమైంది, ప్రగాఢమైంది, విశిష్టమైంది, గౌరవనీయమైంది. కనుకనే

– క్రైస్తవ దాంపత్యంలో విడాకులకు వివాహేతర సంబంధాలకు చోటులేదు." ఈ ఐక్యతానురాగం దంపతుల మధ్య వ్యత్యాసాలను, భేషజాలను, హెచ్చుతగ్గుల వివక్షణను తొలగించి, సమానత్వాన్ని, స్నేహాన్ని, పరస్పర గౌరవాన్ని పెంచుతుంది. ఇంతటి ఉన్నతమైన బంధానికి ఆధారం జ్ఞానవివాహము అను దివ్యసంస్కారము.

## 1.1. పరిశుద్ధ గ్రంథంలో వివాహము

ఆదికాండములోని రెండు 'సృష్టి కథనాలు' స్త్రీ పురుషుల నైజం గురించి, వారి మధ్యన ఏర్పడే అనుబంధం గురించి రెండు సత్యాలను విశదం చేస్తున్నాయి.

మొదటి కథనంలో "దేవుడు మానవ జాతిని సృజించెను. తన పోలికలో మానవుని చేసెను. స్త్రీ పురుషులుగా మానవుని సృజించెను" (ఆది 1:27). స్త్రీ పురుషులను దేవుడు ఒకే సమయంలో, దైవీక రూపంలో సృజించాడు. మానవుని సృష్టితో సృష్టి మొత్తం పరిపూర్ణమైంది. అందుకే దేవుని కంటికి అది 'చాలా బాగుగా' ఉంది (ఆది 1:31). ఈ విధంగా దేవుని పోలికలో వ్యక్తులుగా చేయబడిన స్త్రీ పురుషుల మధ్య ప్రాథమిక సమానత్వము, గౌరవం, ఔన్నత్యం ఉంది అని పరిశుద్ధ గ్రంథం ధ్రువీకరిస్తుంది.

రెండవ కథనంలో దేవుని ప్రణాళికకు 'రెండు – భిన్న లింగ బేధాలు' అవసరమని తెలుస్తుంది. అనగా స్త్రీ పురుషుల పరస్పర లింగభేదం ఆయన సృష్టి ప్రణాళికలో భాగమే. అందుకే ఆదామును చేసిన తర్వాత దేవుడు తనలో అనుకుంటాడు: "నరుడు ఒంటరిగా జీవించుట మంచిది కాదు. అతనికి సాటియైన తోడుగా స్త్రీని సృష్టింతును" (ఆది 2:18). కావున దేవుడు నరునికి అవసరమైన, అనుకూలమైన, సరిజోడైన ఒక తోడును సృజించాడు. అన్ని జంతువులను ఆదాము దగ్గరికి తీసుకొచ్చిన తర్వాత, అతడు అన్నిటికి నామకరణం చేసిన తర్వాత అర్థం అవుతుంది. "అతనికి తగిన తోడు ఎవ్వరు దొరకలేదు" (ఆది 2:20). అటుపిమ్మట గాఢనిద్రలో ఉన్న ఆదాము ప్రక్కనుండి ఒక ఎముకను తీసి స్త్రీని తయారుచేయగా ఆదాము ఆమెను చూడగానే ఆనందగానం చేస్తాడు: "చివరకు ఈమె నావంటిదైనది నా ఎముకలలో ఎముక, నా దేహములో దేహము, ఈమె నరుని నుండి రూపొందినది కావున నారి యగును" (ఆది 2:23).

ఆదాము ఏవలు ఒకరికోసం ఒకరు చేయబడ్డారు. స్త్రీ పురుషుడు వివాహైక్యతలో ఒకటి కావడానికి చేయబడ్డారు. ఆ ఐక్యతలో మర్మం, మాధుర్యం ఉన్నతమైనవి. అందుకే వాక్యము కొనసాగుతుంది: "కావుననే నరుడు తన తల్లిదండ్రులను విడనాడి ఆలికి హత్తుకొనిపోవును. వారిరువురు ఏక శరీరులు అగుదురు" (ఆది 2:24). ఇక్కడ ఒక సత్యం బోధపడుతుంది: స్త్రీ పురుషులు ఏకకాలంలో ఒకటిగా ఉంటున్నారు, మరియు వ్యత్యాసమూ కలిగియున్నారు. స్త్రీ పురుషులుగా వారు విభిన్నమైనవారు. అయితే వ్యక్తులుగా వారిరువురు ఒక్కటే. వారిరువురి మధ్య ఉన్న వ్యత్యాసం వారికి ఆటంకం కాదు. ఈ వ్యత్యాసాలే ఒకరితో ఒకరు ఏకం కావడానికి దోహదపడుతుంది. అందుకే స్త్రీ పురుషులకు రెండు వేరువేరు లక్ష్యాలు లేవు. ప్రేమపిలుపుకు స్పందించడానికి, దేవుని సృష్టిని కొనసాగించడానికి వారి భిన్నత్వమే వారికి సహాయపడుతుంది. వ్యక్తులుగా వారు శారీరక అవసరాలకంటే గొప్పవారు. అయితే స్త్రీ పురుషుల శారీరక కలయిక ద్వారా మరో వ్యక్తిని సృష్టించగల శక్తిలోనే వివాహపు పునాదులు దాగి ఉన్నాయి. మరోవ్యక్తిని సృష్టించడం ద్వారా, మానవ జీవితానికి జన్మనివ్వడం ద్వారా వారు ఒక కుటుంబాన్ని నిర్మిస్తున్నారు. వివాహబంధంలోని స్త్రీ పురుషులిద్దరూ జీవితానికి, ప్రేమకు గుర్తుగా ఉంటున్నారు.

ఈ వైవాహిక ఐక్యతను నూతన నిబంధనలో యేసు కూడా మరోసారి నొక్కివక్కానిస్తున్నాడు. ఆయన వివాహము, విడాకులు అను అంశాల గురించి చాల స్పష్టంగా ఉన్నాడు. ఆయన సృష్టి ఆరంభంలో స్త్రీ పురుషుల కొరకైన దేవుని ప్రణాళికను, దేవుని ఆలోచనను వ్యక్తపరుస్తూ 'వారి ఐక్యత జీవితాంతం వరకు ఉండాలి' అని మరోసారి రుజువు చేస్తున్నాడు. ఆయన ప్రకారం దంపతులు విడిపోవడం, విడాకులు ఇవ్వడం, దూరంగా ఉండటం అనునవి దేవుని చిత్తానికి వ్యతిరేకంగా కనిపిస్తున్నాయి. ఇదే సత్యమైతే, భగవానుని సంకల్పం అయితే, ఇటువంటి వాటికి చట్టపరమైన వసతులు కల్పించడం ఎంతవరకు సమంజసమో మానవ సమాజం ఆలోచించాలి.

మార్కు సువార్తలోని పరిసయ్యులతో ఆయన సంభాషణలో విడాకుల సమస్య ఈ విషయంలోని అంతరార్థాన్ని తెలియజేస్తుంది (మార్కు 10:2-16).

పరిసయ్యుల 'కుంచిత' భావాలను, వారి ఆలోచనా విధానాన్ని, చట్టమును వారి స్వార్థానికి వాడుకునే పద్ధతిని ఖండిస్తున్నాడు. విడాకుల గురించి మోషే చట్టసవరణ కేవలం వారి హృదయకాటిన్య పర్యవసానం అని గుర్తు చేసాడు. అయినా ఆయనకు ఇటువంటి స్వల్ప విషయాలపై ఆగిపోవడం ఇష్టం లేదు. అందుకే అసలు సమస్య విడాకులు, దాని తీరుతెన్నులు కాదు అని, ఆ సంభాషణను దేవుని వాస్తవ ప్రణాళికవైపు నడిపిస్తున్నాడు.

నాటి కాలంలోని పద్ధతులను, సామాజిక, సాంస్కృతిక నియమాలను యేసు దాటిపోతున్నాడు. ఆయన ఆలోచన వారి ఆలోచనకు అతీతంగా ఉంది. ఆయన నాటి అనాలోచిత కట్టుబాట్లకు లొంగిపోలేదు. సృష్టి ఆరంభంలో దేవుడు ఉద్దేశించిన తొలిప్రణాళికలోనికి ప్రవేశించి మాట్లాడుతున్నాడు. వారిరువురు ఏకం కావాలి. అదే వైవాహిక బంధం. ఈ వివాహబంధం దేవుడు మానవాళితో చేసుకున్న ఒడంబడికను సూచిస్తుంది. అందుకే ఆ బంధం తెగిపోరాదు. ఎవరూ దానిని వేరుపరపరాదు. దానిని తెంచడం దేవుని సృష్టికి, మానవునికై ఆయన తలంపును ధిక్కరించడంతో సమానం.

అంతేకాదు, కానా పెండ్లిలో యేసు సాన్నిధ్యాన్ని వైవాహిక ఔన్నత్యంతో శ్రీసభ పోలుస్తుంది. వివాహానికి క్రీస్తు సాన్నిధ్యం ఒక బలమైన చిహ్నంగా, సాక్ష్యంగా భావిస్తుంది. వైవాహిక అవిఛ్ఛిన్నతా బంధం పట్ల యేసుకు ఉన్న స్పష్టమైన వైఖరి కొందరిని గందరగోళ స్థితిలోనికి నెట్టి ఉండవచ్చు. ఇది ఆచరణకు అసాధ్యమైన చట్టంగా భావించి ఉండవచ్చును కూడా. అయినా ఈ చట్టము, ఈ భారము మోయసాధ్యం కానిదేమి కాదు. ఎందుకంటే, ఈ కష్టతరంగా గోచరించు వివాహ ఐక్యతను సాధకం చేయడానికి యేసువే స్వయంగా వారికి తన బలాన్ని, కృపావరాన్ని దయచేస్తాడు. శ్రీసభను ప్రేమించి తన ప్రాణమునిచ్చి దానిని తనలో ఐక్యపరచుకున్న యేసు, అంతటి భాగ్యాన్ని దంపతులకూ ప్రసాదిస్తాడు. అది ఆయన సంతోషం, సంకల్పం. క్రీస్తు ప్రేమనే భార్యభర్తలు పరస్పరం పంచుకోవాలని పౌలుగారు పిలుపునిస్తున్నాడు (ఎఫేసీ 5:23-25).

పరిశుద్ధ గ్రంథం నుండి వివాహము గురించి మనకు సుస్పష్టంగా అర్థం అయ్యే సత్యం: వివాహం దైవసంకల్పం అని, వివాహైక్యత దైవవరం అని,

స్త్రీ పురుషుల మధ్య మాత్రమే చోటుచేసుకునే ఈ వైవాహిక బంధాన్ని ఎవరు విడదీయరాదని, జీవితాంతం వరకు ఎటువంటి పరిస్థితులు వచ్చినా ఈ ప్రగాఢబంధాన్ని అవలంభించాలని, అదియే మరో సృష్టికి మూలమని, అందుకే వివాహం దేవుడే తలంచిన దివ్యకార్యమని మనకు అవగతమౌతుంది.

## 1.2. శ్రీసభలో చరిత్రలో వివాహము

హెబ్రీయుల పత్రికలో రచయిత "వివాహము అందరిచేతను గౌరవింపబడవలెను. వివాహబంధము నిష్కల్మషమైనదిగా ఉండవలెను" (13:4) అని ప్రబోధిస్తున్నాడు. అందుకే ఆదిక్రైస్తవులు వివాహపవిత్రతను 'గ్నోస్టిసిజం' తప్పుడు ప్రచారము నుండి భద్రంగా కాపాడారు. శ్రీసభ ఆరంభంలో క్రైస్తవ సంఘాలు అవివాహిత జీవితాన్ని అనగా బ్రహచర్యమును వైవాహిక జీవితం కంటే ఉన్నతమైనదిగా భావించేవారు. క్రైస్తవ జీవితానికి క్రీస్తువే కేంద్రబిందువు కాబట్టి, ఇతర బంధాలు, కుటుంబం, సామాజిక జీవనంలో ఉన్న బంధాల కంటే, ఆయనతో ఉన్న బంధమునకే అధిక ప్రాధాన్యతను ఇచ్చేవారు. ఈలోక అనుబంధాలను వీడి, అతి త్వరలో రానైయున్న క్రీస్తురాజ్యములో ప్రవేశం పొందడానికి వివాహమాధుర్యాన్ని సహితం తృణప్రాయంగా పరిత్యాగం చేసిన స్త్రీ పురుషులు చాలామంది ఉన్నారు.

అయితే బ్రహ్మచర్యం దైవానుగ్రహమని, అది అందరికి ఇవ్వబడలేదని, వారి వాంఛలను అదుపులో ఉంచుకోలేనివారు వివాహము చేసుకోవచ్చునని పౌలు గారు సెలవిస్తున్నారు (1 కొరింతీ 7:6-9). దీని ఉద్దేశ్యం వివాహం మంచిదికాదని కాదు, అవసరంలేదని కాదు, అపవిత్రమైనదని కాదు. నాటి క్రీస్తు రెండవరాకడ నిరీక్షణను బట్టి వీలైతే బంధాలకు దూరంగా బ్రహ్మచర్యం చేపట్టడం మేలని భావించేవారు. ఈ పౌలుగారి బ్రహ్మచర్య పిలుపునకు అనేకమంది స్పందించారు. ఆదిశ్రీసభ స్వచ్ఛందమైన అంగీకారాన్ని తెలిపింది. హెర్మాస్ కాపరి, వేదసాక్షియైన జస్టిన్, సిప్రియన్ కూడా వైవాహిక బంధాన్ని త్యజించి బ్రహ్మచర్య జీవితాన్ని అవలంభించాలని కోరుకొనియున్నారు. అప్పటికి, దాదాపు మధ్యయుగం వరకు కూడా వివాహమునకు ఒక ప్రత్యేకమైన సాంగ్యము స్థిరపరచలేదు. వివాహవాగ్దానాలు కూడా ఆలయంలోనే ఇచ్చుకోవలసిన అలవాటు లేదు, గురువు

యొక్క సన్నిధానం కూడా అవసరం లేదు. దంపతులే పరస్పరంగా వారి ఒప్పందమును ఎక్కడైనా, ఎప్పుడైనా పంచుకోగలరు.

## 1.3. శ్రీసభ పితరులు

అన్తియోకు ఇగ్నేసియుస్ 'వైవాహిక బంధమునకు మేత్రానుల సమ్మతి అవసరమని, అప్పుడే అది దేవుని ప్రణాళిక ప్రకారం జరిగిన వివాహంగా అంగీకరింపబడుతుంది అంటాడు'. 'క్రైస్తవులు వారి వివాహం గురువుల చేతుల మీదుగా జరగాలని కోరుకున్నారని, గురువు ఆశీస్సులతో పాపకార్యము పరిశుద్ధ కార్యంగా మారుతుందని, అలా పరిశుద్ధపరచబడితేనే సంతానసాఫల్యం కలుగుతుందని విశ్వసించేవారని' తెర్తూలియన్ రెండవ శతాబ్దంలోనే గుర్తించాడు.

సిప్రియన్ అను మేత్రానులు దైవాంకిత జీవితానికి సమర్పించుకున్న మఠవాసులను ఉద్దేశించి పలికేమాటలు ఒకింత ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించే విధంగా ఉన్నాయి: "మొదటి ఆజ్ఞ ఇవ్వబడింది 'బిడ్డల్నికని వృద్ధిచెందుడు' అని. రెండవది అవివాహిత (బ్రహ్మచర్య) జీవితానికి సంబంధించినది. ప్రపంచం శూన్యంగా చిన్నదిగా ఉన్నప్పుడు వివాహబాంధవ్యం ద్వారా సంతానాన్ని కని సంఖ్యను పెంచడానికి, మానవజాతిని అభివృద్ధి చేయడానికి స్త్రీ పురుషులు పిలువబడుతున్నారు. ఒక్కసారి లోకం సరిపోయినంత జనంతో నింపబడిన తర్వాత బ్రహ్మచర్య జీవితాన్ని జీవింపదలచిన వారు 'నపుంసకులుగా' మారి దైవరాజ్యం కోసం ప్రయాసపడగలరు. ఇది దేవుని ఆజ్ఞకాదుగాని, ఆయన ప్రోత్సాహం. దేనిని ఎంచుకోవాలో దేవుడు వ్యక్తిగత నిర్ణయానికి వదిలేస్తాడు, అంతేకాని ఎవరిమీద ఎటువంటి భారాన్ని మోపడు". అయితే ఈ సత్యాన్ని నాటి పరిస్థితులకు అనుగుణంగా సిప్రియన్ ప్రకటిస్తున్నాడు. ముఖ్యంగా దైవాంకిత జీవితానికి సమర్పించుకొని కూడా లోక సంపదలకు, అయోగ్యమైన కార్యాలు చేస్తుండగా వారిని హెచ్చరిస్తూ సిప్రియన్ ఈ మాటలు అంటున్నాడు.

క్రైస్తవ వివాహమును ఒక దివ్యసంస్కారంగా రూపొందించడంలో నాల్గవ శతాబ్దంలో అగుస్తీను వేదాంతము ఒక మైలురాయిగా నిలుస్తుంది. అనేకమంది వేదపండితుల దారిలోనే అగుస్తీను కూడా బ్రహ్మచర్య జీవితాన్ని ప్రోత్సహించినా,

మరోవైపు వివాహంలోని మూడు ప్రత్యేకమైన సుగుణాల గురించి 'వివాహశ్రేయస్సు' అను గ్రంథంలో బోధిస్తున్నాడు. మొదటిది: ప్రామాణికత (విశ్వసనీయత) – ఇది శారీరక కలయికకంటే ఉన్నతమైనది; రెండవది: సంతానం – ప్రేమతో వారిని స్వీకరించుట, అనురాగంతో వారిని పోషించుట, క్రైస్తవ బోధతో వారిని పెంచుట; మూడవది: దివ్యసంస్కారం – అవిచ్ఛిన్నతాబంధం దేవుని శాశ్వతబంధానికి సంకేతం.

## 1.4. మధ్యయుగం

మధ్యయుగంలో శ్రీసభ, అగుస్తీను ఆలోచనా వైఖరిని అవలంభించి, వివాహము నాకు దివ్యసంస్కారస్థాయిని ఇచ్చింది. అన్ని దివ్యసంస్కారాలు సమానము అని శ్రీసభ అప్పటికీ పూర్తి అవగాహనకు రాలేదు. వివాహమును అప్పటికీ ప్రవేశసంస్కారాలలోగాని, అనుగ్రహమును ఆపాదించు ఇతర సంస్కారాలలో గాని చేర్చలేదు. అయితే దివ్యసంస్కారాలశాస్త్రమును అధ్యయనం చేయు క్రమములో వివాహము కూడా ఒక దివ్యసంస్కారముగా ఎన్నిక చేయబడింది. వివాహము ఒక దివ్యసంస్కారము అని మొదటి అధికార ప్రబోధం 1184 సం॥లో వెరోనా సమావేశంలో చేయబడినట్లు తెలుస్తుంది. 1215 సం॥లో నాల్గవ లాతరన్ సమావేశం 'కేవలం బ్రహ్మచర్యం పాటించువారు, అవివాహిత జీవితం జీవించువారు కాదు, వైవాహిక బంధంలో ముడిపడిన వారు కూడా, వారి దృఢమైన విశ్వాసం మంచి క్రియల ద్వారా, దేవుని అనుగ్రహాన్ని పొందగలరు. శాశ్వత మహిమను పొందు అర్హతను కలిగియున్నారు' అని స్పష్టం చేసింది. రెండవ లియోన్ సమావేశం (1274 సం॥)లో శ్రీసభలోని ఏడు దివ్యసంస్కారాలలో వివాహము కూడా ఒకటి అని నిర్ణయించబడింది. జ్ఞానవివాహము మరియు గురుపట్టము అను దివ్యసంస్కారములు ఇతర ఐదింటి నుండి వేరుచేయబడి 'శ్రీసభను పెంపొందించు' దివ్యసంస్కారములుగా, ఆధ్యాత్మిక పరిపూర్ణతను అనుగ్రహించు సంస్కారములుగా అభివర్ణింపబడినాయి. అటుపిమ్మట 1439 సం॥లో ఫ్లోరెన్స్ సమావేశం వివాహమును ఒక దివ్యసంస్కారముగా ధ్రువీకరించింది.

క్లుప్తంగా చెప్పాలంటే, వివాహం గురించి మధ్యయుగ శ్రీసభ ప్రబోధం ఇలా సంగ్రహించబడింది: ఇతర దివ్యసంస్కారాలవలె జ్ఞానవివాహము కూడా, పవిత్రతకు ఆయుధంగా, అనుగ్రహమునకు వంతెనగా ఉండి, దేవుని కృపావరములను ఆశీస్సులను మానవాళికి అందించుటకు దోహదపడుతుంది. దేవుని వైవాహిక చట్టమును అనుసరించుటకు ఈ దివ్య సంస్కారము క్రైస్తవ దంపతులను పరిశుద్ధపరుస్తుంది.

## 1.5. ట్రెంట్ మహాసభ – సంస్కరణలకు సమాధానం

పదహారవ శతాబ్దంలో సంస్కర్తలు తలపెట్టిన సంస్కరణల ఆలోచనకు ఊతమిస్తూ అనేక వర్గాలు దివ్యసంస్కారాలలోని 'కృపానుగ్రహ స్వభావమును' నిరాకరించారు. దీనికి సమాధానముగా ట్రెంట్ మహాసభ, మార్చి 3, 1547 సం॥లో దివ్యసంస్కారములను శ్రద్ధతో అధ్యయనం చేసి, వాటికి సరియైన నామమును ఇచ్చి, వాటి అర్థాన్ని ఆవశ్యకతను వివరించి, పరిశుద్ధ వివాహము గురించిన 1184, 1208, 1274, 1439 సం॥లలో చేసిన ప్రబోధమును ధ్రువీకరించింది. పరిశుద్ధ గ్రంథమును, అపోస్తోలిక సాంప్రదాయమును, శ్రీసభ వేదపండితులు మరియు అంతకు ముందు జరిగిన సమావేశాల ప్రకటనలను క్షుణ్ణంగా పరిశీలించి ట్రెంట్ మహాసభ సభ్యులు ఏడు దేవద్రవ్యానుమానములే ఉన్నాయని, వివాహం అందులో ఒకటని, ఈ ఏడూ నిజముగా దేవద్రవ్యానుమానములే అని ధ్రుడపరచారు.

## 1.6. చట్ట ప్రబోధంలో వివాహం

శ్రీసభ చట్టం కతోలిక శ్రీసభ యొక్క అధికారిక నియమముల గ్రంథం. అది శ్రీసభకు సంబంధించిన అన్ని విషయముల గురించి నిర్దిష్ట నియమావళిని పొందుపరుస్తుంది. వివాహము దంపతుల శ్రేయస్సు కోసం, సంతానోత్పత్తి కోసం, బిడ్డల అభ్యాసం కోసం ఏర్పాటు చేయబడింది (కోడ్ ఆఫ్ కానన్ లా సంఖ్య 1055). వివాహము ఒక ఒప్పందం అని, ఒడంబడిక అని, ఒక దివ్యసంస్కారం అని బోధిస్తుంది. వివాహం దేవుడు మానవునితో ఏర్పరచుకున్న ఒప్పందమునకు, క్రీస్తు తన శ్రీసభతో చేసుకున్న నిర్మించుకున్న ఒప్పందమునకు

సూచనగా ఉన్నది. పరిశుద్ధ వివాహము అను దివ్యసంస్కారము వివాహపు ఉన్నతస్థితిని గ్రహించడానికి, బాధ్యతను నెరవేర్చడానికి తగిన ప్రత్యేక వరమును, అనుగ్రహమును దంపతులకు దయచేస్తుంది (కోడ్ ఆఫ్ కేనన్ లా సంఖ్య 1134). వివాహము చేసుకోడానికి చట్టపరమైన ఒక అనుమతి అవసరమని, ఇరువురి స్వచ్ఛందమైన అంగీకారం కావాలని బోధిస్తుంది (కోడ్ ఆఫ్ కేనన్ లా సంఖ్య 1108-2).

## 1.7. వివాహ యోగ్యతకు షరతులు

శ్రీసభ దృష్టిలో కతోలికులు యోగ్యముగా వివాహం చేసుకోవాలంటే అందుకు కొన్ని నియమాలు. కొన్ని షరతులు ఉన్నాయి. యోగ్యమైన వివాహానికి అవసరమైన అంశాలు నాలుగు: 1.దంపతులు 'వ్యక్తిగత స్వేచ్ఛతో' వివాహమాడాలి; 2. వారు పరస్పర సమ్మతిని అందించుకోవాలి; 3.జీవితాంతం వరకు కలిసియుండటానికి, ప్రామాణికంగా మెలగడానికి, సంతానాన్ని కాంక్షించడానికి ఈ వివాహం అను ఉద్దేశాన్ని కలిగి ఉండాలి; 4.వారు ఆ సమ్మతిని చట్టబద్ధమైన లిఖితపూర్వక పత్రంలో, ఇద్దరు సాక్షుల మధ్య, శ్రీసభ నియమించిన ఒక దైవసేవకుని సమక్షంలో వెల్లడించాలి. చివరి అంశానికి మినహాయింపు పొందాలంటే శ్రీసభ అధిష్టానం అనుమతి నిర్దిష్టమైన అనుమతి కావాలి. శ్రీసభ వివాహసమ్మతి తెలియజేయుటకు సభ్యులకు ఏడు నెలల సమయయుమును కేటాయిస్తుంది. ఈ మధ్యకాలంలో వివాహ అంతస్తులో ప్రవేశించ సిద్ధపడువారు 'భద్రమైన అభ్యంగనం' అవసరమైనవారు దానిని పొందగలరు (కోడ్ ఆఫ్ కేనన్ లా సంఖ్య 1065).

మిశ్రమ వివాహాల మరియు మతాంతర వివాహాల మధ్య అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం దంపతుల, కాపరుల ముఖ్యమైన బాధ్యత. కతోలిక వ్యక్తికి, జ్ఞానస్నానం పొందిన కతోలికుడు కాని వ్యక్తికి మధ్య జరిగే దానిని మిశ్రమ వివాహం అంటారు. కతోలికునికి జ్ఞానస్నానం పొందని వ్యక్తికి మధ్య జరిగేదానిని మతాంతర వివాహం అంటారు. శ్రీసభ ఇటువంటి వివాహాలను పూర్తిగా ఖండించడం లేదు. అది ఆమె ఉద్దేశం కూడా కాదు. అయితే దైవసంఘంగా,

దైవరాజ్యవిలువలు వెదజల్లే ఒక వ్యవస్థగా కుటుంబ జీవితానికి ప్రమాదం కలిగించగలిగే కొన్ని విషయాలలో శ్రీసభ ఖచ్చితమైన ఒక నియమాన్ని ప్రవేశపెడుతుంది. అలాంటి పరిస్థితులను ముందుగానే బేరీజు వేసుకొని అందుకు అవసరమైన సలహాలను, హెచ్చరికలను అందిస్తుంది.

శ్రీసభ దూరదృష్టిని గమనిద్దాం: "దంపతులు తమ సమాజాల నుండి అందుకున్న వాటిలోని సామ్యంగల అంశాలను క్రోడీకరించుకొని, ఒకరి నుంచి మరొకరు నేర్చుకొని క్రీస్తుకు నమ్మకంగా ప్రతివ్యక్తి జీవించే విధానాన్ని అలవర్చుకున్నపుడు, విశ్వాస భావ వ్యక్తీకరణలోని వ్యత్యాసం దంపతులు వివాహానికి జటిలమైన ఆటంకాలు కావు. కాని మిశ్రమ వివాహాల్లో ఉన్న కష్టనష్టాలను తక్కువగా అంచనా వేయకూడదు. స్వంత ఇంట్లోనే క్రైస్తవ అనైక్యత ఉందన్న విషాదానుభూతిని దంపతులు ఎదుర్కొంటారు. మతాంతర వివాహాలు ఆ సమస్యను మరింత జటిలం చేస్తాయి. విశ్వాసంలో వున్న వ్యత్యాసం, వివాహంపట్ల ఉన్న దృక్పథం, మత భావాలలో ఉన్న తేడాలు, వివాహంలోనూ మరీ ముఖ్యంగా పిల్లలకు విద్యనందించే విధానంలోనూ వచ్చే ఉద్రిక్తతలకు మూలం కావొచ్చు. మతం పట్ల అలక్ష్య భావం ఏర్పడవచ్చు.

ఒకవైపు ఇటువంటి వివాహాలు సాధ్యమే అని చెబుతూనే వాటిలో దాగియున్న ప్రమాదానికి పురిగోల్పే అంశాల పట్ల శ్రద్ధ వహించాలి అని శ్రీసభ బోధిస్తుంది. ఇటువంటి వివాహాలకు శ్రీసభ అనుమతి అవసరం అని తెలియజేస్తూనే, మతాంతర వివాహాలలో కతోలిక వ్యక్తికీ ఒక ప్రత్యేక బాధ్యత ఉంది అని గుర్తు చేస్తుంది. ఎందుకంటే అవిశ్వాసపు భర్త తన భార్య వలన ప్రతిష్టింపబడతాడు, అవిశ్వాస భార్య తన భర్త వలన ప్రతిష్టింపబడుతుంది (1 కొరింతీ 7:14). ఈ 'ప్రతిష్ట' ఆ వ్యక్తి స్వేచ్ఛగా క్రైస్తవ విశ్వాసం వైపుకు నడిపించగలిగితే ఆ వ్యక్తికి, శ్రీసభకు అత్యంత సంతోషం (1 కొరింతీ 7:16). యథార్థమైన వైవాహిక ప్రేమ, వినయంతో ఓపికగా కుటుంబ సుగుణాలను పాటించడం వలన, ప్రార్థనయందు నిలకడ విశ్వసింపని వ్యక్తి పరివర్తన కోసం కృపావరాన్ని అంగీకరించేలా చేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, కతోలిక విశ్వాసి

ఎటువంటి వివాహంలో ప్రవేశించినప్పటికీ తన మూలాలను, బాధ్యతలను మరువకుండా దేవుని ప్రణాళికకు అనుగుణంగా జీవించాలని శ్రీసభ ప్రకటిస్తుంది. అందుకే దీనిని జ్ఞానవివాహ సంస్కారం అంటారు. వివాహమును ఒక దివ్యసంస్కారముగా అధ్యయనం చేసిన తర్వాత, శ్రీసభ ఈ వైవాహిక కుటుంబ జీవితాన్ని ఒక ఐక్యతకు, ఒక పవిత్రతకు ఒక పిలుపుగా ప్రకటించడం – తన అధికారపత్రాల ద్వారా దానిని ప్రభోదించడం ఈ రెండవ అంశంలో చూద్దాం.

## అధ్యాయం రెండు:
## శ్రీసభ పత్రాలలో వైవాహిక కుటుంబం:
## ఐక్యతకు పవిత్రతకు ఒక పిలుపు

క్రీస్తు నుండి పొందిన ప్రబోధాన్ని ఆధారంగా చేసుకొని, శ్రీసభ శతాబ్దాలుగా వివాహము – కుటుంబం అను అంశముల గురించి సుసంపన్నమైన బోధనను అందిస్తూనే ఉంది. అందుకు ఒక గొప్ప నిదర్శనం: ఆధునిక ప్రపంచంలో శ్రీసభ అను రెండవ వాటికన్ మహాసభ అధికారపత్రం. ఇందులో వివాహ విశిష్టత, కుటుంబ వైభవం గురించి లోతుగా అధ్యయనం చేసి, అనేక విషయాలను పొందుపరచింది. స్త్రీ పురుషుల మధ్య అత్యంత సన్నిహితమైన వైవాహిక సంబంధాన్ని సృష్టికర్త ప్రభువే సృష్టించాడని, కుటుంబ జీవనాన్ని నడిపించే నియమాలను ఆయనే ఇచ్చాడని స్పష్టం చేస్తుంది.

వైవాహిక కుటుంబ విశిష్టత గురించి శ్రీసభ సత్యోపదేశం ఈ విధంగా అంటుంది: "వ్యక్తుల మేలి కలయిక క్రైస్తవ కుటుంబం. ఇది పిత పుత్ర పవిత్రాత్మ మధ్యనున్న సమైక్యతకు రూపం, సంకేతం". దైవవ్యక్తుల మధ్య నున్న ప్రేమ సమైక్యతలతో కుటుంబమును ముడివేయుట ద్వారా కుటుంబం అనునది 'ఐక్యతకు', 'పవిత్రతకు' ఒక పిలుపు అని శ్రీసభ చెప్పకనే చెబుతుంది. ఐక్యత పవిత్రతలు దైవీక లక్షణాలు, పరలోక ఆభరణాలు, వ్యక్తుల మధ్య సమైక్యతను పెంచుటకు కుటుంబంలోని ప్రేమ, ఆప్యాయత, మమతానురాగాలు దోహదపడతాయి. వైవాహిక కలయికలోని మాధుర్యం పరిపూర్ణంగా చవిచూసిన దంపతులు ఆ పవిత్రతను చిరకాలం నిలుపుకోగలరు.

## 11.1. కుటుంబం – ఐక్యతకు పిలుపు

కుటుంబం ఐక్యతకు పవిత్రతకు నిలయం. ద్వితీయ వాటికన్ మహాసభ వివాహంలోని ఐక్యత గురించి ఇలా సెలవిస్తుంది: "దంపతుల మధ్య నెలకొనే అనురాగం కేవలం భౌతికమైనది కాదు; అది ఆధ్యాత్మికమైనది, అపురూపమైనది. అది సాక్షాత్తు త్రీత్వైక దేవునిలోని ముగ్వురు వ్యక్తుల మధ్యగల నిర్మలమైన ప్రగాఢమైన ప్రేమ సరోవరం నుంచి పుడుతుంది. దైవానుగ్రహంతోనే అది స్వంతమవుతుంది. అంతేకాదు – క్రీస్తు ప్రభువుకు శ్రీసభకు మధ్యగల ప్రేమబంధం ఎంతటి స్వచ్ఛమైనదో, ఎంత నిస్వార్థమైనదో – దంపతుల మధ్య గల అనురాగబంధం కూడా అంతటి నిష్కళంకమైనది, గాఢమైనది".

వైవాహిక ప్రేమ దంపతులు సంపూర్ణంగా ఒకరికి ఒకరు ఇచ్చుకోవడంలో వ్యక్తమవుతుంది. మనిషి, మనసు, ఆత్మ అన్నీ ఏకంకావాలి. దేహముల కలయిక, అనురాగభావనా కలయిక, మనసులవాంఛ కలయిక, లోతైన వ్యక్తిత్వ కలయిక ఇవన్నీ చోటు చేసుకుంటేనే వైవాహిక ప్రేమసమర్పణం సాధ్యమవుతుంది. దంపతులు ఒకే హృదయం, ఒకే ఆత్మలుగా రూపొందడానికి ఇది మార్గం సులభం చేస్తుంది. ఈ దాంపత్య ప్రేమకు అవసరమైన లక్షణాలు: ఐక్యత అవిచ్ఛిన్నత, సంతానం పట్ల ఆకాంక్ష.

వైవాహిక ఐక్యత అవిచ్ఛిన్నత: "దేవుడు నిర్దేశించిన దాంపత్యబంధం సుస్థిరమైనది, శాశ్వతమైనది. వివాహసంస్కారంలో అంతర్భాగంగా దంపతులు ఒకరిపట్ల ఒకరు చూపుకొనే దాంపత్య ప్రేమ – ఒకరికొకరు ఆత్మ సమర్పణ కావించుకోవడం ద్వారా వ్యక్తమవుతుంది. ఇందులో భాగమైన లైంగిక జీవనం పవిత్రమైంది, ప్రగాఢమైంది, విశిష్టమైంది, గౌరవనీయమైంది. పవిత్ర హృదయాలతో దంపతులు ఒకరికొకరు తమను తాము సమర్పించుకోవడంలో పరిపూర్ణమైన ఆనందానుభవం ఉంటుంది, కృతజ్ఞతాభావం ఉంటుంది, వారిని ఏకశరీరులుగా మలుస్తుంది".

దంపతులు ప్రేమతో, ప్రేమలో ఐక్యమై యుండాలి. కలయిక, ఐక్యత, అవిచ్ఛిన్నతలు వివాహము యొక్క స్వభావము. ఇందులోనే వారి ప్రేమ

పరిపూర్ణమవుతుంది. వారు ఇద్దరు కాదు, ఒకే శరీరం (ఆది 2:24; మత్తయి 19:6). పరస్పరం ఒకరికోసం ఒకరు అర్పించుకుంటామని వాగ్దానం చేసినవారు. ఈ వాగ్దానాన్ని ప్రతినిత్యం మదిలో ఉంచుకొని జీవించాలి. ముఖ్యంగా కష్టంలో సుఖంలో వ్యాధిలో సౌఖ్యములో వారు కలిసిమెలసి ఉండాలి. ఒకరికి ఒకరు తోడుగా, ఆదరువుగా ఉండాలి. వివాహబంధాన్ని అవిచ్ఛిన్నం కావించే పరిస్థితులను మంచిమనసుతో విశ్వాసంతో ఆకళింపు చేసుకొని వాటిని ప్రేమతో జయించి వారి ఐక్యత శాశ్వతంగా ఉండునట్లు దంపతులు పూనుకోవాలి. ఈ ఐక్యత అవిచ్ఛిన్నత సమానత్వం, వ్యక్తిగత గౌరవం ప్రదర్శించడంలో విధితమవుతుంది.

సంతానం పట్ల ఆకాంక్ష: వివాహ వ్యవస్థ, వివాహప్రేమ ఒక లక్ష్యం కలిగియుంది: దేవుని సృష్టికార్యంలో భాగస్తులై, సంతానాన్ని కని, సమాజాన్ని వృద్ధిచేయడం. వివాహసాంగ్యంలో కూడా శ్రీసభ ప్రతినిధులు ఈ ప్రశ్నను వేస్తారు. "దేవుడు ప్రసాదించు సంతానమును ప్రేమతో స్వీకరించి క్రైస్తవ విశ్వాసంతో, శ్రీసభ బోధనలో పెంచుటకు సిద్ధముగా ఉన్నారా?" అని వారి మనోగతాన్ని తెలుసుకుంటారు. "సిద్ధముగా ఉన్నాము" అని దంపతులు సమాధానమిస్తారు. బిడ్డలు దేవుని వరము. ఆ బిడ్డలను కను భాగ్యము కేవలం వివాహబంధం ద్వారా మాత్రమే చట్టబద్ధంగా సాధ్యమవుతుంది. సంతానాన్ని పొందడం మాత్రమే కాదు, వారిని విశ్వాసంలో పెంచాలి, వారికి విద్యను అందించాలి. వారికి క్రైస్తవ మార్గాన్ని చూపించాలి. అనగా, తల్లిదండ్రులే వారికి ప్రథమ పాఠశాల, వారే వారికి ప్రధాన విద్యాబోధకులు. ఈ కర్తవ్యమును మోసినప్పుడు కుటుంబం "ఒక గృహస్థ శ్రీసభ" అవుతుంది. "ఈ భావనతో పరిశీలిస్తే జీవితాన్ని సేవించటమే వివాహం, కుటుంబ ప్రాథమిక కర్తవ్యం అని తెలుస్తుంది.

## 11.2. కుటుంబం – పవిత్రతకు పిలుపు

వైవాహిక ప్రేమలో భార్యాభర్తలు ఇరువురు బాధ్యతాయుతమైన తల్లిదండ్రులుగా ఉండాలంటే, వారు వారియొక్క ధర్మవిధుల గురించి అవగాహన కలిగియుండాలి. ఎందుకంటే, వైవాహిక ప్రేమకు జీవనోత్పత్తి (సంతానం)కి మధ్య అంతర్లీనంగా ఒక విడదీయరాని బంధం ఉంది. ఈ విషయాన్ని ఆరవ

పాపుగారు చక్కగా వర్ణిస్తున్నారు: "ప్రధానమైన కర్తవ్యాలను ఒక క్రమపద్ధతిలో పెట్టి, వాటి ప్రకారం వారి వారి విధులను వారిపట్ల, వారి కుటుంబముల పట్ల, సమాజము పట్ల శ్రద్ధతో నిర్వర్తించుటలో దంపతుల బాధ్యతాయుత శైలి కనిపిస్తుంది". ఈ ప్రధానమైన కర్తవ్యాలలో మొదటిది దైవపరిశుద్ధతలో పాలుపంచుకొని, వివాహబంధ ప్రేమలోని పవిత్రతను భద్రపరచుకోవడం. కుటుంబం పవిత్రమైనది. అది పవిత్ర త్రిత్వ దేవుని కుటుంబమును పోలియున్నది. విశ్వాసము ద్వారా, ప్రార్థన ద్వారా, సువార్తను వారి జీవితాలలో కేంద్రబిందువుగా ప్రతిష్ఠించడం ద్వారా కుటుంబం గృహస్థ శ్రీసభగా ఏర్పడి తమ కర్తవ్యంలో నిమగ్నమై ఉండుట ద్వారా అది పవిత్రతను పంచగలదు, పెంపొందించగలదు.

రెండవ జాన్ పాల్ పాపుగారు కుటుంబము గురించి ఒక ప్రత్యేకమైన శ్రద్ధను ప్రదర్శిస్తూ మానవీయ ప్రేమ మీద తాను చేసిన సత్యోపదేశంలో ప్రబోధిస్తున్నారు. వైవాహిక కోణంలో మానవ శరీర అర్థం గురించి, వివాహం కొరకై దైవప్రణాళిక గురించి, సృష్టి ఆరంభం నుండి కుటుంబతీరుతెన్నుల గురించి ప్రకటిస్తున్నాడు. ప్రత్యేకంగా వైవాహిక ప్రేమ గురించి మాట్లాడుతున్నాడు. ఈ పరస్పర ప్రేమ ద్వారా దంపతులు క్రీస్తు ఆత్మ వరాన్ని అందుకొని, పవిత్ర జీవితమునకైన పిలుపును వారు జీవింప సిద్ధమవుతున్నారు అని పేర్కొంటున్నారు. వివాహములో, కుటుంబజీవనంలో కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయ, అనురాగ బంధాలు ఏర్పడతాయి. వివాహం, పితృత్వం, మాతృత్వం, సంతానం, సహోదరభావం వీటి ద్వారా పవిత్రత ప్రబలి ప్రతీ వ్యక్తి మానవ దైవ కుటుంబమైన శ్రీసభలో ప్రవేశం పొందుతారు.

పదహారవ బెనెడిక్ట్ పాపుగారి బోధన వేదాంత కోణంలో ఆవిష్కరించ బడుతుంది. కుటుంబం సమాజమునకు ఒక సజీవకణం. అటువంటి కుటుంబమునకు ఆధారమైన వివాహబాంధవ్యం స్త్రీ పురుషుల మధ్య ప్రేమ, సిలువవేయబడిన క్రీస్తు ప్రేమతో పవిత్రపరచబడింది. వివాహ మరియు కుటుంబ సౌందర్యమును సమాజమునకు, భావితరముల వారికి అందించే బాధ్యత ప్రేమలో ఇమిడియుంది. దేవుని ప్రేమ మానవ ప్రేమకు కొలమానం. క్రీస్తు ప్రేమ వెలుగులో

కుటుంబ పవిత్రత ప్రకాశిస్తుంది అని శ్రీసభ ప్రబోధస్థాయిని పాపుగారు తెలియజేస్తున్నారు.

ప్రస్తుతకాలంలో ఫ్రాన్సిస్ పాపుగారి ప్రకటనలు విశ్వాస ఆదేశాలు ప్రపంచ ప్రాచుర్యం పొందుతున్నాయి. విశ్వాసానికి, ముఖ్యంగా కుటుంబ విశ్వాసానికి పెద్ద పీట వేస్తున్నారు. వైవాహికబంధంలో 'చిరకాల ప్రేమ వాగ్దానం' సుసాధ్యం కావాలి. వ్యక్తిగత ఆలోచనలు, వ్యక్తిగత పనుల కంటే పరస్పర అంగీకారానికి, గౌరవానికి తగిన స్థానం ఇస్తే ఇది ఖచ్చితంగా ఈ ప్రేమ పవిత్రత కుటుంబమును ఆవహిస్తుంది. తల్లిదండ్రులు వారి విశ్వాసాన్ని బిడ్డలకు సంక్రమింపజేయాలి. సమాజానికి వివాహము అందించు సహకారం అంతా యింతా కాదు, అది దంపతుల సొంత అవసరాలను, భావోద్వేగాలను మించియుండాలి. ఫ్రాన్సిస్ పాపుగారు కుటుంబ ప్రేమలోని మాధుర్యం, పవిత్రత గురించి ఏకంగా ఒక అపోస్తోలికా ప్రోత్సాహకర పత్రాన్నే పొందుపరచారు. అదే "ప్రేమానందం". దంపతుల ప్రేమ, వారి సంతానం సత్యమైన సజీవమైన ఒక స్వరూపం. అది రాతితో, బంగారంతో చేయబడిన చైతన్యం, జీవంలేని విగ్రహం కాదు. అది సృష్టికర్తను, రక్షకుని ప్రేమను ప్రదర్శించు ఒక జీవరూపం. అందుకే, ఫలవంతమైన ప్రేమ దేవుని 'అంతర్గత' జీవితానికి సంకేతం.

**ముగింపు**

వివాహవ్యవస్థ దేవునిచే ఏర్పాటు చేయబడింది. కుటుంబం వైవాహిక ప్రేమ బంధమునకు సంకేతం. ఆదియందు దేవుడు స్త్రీ పురుషుల అనురాగబంధాన్ని సృజించాడు. క్రీస్తు తన మరణ ఉత్థానముల ద్వారా పాపకళంకమైన మానవ కుటుంబమును పావనపరచి అది అనుగ్రహమును అందించే ఒక దివ్యసంస్కార స్థితికి చేర్చాడు. ఆ వివాహబంధం ద్వారా ఏర్పడు కుటుంబం ఐక్యతను పవిత్రతను పరిపూర్ణంగా పొంది సమాజ అభివృద్ధికి ఆశాకిరణంగా ఉంటుంది.

నేటి మన కనులముందు ప్రపంచం మారిపోయింది, మారిపోతూ ఉంది. బంధాలు యంత్రాలలో బంధించబడుతున్నాయి. 'మనం' అను మంత్రం కుతంత్రంతో మూటకట్టి మూలన పడవేయబడుతుంది. సామాజిక మాధ్యమాల

మాయలో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. మూడుముడులలోని 'త్రిత్వదేవ అనుబంధ' అర్థం మధ్యలోనే తెంచివేయబడుతుంది. మంగళసూత్రం క్రమరహిత ఆశలతో, ఆలోచనలతో అమంగళమౌతుంది. అనురాగబంధాలు అపవిత్రం అవుతున్నాయి. దంపతుల ఐక్యత, కుటుంబ సమైక్యత – సంతోషం సహవాసం – సమస్యల వలయంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నాయి.

మన బాధ్యత: వివాహ అర్థమును, వివాహ అంతిమ లక్ష్యమును ప్రతి అనుకూల సమయంలో ప్రబోధించాలి. యువతీ యువకులను బహుజాగ్రత్తతో వివాహ అంతస్తునకు సిద్ధం చేయాలి. వివాహసాంగ్యమును శ్రద్ధతో నిర్వర్తించాలి. సామాజిక పరిస్థితులను, ఎదురయ్యే కుటుంబంలోని ప్రతి సమస్యను విడిచిపెట్టకుండా 'విశ్వాసం'తో ఎదిరించులా దంపతులను ప్రేరేపించాలి. దాచితే సమస్య అంతంకాదు. రెండు ఆత్మలు, రెండు శరీరాలు ఒకటిగా మారిన వైవాహిక ఐక్యతతో సమస్య పరిష్కరించబడుతుంది.  వివాహం పట్ల, కుటుంబ బాధ్యతల పట్ల 'క్రీస్తుతత్వాన్ని' ప్రదర్శించాలి. పవిత్రాత్మకు కుటుంబంలో కాసింత చోటిచ్చి ఆయన నడిపింపును అనుమతించాలి. వివాహం పట్ల అపారమైన నమ్మకం, దాంపత్య జీవితం పట్ల అమితమైన గౌరవం, కుటుంబం పట్ల అమోఘమైన విశ్వాసం ఉన్నప్పుడే – సమాజశ్రేయస్సు సాధ్యమవుతుంది. ఇదే ప్రతి కుటుంబం దేవుని నుండి అందుకొని పిలుపు: ఐక్యతతో, పవిత్రతతో ఆదర్శకుటుంబంగా మారాలి.  ఆమెన్.

❊ ❊ ❊ ❊

# ౨. కుటుంబంలో యువత: మారుతున్న సామాజిక సంస్కృతి

**- ఫాదర్ అలెక్స్ జయరాజ్, SDB**

**ఉపోద్ఘాతం**



సమాజం అనేక కుటుంబాల సమ్మేళనం. కుటుంబం దేవుడు ఏర్పాటు చేసిన పవిత్రమైన వ్యవస్థ. కతోలిక శ్రీసభ బోధన ప్రకారం ప్రతి కుటుంబం ఒక చిన్న శ్రీసభను పోలి ఉంది. ప్రతి క్రైస్తవ కుటుంబం ఒక గృహస్థ శ్రీసభ. ప్రార్థనా అధ్యయనానికి ప్రధమ స్థానం క్రైస్తవ కుటుంబం (Catechism of the Catholic Church 2685) కాబట్టి శ్రీసభలో వలే ప్రతి క్రైస్తవ కుటుంబంలోని సభ్యులు ముఖ్యమైనవారే. వారి పాత్ర కూడా ముఖ్యమైనదే. కుటుంబ భవిష్యత్తుకు పాది యువతీయువకులు. అందుకే ఏ సంఘమైన ఏ సమాజమైనా యువతకు తమ బాధ్యతలను గుర్తు చేయాలి. వారి తీరు తెన్నులపై ప్రత్యేక శ్రద్ధను కనబర్చాలి. వారికున్న బాధ్యతలను సక్రమంగా నిర్వహించేలా ప్రోత్సహించాలి. వారిలోని ప్రతిభను గుర్తించి శ్రీసభ విధానాలలో నడిపించాలి.

ఈనాటి యువతరాన్ని వారి ఆలోచనలను అంచనా వేయడం చాలా కష్టం. వారి జీవనశైలిలో ఆలోచనా ధోరణిలో ఎన్నో మార్పులు వచ్చాయి; వస్తూనే ఉంటాయి కూడా. నేటి యువతలో సామాజిక స్పృహ లోపించి, కుటుంబ విలువల పట్ల ఆసక్తి సన్నగిల్లుతుంది. దైవభక్తి సన్నగిల్లి, నాస్తికవాద ఆలోచనలతో, నేను తప్ప నాకు ఎవరితో పనిలేదన్న స్వార్థపూరిత ధోరణిలో జీవిస్తున్నారు. తత్ఫలితంగా క్రైస్తవ దేవాలయాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్ర, తెలంగాణాలో ఉన్న కతోలిక యువతీయువకులను ఉత్తేజితులను చేయడానికి శ్రీసభ చేపట్టాల్సిన

చర్యలను గురించి, యువతా పరిచర్యలో ఆచరించాల్సిన మెళకువలను గూర్చి ఈ శీర్షికలో చర్చించుదాం.

## 1. నేటి సమాజంలో యువత

### 1.1. శక్తివంతమైన యువత

నేటి సమాజంలో మనం యువతను గమనిస్తే, వారిలో ఎన్నో మంచి లక్షణాలు కనిపిస్తాయి. యువతీయువకులు అనేక కార్యక్రమాల్లో ఉత్సాహంగా, చురుకుగా పాల్గొనడం చూస్తున్నాము. ఎంతటి కష్టమయిన పని అయినా ఒక సమూహంగా చాలా అవలీలగా చేయగల సామర్థ్యం వారికుంది. అయితే వారి శక్తిసామర్థ్యాలను సద్వినియోగం చేయగలగాలి. అనేక పర్యాయాలు యువత తమ శక్తిసామర్థ్యాలను మంచి పనుల కన్నా చెడు పనులు చేయటంలోనే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

### 1.2. లక్ష్యంవైపు దూసుకుపోయే మనస్తత్వం

నేటి యువతీ యువకులలో అనేకమంది తమ జీవితంలో ఏదో ఒకటి సాధించాలి అనే తపన కలిగి ఉన్నవారు మనకు ఎక్కువగా కనిపిస్తారు. తమ కెరియర్ డెవలప్ చేసుకోవాలనే తపన వారిలో మనకు కనిపిస్తుంది. విద్యార్థి దశ నుంచే అనేక రంగాలలో నైపుణ్యం సాధించి కొత్త విషయాలను నేర్చుకుని కుటుంబానికి సమాజానికి ఏదో ఒక విధంగా ఉపయోగపడాలనే మనస్తత్వం మన నేటి యువతలో చూస్తూ ఉన్నాం.

### 1.3. సాంకేతికత సామాజిక మాధ్యమాల వినియోగం

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో నేటి యువత చాలా ముందంజలో ఉంది. ఈనాడు ఇంటర్నెట్ ద్వారా అందుబాటులో ఉన్న సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవడంలో యువత చాలా ఆసక్తి చూపుతోంది. దీని ద్వారా అనేక కొత్త విషయాలు నేర్చుకోవడమే కాకుండా తమ లక్ష్యాలను చేరుకోవడంలో కూడా దానిని సద్వినియోగం చేసుకుంటూ ఉంది నేటి యువత. కానీ ఈ సామాజిక మాధ్యమాలే కొన్నిసార్లు యువత పెడత్రోవ పట్టడానికి కారణమవుతున్నాయన్న విషయాన్నీ మనం మరువకూడదు.

## 1.4. కుటుంబం పట్ల బాధ్యత లేకపోవడం

ప్రతి కుటుంబంలో యువత ప్రధాన పాత్రను పోషిస్తోంది. కుటుంబ బాధ్యతలను కొంతవరకు నిర్వహిస్తూ ఉంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత తమ బాధ్యతలను విస్మరిస్తూ స్వేచ్ఛగా తిరగాలని ఆశపడుతున్నారు. కుటుంబంలో ఎవరు ఎలా ఉన్నా తాము కోరుకున్నవి జరగాలని ఆశిస్తున్నారే కానీ, తాము కూడా ఎంతో కొంత కృషి చేస్తే తప్ప జీవితంలో దేనిని సాధించలేమని భావించడం లేదు. యువత బాధ్యతారహితంగా ప్రవర్తిస్తూ దుర్వ్యసనాలకు బానిసలై, ఆలస్యంగా ఇంటికి రావడం, కుటుంబ గౌరవాన్ని మంట కలపడం మరియు హింస కార్యక్రమాల్లో పాల్గొంటూ వారి భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకొంటున్నారు.

## 1.5. సామాజిక స్పృహ లేకపోవడం

యువతకు సమాజం పట్ల అవగాహన ఉన్నప్పటికీ తాము సమాజసేవలో పాల్గొనడానికి చాలా వరకు విముఖత చూపుతున్నారు. సామాజిక బాధ్యత లోపించి, స్వార్థపూరిత ఆలోచనలతో నిండి, తమతోపాటు జీవిస్తున్న వారి వైపు కన్నెత్తి చూడడం లేదు. తోటివారిని గమనించకుండా చుట్టూరా ఉన్న పరిస్థితులను పరిగణించకుండా స్వార్థంతో ఒంటరిగా జీవించాలని ఆశపడుతున్నారు. సామాజిక బాధ్యతలకు దూరంగా ఉండాలని యువత కోరుకుంటుంది. ఇది యువత అందరిలో కనిపించకపోవచ్చు. కానీ చాలా మందిలో ఈ ధోరణి కనిపిస్తుంది.

## 1.6. పాపం లేదన్న భ్రమలో ఉండడం

యువత ఏదో క్రొత్తగా జీవించాలని కొత్త అనుభూతులు ఆస్వాదించాలని అనేక ప్రయోగాలు చేస్తూ ఉంటారు. దురదృష్టం కొద్దీ ఆ ప్రయత్నాలు వారిని పాపంలోకి లాగుతుంటాయి. వారి దృష్టిలో పాపం పెద్ద నేరం కాదని అసలు ఈ ప్రపంచంలో పాపమే లేదన్న భ్రమలో జీవిస్తూ ఉంటారు. పునీత రెండవ జాన్ పాల్ పోపుగారు Centesimus Annus అనే అధికారపత్రంలో ఈ విధంగా అన్నారు: ఈ ప్రపంచంలో పాపం పెరిగిపోతుంటే ప్రజలకు పాప భీతి తగ్గిపోయి, పాపం అనేది లేదనే భావనతో బ్రతుకుతున్నారు. యువత పాపం లేదని భావిస్తూనే అనేక రకాల పాపాలు చేస్తూ నేరస్థులుగా మరియు సంఘవిద్రోహులుగా ఈ సమాజంలో పిలువబడుతున్నారు.

## 2. యువతలో సామాజిక మతపరమైన మార్పులు

### 2.1. పాశ్చాత్య సంస్కృతి పట్ల మక్కువ

నేటి యువతరం మారుతున్న సంస్కృతి పట్ల మరియు వాటిని అలవాటు చేసుకోవడంలో ఎక్కువ మక్కువ కనబరుస్తున్నారు. ఆధునిక నాగరికత, సంస్కృతి ఆకర్షణీయంగా ఉండడం వల్ల వారి వేషభాషలు ఆహారపు అలవాట్లు నేటి సమాజంలో ఉన్నతమైనవిగా పరిగణిస్తారు అన్న భ్రమతో వాటివైపు ఆకర్షితులవుతున్నారు. పాశ్చాత్య సంస్కృతిలోని కొత్తదనం వారి ఆలోచనలను ఎంతో ప్రభావితం చేస్తుంది. దీని వలన ఖరీదైన వస్తువులు కొనడం, ఖరీదైన ఆహారపు అలవాట్లు నేర్చుకోవడం యువతలో మొదలవుతుంది. ఈ సంస్కృతి వల్ల యువత మనుషులకు మానవతా విలువల కంటే వస్తువులకు ప్రాముఖ్యతనిస్తున్నారు. యువత తనలోని సృజనాత్మకతను ఉపయోగించకుండా ఊహా ప్రపంచంలో ఊగిసలాడుతుంది.

### 2.2. ప్రసార మాధ్యమాల ప్రభావం

యువత జీవన ప్రవాహంలో ప్రసార మాధ్యమాలు ఎంతో ప్రభావితం చూపిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. వారి సంపదను, సమయాన్ని మరియు వారి సృజనాత్మకతను సాంకేతిక మార్పులకు పణంగా పెడుతున్నారు. డిజిటల్ పరికరాలు మరియు సోషల్ మీడియా యువతకు ఒకవైపు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నా, మరోవైపు వారి బంగారు భవిష్యత్తుపై దుష్ప్రభావం చూపిస్తున్నాయి. 95 శాతం మంది యువత నేడు సెల్‌ఫోన్ లేకుండా దైనందిన జీవితాన్ని ప్రారంభించలేకపోతున్నారు. సెల్‌ఫోన్ సెల్ఫీ ప్రపంచం వారికి హుందాతనాన్ని హోదాని ఇస్తున్నాయని భ్రమపడుతున్నారు. విషయ పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరచడానికి వినియోగించాల్సిన ఈ సాధనాలు తమ జీవితాలని విషపూరితం చేస్తున్నాయని తెలుసుకోలేకపోతున్నారు. వీటి వాడకం ద్వారా మానవ సంబంధాలను తెంచుకొని అనేక ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు.

### 2.3. సాహసాలకు ఒడికట్టడం

యువత అంటే సాహసమని అలా చేయకపోతే యువతలో పసలేదని భావిస్తూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. కుటుంబం పట్ల ప్రేమ బాధ్యతలను

విస్మరించి ప్రమాదకరమైన ప్రయోగాలు చేస్తున్నారు. కుటుంబంలోని కష్టాలను ఇబ్బందులను పట్టించుకోకుండా విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేయడం, అవసరమైతే కన్నవారిని బెదిరించి అయినా లేదా భయపెట్టయినా వారి పంతాన్ని నెరవేర్చు కుంటున్నారు. సాహసం యువతలోని లక్షణం అయినప్పటికీ ప్రమాదకరమైన వాటిలో పాలుపంచుకోవడం ద్వారా భవిష్యత్తులో జరిగే పర్యవసానాల గురించి అంచనా వేయకపోవడం యువత అవివేకం. కుటుంబానికి దూరంగా జీవించాలని, అభివృద్ధి పేరిట ఏదో సాకుతో స్వేచ్ఛగా బ్రతకాలని ఆకాంక్షించడం యువతలోని ఇంకో లోపం.

## 2.4. దేవునిపట్ల భక్తి సన్నగిల్లుట

నేటి యువతకు భగవంతుని పట్ల భక్తి సన్నగిల్లుతుంది. దేవున్ని కూడా వ్యాపారముగా భావిస్తున్నారు. తల్లిదండ్రులు అందించిన విశ్వాసం ఇప్పుడు యువతకు చేదుగా మారిపోయింది. సాంకేతిక శాస్త్ర విజ్ఞానం పట్ల కొంత పరిజ్ఞానం సంపాదించడం వల్ల ప్రతిదీ మానవ ప్రయోగం గానే భావిస్తున్నారు. కుటుంబంలో చిన్నతనం నుండి ఆధ్యాత్మిక సామాజిక విలువలు నేర్చుకుంటే సభ్య సమాజంలో నైతికత ఉండేది. ఈ రోజు మన దేవాలయాలు యువత లేక బోసిపోయి ఉన్నాయి. ప్రార్థన యువతకు ఎంతమాత్రం రుచించడం లేదు. దేవుడు లేడని అంతా ఇహలోకం అని ప్రచారం చేసే సంఘాలు యువతను బాగా ఆకర్షిస్తున్నాయి. ప్రపంచంలో ప్రతిదీ వ్యాపారమే అన్న సందేశాన్ని యువతకు అందిస్తున్నారు.

## 2.6. శ్రీసభలో భాగస్వామ్యం

నేటి యువత శ్రీసభ కార్యక్రమాలలో చురుకుగా పనిచేయకపోవడానికి అనేక కారణాలు ఉండవచ్చు. కానీ కతోలిక కుటుంబాలలో యువతీయువకులు విచారణలో జరిగే ప్రతి సదస్సులో స్వచ్ఛందంగా పాల్గొనేలా తల్లిదండ్రులు మరియు విచారణ గురువులు ప్రోత్సహించాలి. విచారణలో యువత పట్ల వైషమ్యాలు విభేదాలు తారతమ్యాలు లేకుండా జాగ్రత్త తీసుకోవాలి. యువతకు తమ పాత్రను పోషించే స్వతంత్రత కల్పించాలి. ఆధ్యాత్మిక సంఘాల ద్వారా వారి బాధ్యతను గుర్తు చేయాలి. శ్రీసభలో వారికున్న ప్రాధాన్యతను తెలియజేయాలి. శ్రీసభ సుస్థిరతను వారు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించేలా ప్రేరేపించాలి.

## 3. శ్రీసభ యువత గురించి ఏమి మాట్లాడుతుంది?

### 3.1. యువత శ్రీసభకు అవసరం

ఇటీవల మన ఫ్రాన్సిస్ పోపుగారు ఒక సందర్భంలో మాట్లాడుతూ నేటి శ్రీసభకు యువత అవసరం ఎంతో ఉంది. అలాగే యువతకు శ్రీసభ పట్ల ఆదరణ ఉండాలి అని అన్నారు. నిద్రాణమైపోతున్న ఈ ప్రపంచాన్ని లేపాలంటే ఉప్పొదనం లాంటి ఆత్మస్థైర్యం ఉన్న యువత శ్రీసభకు కావాలి అన్నారు. యువత శ్రీసభకు ఆయువుపట్టులా ఉండాలే కానీ ఆదరణకు నోచుకోని శ్రీసభగా మార్చకూడదు. అన్ని వర్గాల యువతీయువకులు శ్రీసభకు అపురూప వరాలు. వారు ఎప్పుడూ శ్రీసభ ఔన్నత్యాన్ని కాపాడే సైనికుల్లా ఉండాలని శ్రీసభ ఆశిస్తుంది.

### 3.2. యువత శ్రీసభలో బాధ్యతలు చేపట్టాలి

శ్రీసభ జీవన విధానంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు. ప్రత్యేకించి శ్రీసభలో యువత బాధ్యతలను చేపట్టాల్సిన అవసరముంది. సువార్త సేవలు ప్రజారంజకమైన సేవలో శ్రీసభ సుస్థిరత కోసం యువతీ యువకులు ముందుండాలి. ప్రార్థనా జీవితంలో అందరికీ ఆదర్శమై ఆధ్యాత్మిక విలువలకు అద్దం పట్టే విధంగా మరియు విచారణలో తాము నిర్వహించే ప్రతి పనిలో తలమానికంగా జీవించాలని కోరుతుంది శ్రీసభ. మన పునాది శ్రీసభ. మన జీవనం శ్రీసభ. మన భవిష్యత్తు శ్రీసభ. శ్రీసభ వెలుగొందాలి అంటే యువతరం తరిగిపోని చమురులా బ్రతికించాలి. ఇతరుల బ్రతుకులను మార్చేలా యువత పాటుపడాలి. శ్రీసభ ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలి. బాధ్యతలు చేపట్టి మరియు పూర్తి భాగస్వాములుగా వ్యవహరించాలి.

### 3.3. యువత శ్రీసభ భవిష్యత్తు

శ్రీసభ యువత భవిష్యత్తును ప్రకాశింప చేస్తుందని Familiaris Consortioలో పునీత రెండవ జాన్ పాల్ పోపుగారు ఉద్ఘాటిస్తున్నారు. యువత జీవిత విధానాలను వారి ప్రణాళికలను ప్రభావితం చేయగల శక్తి శ్రీసభకు ఉంది. యువతలోని ఆశయాలకు ఊపిరి పోస్తుంది. వెలుగు ఆరిపోతున్న జీవితాలకు ప్రాణం పోస్తుంది. యువతను భవిష్యత్తులో సన్మార్గములో నడిచేలా

వారి ఆధ్యాత్మిక సామాజిక జీవన శైలికి క్రొత్త రూపాన్ని ఇవ్వగలిగే శక్తి శ్రీసభకు ఉంది. యువత శ్రీసభ భవిష్యత్తు. యువత ఎన్నో అవరోధాలను ఆటంకాలను ఎదుర్కొన్నా వారిలోని తేజస్సు నశించకుండా శ్రీసభ వారిని ప్రోత్సహిస్తూ తన వారసులుగా తీర్చిదిద్దడానికి ఎన్నో కార్యక్రమాలను నిర్వహించి శ్రీసభ ఔన్నత్యాన్ని, ఆచారాలను తెలిసికొని విశ్వాస పథంలో జీవించేలా చేస్తుంది.

## 3.4. ఆధునిక యువత – సంస్కృతి

నేటి ఆధునిక యువత సంస్కృతి ఎందరినో ఆకర్షిస్తుంది. వీరి సంస్కృతిలో విభిన్న భాషలు, భావాలు, ఆచారాలు, శైలి, విధానాలు, దుస్తులు, రూపురేఖలు మనల్ని ఆశ్చర్యపరుస్తూనే ఉంటాయి. పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడి యువతీ యువకులు స్వంత ఆచార సంస్కృతులకు మంగళం పాడుతున్నారు. విభిన్న ఆలోచనా ధోరణి భాషా ప్రయోగాల ద్వారా జీవన విధానాల ద్వారా తాము ఒక క్రొత్త ప్రపంచంలో ప్రయాణం చేస్తున్నారు. అనాదిగా వస్తున్న మత సంప్రదాయాలను కుటుంబ ఆచారాలను త్రోసివేస్తున్నారు. పునీత రెండవ జాన్‌పాల్ పోపుగారు భారతదేశాన్ని సందర్శించినప్పుడు తాను విడుదల చేసిన ఆసియాలో శ్రీసభ అనే అధికార పత్రంలో ఈ విధంగా ఉద్ఘాటిస్తున్నారు – భారతదేశంలో విభిన్న సంస్కృతులు సంప్రదాయాలు ఉన్నాయి. వాటిని ప్రజల జీవన విధానంలో నుంచి తొలగించడం సరికాదు దానికి బదులుగా ఆ సంస్కృతి సంప్రదాయాలను ప్రక్షాళన చేసి వాటికి నూతన అర్థాన్ని ఇస్తూ క్రైస్తవ జీవితంలో మిళితం చేసుకోవటం సబబుగా ఉంటుంది. వారి సంస్కృతిని గౌరవిస్తూనే చెడుగా ఉన్న వాటిని మారుస్తూ పవిత్రమైన సంస్కృతిగా నలుగురికి ప్రీతిపాత్రంగా మలచుకోవడం మన బాధ్యత.

## 3.5. శ్రీసభ యువతను ఆకర్షించే విధంగా ఉండాలి

శ్రీసభ యువతను ఆకర్షించే విధంగా ఉండాలి అని ప్రస్తుత పోపు గారు సెలవిస్తున్నారు. నేటి పరిస్థితుల్లో కాథలిక్ యువత శ్రీసభకు దూరంగా వెళ్లిపోతున్నారు అంటే యువతను ఆకట్టుకోలేని కొన్ని అంశాలను గూర్చి మనం తప్పక చర్చించాల్సి వుంది. యువతను ప్రోత్సహించలేని కార్యక్రమాలైనా, యువతను చైతన్యవంతం చేయలేని సందేశాలైనా, వారి ఆశయాలకు ప్రేరణ

కల్పించలేని సమావేశాలు సంఘాలైన నిష్ప్రయోజనమే. శ్రీసభ యువత పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. సమర్థులైన ఆధ్యాత్మిక గురువులను విచారణలలో నియమించాలి. యువతను ఆకట్టుకునే ప్రార్థన సమావేశాలను, విహారయాత్రలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలను కనీసం పండుగ దినములలోనైనా నిర్వహించాలి. సమాజ సేవలో పాల్గొనే వారిని ప్రోత్సహిస్తూ గుర్తింపునివ్వాలి.

## 3.6. యువతలోని నాయకత్వ లక్షణాలను ప్రోత్సహిస్తోంది

శ్రీసభ అనునిత్యం యువతలోని ప్రతిభలను నైపుణ్యాలను వెలికితీస్తుంది. వారిలోని నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించడానికి అనేక దైవీక సంఘాలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. 'యువత వీరుని చేతిలోని బాణాల వంటివారు" అని సామెతల గ్రంథం చెబుతోంది. వారికి ఎన్నో మెలుకువలు నేర్పిస్తూ రానున్న క్రొత్త ప్రపంచంలో క్రైస్తవ నాయకుల్ని తయారు చేస్తుంది. శ్రీసభ సమర్థులైన నాయకులుగా తీర్చిదిద్దడం కోసం ప్రతి విచారణలో యువత సంఘాలను నిర్వహిస్తోంది. హక్కుల గురించి బాధ్యతల గురించి తెలియజేస్తుంది. బైబిల్ గ్రంథంలోని నాయకులను వారికి ఆదర్శంగా చూపిస్తూ క్రైస్తవ విలువలతో యువతను నడిపే బాధ్యత ప్రతి ఒక్క గురువుకు ఉంది.

# 4. విచారణలలో యువత పరిచర్యకి కొన్ని ప్రతిపాదనలు, సూచనలు

## 4.1. మంచి కాపరి పద్ధతి

యేసుప్రభు ఓ మంచి గొర్రెల కాపరి. తన గొర్రెల కోసం తన ప్రాణాన్ని ఇవ్వడానికి కూడా సిద్ధపడ్డారు. అలాగే క్రైస్తవ సంఘంలో ప్రతి ఆధ్యాత్మిక గురువు ఒక మంచి కాపరి. తన సంఘాన్ని పాలించాలి అవసరమైతే వారి కోసం తన ప్రాణాన్ని ఇవ్వడానికి కూడా వెనుకాడరాదు. నేటి సమాజంలో యువతీ యువకులు కాపరిలేని గొర్రెల వలె ప్రయాణం చేస్తున్నారు. వారిని కాపాడడం సరైన మార్గాన్ని చూపించడం ఒక గురువుగా అది తన బాధ్యతగా భావించాలి. వారితో ప్రేమగా మాట్లాడటం, వారి కష్టసుఖాలు తెలుసుకోవడం, వారి లక్ష్యాలను, ఆశయాలను తెలుసుకొని, వారిని సన్మార్గంలో నడిపించాలి. ఒక మంచి కాపరిలా వారితో కలిసి నడవడానికి సిద్ధపడాలి. ఇది ఆధ్యాత్మిక గురువులు యొక్క ప్రథమ కర్తవ్యంగా భావించాలి.

## 4.2. ఎమ్మావుస్ పద్ధతి

యేసుప్రభు మరణానంతరం ముగ్గురు యువకులు అనుకున్న ఆశలు అడియాసలయ్యాయని నిరాశతో ఎమ్మావుస్ నగరానికి ప్రయాణమైనప్పుడు మార్గమధ్యంలో యేసుప్రభు అనుసరించిన పద్ధతి. తానే స్వయంగా ముందుకు వెళ్లి వారి సంభాషణలో పాలుపంచుకుని, వారి ఆందోళనను, నిరాశ పలుకుల్ని శ్రద్ధగా విని వారికి అర్థమయ్యేలా వివరించి చెప్పారు. వారే స్వయంగా తమతో ఉండిపొమ్మని ఆహ్వానించేలా చేశాడు. వారితో కలిసి కూర్చొని తన గురించి వ్యక్తపరచినప్పుడు వారి కళ్ళు తెరవబడ్డాయి. వారు యేసుప్రభువును గుర్తించేలా చేశాడు, భవిష్యత్తుపై నమ్మకాన్ని పదిలం చేసుకునేలా చేశాడు, వారిలో మార్పు వచ్చింది. భవిష్యత్తులో వారు చేయవలసిన కర్తవ్యం గుర్తుకు వచ్చింది. అలాగే ప్రతి విచారణలో గురువు, ఆధ్యాత్మిక నాయకులు యువతతో నడవాలి, వారి ఆశలు, ఆందోళనలు, అభిప్రాయాలను వినాలి, విషయాలను వివరించి, అర్థమయ్యేలా తెలియజేసి భవిష్యత్తులో శ్రీసభలో వారికున్న ప్రాముఖ్యతను బాధ్యతను ఎలా నెరవేర్చాలో తెలియజేసి సంకల్ప సిద్ధితో శ్రీసభకు ఎలా సాయపడాలో యువతను సిద్ధం చేయాలి.

## 4.3. సమరయ స్త్రీ సంభాషన పద్ధతి

ఆచారాలు, కట్లుబాట్లు ప్రతి మతంలో, ప్రతి సంఘంలో మరియు ప్రతి సమాజంలో ఉన్నాయి. యేసుప్రభువు సంస్కృతి సాంప్రదాయాలకు అతీతంగా ప్రయాణం చేసి సంఘం వెలివేసిన స్త్రీతో విచిత్రమైన పరిస్థితుల్లో బ్రతుకుతున్న ఆ సమరయ స్త్రీతో సంభాషించి ఆమె జీవితాన్ని మార్చి ఆమెనే తన సువార్త సాధనంగా మార్చుకున్నారు.

ఇదే పద్ధతిని ప్రతి విచారణలో గురువు కూడా కులాలకు, వర్గాలకు మరియు వర్ణ భేదాలకు అతీతంగా క్రైస్తవ ప్రయాణం చేయవచ్చు. యువత అభిలషిస్తున్న, అభిమానిస్తున్న సంస్కృతిలో నుండి పవిత్రులుగా మార్చి శ్రీసభ సేవకులుగా మలచవచ్చు, మొదటిగా కావలసింది ఎంతో ప్రేమగా సంభాషించే మనస్తత్వం, వారిని అర్ధం చేసుకుని నడిపించే సమర్థత, మరియు వారిని శ్రీసభకు సాక్షులుగా మార్చుకునే మెలుకువలు ఉండాలి.

## 4.4. మంచి సమరీయుని పద్ధతి

యువతను మంచి సమరీయులుగా మార్చుకోవడం ఇంకొక పద్ధతి. యేసుప్రభువు వివరించిన ఉపమానాలలో అతి శ్రేష్టమైన, మానవత్వానికి ప్రతీకగా ఉన్న ఉపమానం మంచి సమరీయుడు. కష్టాల్లో, అవసరాల్లో ఉన్న వారిని ఆదుకోవడమే క్రైస్తవ లక్షణం అని ఈ ఉపమానం ద్వారా యేసుప్రభువు తెలియజేశారు. అదే విధంగా యువతను మార్చి క్రైస్తవ విలువలతో అటు శ్రీసభకు ఇటు సమాజానికి సేవచేసే మంచి యువతగా మార్చటమే మన ధ్యేయం. వారి జీవితంలో మార్పు, వారి క్రైస్తవ జీవితంలో వెలుగు, అవసరంలో ఉన్న వారిని ఆదుకునేలా మంచి మనస్తత్వాన్ని అలవరచుకునేలా చేయాలి. ప్రతి గురువు అవసరాలలో ఆపదలో కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి మన కతోలిక యువత వారికి సహాయపడే విధంగా తీర్చిదిద్దాలి.

### ముగింపు

యువత పరిచర్యలో గురువులు అనేక మెలుకువలు పాటించాలి. బైబిల్ జ్ఞానాన్ని సృజనాత్మకంగా యువతీయువకుల్లో నింపాలి. కౌన్సెలింగ్ ద్వారా వారిలోని భయాన్ని పోగొట్టాలి. యువత తమ పాత్రను ఆత్మస్థైర్యంతో పోషించేలా చేయూతనివ్వాలి. అవసరమైతే సదస్సులు నిర్వహించి వారికి కావలసిన సహాయ సహకారాలు అందించాలి.

ఆంధ్ర తెలంగాణ శ్రీసభలో యువత పోషించే పాత్ర ప్రధానమైనది. నేటి కతోలిక కుటుంబాలలో వారు జీవించే విధానము మరియు వారు చేపట్టే బాధ్యతలు శ్రీసభపై ఎంతో ప్రభావాన్ని చూపిస్తాయి. సరళమైన ఆలోచనలో ఉన్న యువత సరళమైన జీవితాన్ని జీవిస్తుంది. క్రైస్తవ మౌలిక విలువలతో మరియు క్రైస్తవ మూలాలతో ఏకీభవిస్తూ, వారి జీవిత విధానంలో బాధ్యతలు తెలుసుకునేలా వారిని నడిపించాలి. యువతను సువార్త సేవలో, సామాజిక సేవలో క్రీస్తు సాక్షులుగా నిలబెట్టి గురుతర బాధ్యతను ఆధ్యాత్మిక గురువులు చేపట్టాలి.

❀ ❀ ❀ ❀

# 3. క్రైస్తవ కుటుంబాలలో విశ్వసనీయత, తల్లిదండ్రులు, మత గురువుల పాత్ర

- శ్రీమతి పల్లి జయమ్మ



## కుటుంబము నిర్వచనము

పవిత్ర బైబిలు నందు 'కుటుంబము' అనే పదమునకు 'వంశము' అని మూల అర్థము.

16వ బెనెడిక్ట్ జగద్గురువులు కుటుంబమును గూర్చి ఇలా అన్నారు. "స్త్రీ పురుషుల మధ్యగల ప్రేమ అనే పునాది మీద నిర్మింపబడిన సమాజమే మానవజాతికి మంచి కుటుంబమవుతుంది".

మానవ సమాజంలో ప్రాథమిక వ్యవస్థ - 'కుటుంబం'. దేవుడు సృష్టి ప్రణాళికలో కుటుంబానికి ఒక ప్రత్యేక స్థానం ఇచ్చి ఆది దంపతులైన ఆదాము ఏవలను తన సంరక్షణతో ఏదోను తోటలో వుంచారు.

నరుడు ఒంటరియై యుండుట మంచిది గాదని సంసార స్థితియే అందరికి తగినదని (ఆది 2:18) ఈ పవిత్ర వివాహమును, కుటుంబమును ఏర్పరచెను.

త్రిత్వైక దేవుడే - పిత, పుత్ర, పవిత్రాత్మలతో కూడిన ఒక సంఘం. ఒక సహవాసం. మానవ సమాజ పరిధిలో - సమాజానికి ప్రాథమిక రూపం 'కుటుంబం'. ఈ కుటుంబము ఆత్మీయానుబంధాల సమాహారం. "కుటుంబము మంగళకరమైనది, సమాజానికి పునాది వంటిది. దంపతులకు జీవన భద్రత కల్పించు పెన్నిధి వంటిది. దంపతులు పరస్పరం వ్యక్తం చేసుకునే నిస్వార్థమైన పరిపూర్ణమైన ప్రేమకు, ఆత్మ సమర్పణకు ఫలితంగా కలిగిన సంతానానికి

కుటుంబము సకల శుభములను ఒనగూర్చుతుంది. ఈ కుటుంబంలోనే క్రైస్తవ విశ్వాసం వికసిస్తుంది. కుటుంబమే ఒక సూక్ష్మ "శ్రీసభ", "గృహస్థ శ్రీసభ".

## విశ్వాసము నిర్వచనము

విశ్వాసము అనగా విశ్వసించుట. గ్రీకు భాషలో 'పెస్తిన్'. 'పిస్తేయన్' అంటారు. 'పెస్తిన్' అనగా అభయం, నమ్మకం. పరిశుద్ధ గ్రంథంలో చూచినట్లయితే మనము నిరీక్షించు విషయములందు నిస్సందేహముగా ఉండుట, మనము చూడజాలని విషయములను గూర్చి నిశ్చయముగా ఉండుట (హెబ్రీ 11:1).

హబక్కూకు "నీతిమంతుడు విశ్వాసము చేతనే బ్రతుకునని విశ్వాసమే రక్షణకు సాధనమని" ముందుగనే తేటపరచెను. దేవుని మాటను నమ్మి అబ్రహాము బయలుదేరి దేవుడు నడిపించిన చోటికి వెళ్లాడు. అతడు విశ్వాసులందరికి తండ్రి. క్రొత్త నిబంధన యందు ఇతరులు విశ్వాసము చూపని యెడల ఆయన అద్భుతకార్యములు చేయలేదు (మార్కు 6:5-6). కనుక విశ్వాసములేని క్రియలు వ్యర్థము. 'కుటుంబము' ఒక మహా సముద్రమైతే 'విశ్వాసము' మనలను క్షేమంగా ఆవలి తీరం చేర్చే క్షేమకరమైన చిన్న దోనెలాంటిది. కనుక క్రైస్తవ కుటుంబాలలో విశ్వాసము పునాది. ప్రథమంగా దేవుని పట్ల విశ్వాసం ఉంటే వ్యక్తుల పట్ల, సమాజం పట్ల చివరికి వారి పట్ల వారికి 'నమ్మకం' ఉన్నట్లే.

## క్రైస్తవ కుటుంబము

క్రైస్తవ కుటుంబము ఒక 'సూక్ష్మ శ్రీసభ' కనుక కుటుంబ సభ్యులందరు విశ్వాస విషయంలో ఒకరినొకరు బలపరుచుకుంటూ ఉండాలి. భక్తి జీవనంతో ఒకరినొకరు మించిపోయేందుకు ప్రయత్నించాలి. కుటుంబ సభ్యులందరు క్రీస్తు ప్రభువుతో సంబంధం కలిగి వుండి ఆయనను రక్షకునిగా స్వీకరించాలి. మానవులకు మంచి ఉపయోగకరంగా ఉండుటకే కుటుంబాన్ని (ఎఫెసీ 5:22) సృష్టించారు.

విశ్వాసం, ఆశాభావం, ప్రేమ వున్న కుటుంబం శ్రీసభలో విలక్షణమైన క్రైస్తవ ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

నూతన నిబంధన ఇందుకు నిదర్శనంగా నిలుస్తుంది. ఇందుకు క్రీస్తు ప్రభువే సాదృశ్యంగా నిలుస్తారు.

'తిరు కుటుంబం' ఆదర్శవంతమైన కుటుంబము. ఆనాడు క్రీస్తు ప్రభువు సంఘాన్ని ఎలా ప్రేమించారో, ఈనాడు భర్త తన భార్యను అలాగే ప్రేమించాలి. భార్య కూడా భర్తను గౌరవించి, ప్రేమించి కుటుంబ బాధ్యతను మన:పూర్వకంగా అతనికి అప్పగించాలి. భర్త ఆధ్యాత్మికంగా క్రీస్తునందు ఎదిగి తన భార్యాపిల్లలను దైవ ప్రేమతో బైబుల్ సత్యంతో జీవింప చేస్తారు. భార్యాభర్తలుగా దైవ పిలుపును అందుకున్న వారు కలిసి మెలిసి అంకితభావంతో కుటుంబ బంధాన్ని క్రమంగా అల్లుకొని, బంధువులను విస్మరించక ఒక ఆదర్శ కుటుంబాన్ని ఏర్పరచుకోవాలి. తండ్రులైనవారు తమ పిల్లలను క్రమశిక్షణలోను, ప్రభువు బోధనలోను పెంచాలి అని పునీత పౌలు (ఎఫెసీ 6:4) లో చెప్పుచున్నారు. ఇంకను (1 తిమోతి 5:8) లో "ఏ తండ్రియైనను తన బంధువులను గూర్చియు, అందున విశేషించి తన కుటుంబమును గూర్చి శ్రద్ధ వహింపనిచో అతడు విశ్వాసమును విడనాడినట్లే. అట్టివాడు అవిశ్వాసి కంటె చెడ్డవాడు". కనుక తన కుటుంబమును విశ్వాస పథమున నడుపుటకు ఎలాంటి ప్రయత్నము తండ్రి చేయలేనిచో తను ఖచ్చితంగా నిజ క్రైస్తవుడు కానట్లే. అలానే (సామెతలు 31). స్త్రీ అనగా భార్య ఒక ఆదర్శ గృహిణిగా తన బాధ్యతలను దేవునిపట్ల విశ్వాసముతో, కుటుంబము పట్ల ప్రేమతో నెరవేర్చాలని పవిత్ర గ్రంథం చెబుతుంది. ఇది తన భర్త పూర్తి బాధ్యత అనకుండా తన వంతు తన కుటుంబానికి విలువలు, సేవలు అందించటంలో నిజమైన క్రైస్తవ కుటుంబం ఏర్పడుతుంది.

(ఆది 2:18-20) నందు స్త్రీని పురుషునికి భార్యగా ఇచ్చుటకు కారణము అతనికి సహాయకారిణిగా వుంటూ తమ సంతానమును ప్రేమతో సాకుతూ వుండాలి అని. ఈ విధంగా క్రైస్తవ దంపతులు పవిత్ర వివాహ బంధముతో ముడిపడి క్రీస్తునందు విశ్వాసముతో జీవితాంతము కలిసి జీవించుటయే కుటుంబము. అందుకే దేవుడు స్త్రీ పురుషులను సమానంగా తన రూపములో సృష్టించారు. కనుక భర్తగాని, భార్యగాని తమ కుటుంబ పోషణలోను, బాధ్యతలలో సమానులే,

ఎక్కువ తక్కువలు ఉండకూడదు. అందువలన క్రైస్తవ కుటుంబంలో పనులు వేరైనప్పటికి భార్యభర్తల పాత్ర ఒక్కటే.

ఈ పత్రాన్ని నేను ఈ అంశముపై మాట్లాడటానికి ఇది నాకు దేవుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తూ.. ఆదర్శంతమైన క్రైస్తవ కుటుంబమంటే అందులోనే సభ్యులందరి బాధ్యతలు, అంకితభావం, క్రీస్తుప్రభువు సేవలోనే ఉండిపోవాలని కోరుకుంటున్నాను. అందుకు నా వంతు బాధ్యతగా ఈ అంశంతో ఈ చర్చలో పాల్గొంటున్నాను.

ఎప్పుడైతే భర్త, భార్య, పిల్లలు దేవుడు తమకిచ్చిన పాత్రను తమ జీవితం ద్వారా సరిగ్గా పోషిస్తారో అప్పుడు వారి గృహాల్లో శాంతి, సమాధానము, సంతోషము నెలకొని వుంటుంది. కాని క్రైస్తవ కుటుంబాలలో క్రీస్తు ప్రభువు అధిపతిగా లేనిచో, మరియు ఆయన బైబిలు ద్వారా మనకు ప్రేమతో ఒసగిన నియమ నిబంధనలు లేకున్నను ఆ గృహం ఎంతగానో బాధపడవలసి వస్తుంది.

## కుటుంబాలలో విశ్వాసాన్ని పెంపొందించటంలో తల్లిదండ్రుల పాత్ర (విధులు)

### విశ్వసనీయత యొక్క ప్రాముఖ్యము

"విశ్వాసము" భగవంతుడు మనకు ఇచ్చిన ఉచిత కానుక. అందులోనే ఆయన మనలను ఆయనతో ఏకంగా వుండాలని పిలిచారు. భగవంతుడు మనలను రక్షించడానికి వేరు వేరు కారణాల ద్వారా, సంఘటనల ద్వారా ఉచితంగా క్రీస్తునందు సంపూర్ణంగా బయలుపరుస్తున్నారు. ఆ విషయం తెలిసికొని, స్పందించటం మన వ్యక్తిగతం".

మరి క్రైస్తవులైన మన జీవితానుభవాలలో 'విశ్వాసమే' కేంద్ర బిందువు. మనలను మనము పూర్తిగా తెలుసుకొనకపోయినచో విశ్వాసము నిలకడగా వుండనట్లే. కష్టాల్లో, ఇబ్బందులలో విశ్వాసాన్ని బలపరచుకొనగలగాలి.

అదే విధంగా క్రైస్తవ కుటుంబంలో 'విశ్వాసాన్ని' ఒక ప్రక్కన పెట్టలేము. ఏ తల్లిదండ్రులైతే విశ్వాస సత్యాన్ని గ్రహిస్తారో, వాటినే వారి పిల్లలకు అందిస్తారు.

చర్చికి సరిగ్గా రాని తల్లిదండ్రులు సైతం తమ బిడ్డలకు జ్ఞానస్నానం అవసరమని ఎంచి అనుకోకుండా చర్చిలో సభ్యులవుతారు.

నిజానికి మన తల్లిదండ్రులు తమ నిత్యజీవితంలో పొందిన అనుభవాలు, సంఘటనలు, అందువల్ల రోజు రోజుకి పెంపొందిన వారి విశ్వాస బీజాలను పంచుకోవటం వల్ల వారి విశ్వాసం కూడా క్రమంగా వృద్ధి చెందుతుంది. ఈ విధంగా వారి ఎదిగిన అనుభవాలతో తమ పిల్లలను రోజు 'విశ్వాసమనే' ఆహారంతో పోషిస్తారు. కనుక చర్చికి మూలమైన క్రీస్తు ప్రభుని బోధనల వల్లనే జ్ఞానస్నానం పొంది ఆయనను నమ్మినవారి హృదయాలలో, మనసులలోనే విశ్వాసం రూపుదాల్చుతుంది.

**తల్లిదండ్రుల విధులు**

దాంపత్య జీవనాన్ని కేవలం సంతానోత్పత్తికి మాత్రమే పరిమితం చేయరాదు. బిడ్డల నైతిక విద్యకు, ఆధ్యాత్మిక రూపకల్పనకు కూడా విస్తరించాలి. 'బిడ్డలకు విద్యాబుద్ధులు గరపడం తల్లిదండ్రులకున్న మౌలిక హక్కు.. బాధ్యత. ఈ రెంటినీ మరొకరికి బదిలీ చేయటం ఎంత మాత్రం వీలుపడదు". తల్లిదండ్రులు తమ బిడ్డలను దేవుని బిడ్డలుగా పరిగణించాలి. వారిని మానవ వ్యక్తులుగా గౌరవించాలి. పరలోకమందలి తండ్రి చిత్తానికి విధేయులుగా తమ్ము తాము నిలుపుకొని వారి బిడ్డలకు తమ కుటుంబంలో సువార్తను బోధించాలి. తమ జీవితాల ద్వారా క్రీస్తుప్రభుని ప్రకటించాలి. తల్లిదండ్రులు దేవుని వాక్యం పట్ల తమకున్న ప్రేమను చిన్న కథల రూపంలో క్రీస్తు ప్రభుని గురించి తమ పిల్లలకు ప్రకటించాలి. సాధ్యమైనంత వరకు అన్ని విధాలుగా క్రీస్తు జీవితం, ఆయన పనులు, ప్రేమ, త్యాగం గురించి ఎప్పటికప్పుడు తమ పిల్లలకు చెప్పి వారిని ప్రభావితం చేయటం చాలా ముఖ్యమైన విషయమని గుర్తుంచుకోవాలి. కనుక తల్లిదండ్రులు తమ కుటుంబాలు దేవుని వాక్యంలో రూపుదిద్దుకుని బలపడేలా నిర్మించుకోవాలి.

ప్రతి ఒక్క కుటుంబము, కుటుంబంలోని ప్రతి ఒక్కరు కూడా పవిత్ర బైబిలును భక్తి శ్రద్ధలతోను, గౌరవ మర్యాదలతో ప్రతిరోజు ఆహారమును స్వీకరించుటకు ముందు పఠించవలెను.

తల్లిదండ్రుల ప్రథమ బాధ్యత తమ బిడ్డలకు విద్య గరపటం. సున్నిత హృదయం, క్షమాగుణం, గౌరవం, విశ్వాసం, నిస్వార్థమైన సేవలనే నియమంగా గల గృహంగా ఇంటిని తీర్చి దిద్దాలి. అలా వారు ఈ బాధ్యతకు సాక్ష్యమిస్తారు. సుగుణాలను అభ్యాసం చేయుటకు ఇల్లు ఎంతో అనువైనది. ముందుగా తల్లిదండ్రులు తమ వృద్ధ తల్లిదండ్రులకు, అత్తమామలను ప్రేమతో సేవించటం చూసి, వారి వృద్ధులను (అమ్మమ్మ, నానమ్మ, తాతలను) ఆదరించటం, సేవించటం, గౌరవించటం నేర్చుకుంటారు. నిజమైన స్వేచ్ఛలన్నిటికీ పునాదియైన ఆత్మపరిత్యాగం, వివేకమైన తీర్పు, తమపై తమకే ఆధిపత్యం అను సుగుణాలలో శిక్షణ ఇవ్వాలి. "తమ భౌతిక, సహజ ప్రవృత్తులను అంతరంగిక, ఆధ్యాత్మిక శక్తులకు లోబడునట్లు చేసేలా బిడ్డలకు తల్లిదండ్రులు బోధించాలి. పిల్లలకు సుమాతృక ఇవ్వడం తల్లిదండ్రుల ఘన బాధ్యత. పిల్లల ముందు తప్పులను అంగీకరించడం ద్వారా పిల్లలను మంచిగా నడిపించగలరు. తప్పులను సరిదిద్దగలరు.

సంఘీభావం, సమిష్టి బాధ్యతలోనికి మనిషిని ప్రవేశపెట్టుటకు ఇల్లు సహజ సిద్ధమైన స్థలం. రాజీపడు ప్రవృత్తి, పతనానికి దారిచూపే పరిస్థితులకు ఎదురొడ్డి నిలిచే విధానాన్ని తల్లిదండ్రులు పిల్లలకు నేర్పాలి. జీవితంలో, ప్రేమలో దంపతులు సన్నిహిత భాగస్వాములుగా ఉండేందుకు వివాహ సంస్కారం అందించే దైవానుగ్రహం ద్వారా, బిడ్డలకు సువార్తను బోధించే ప్రత్యేకమైన హక్కును, బాధ్యతను తల్లిదండ్రులు పొందుతున్నారు. బిడ్డలకు విశ్వాస నిగూఢ సత్యమును నేర్పే మొదటి సువార్తీకులు తల్లిదండ్రులు. తమ పిల్లలను బాల్యవయస్సులోనే ఈ సత్యాలలోనికి ప్రవేశపెట్టాలి. శ్రీసభలో వారిని లేత ప్రాయంలోనే భాగస్వాములను చేయాలి. ఆరోగ్యకరమైన కుటుంబ జీవితం అంతరంగిక దృక్పథాలను పెంపొంది స్తుంది. అవి సజీవమైన విశ్వాసానికి సిసలైన సంసిద్ధులను చేస్తాయి. అంతేకాక జీవితానికంతటికి చేయూతగా వుంటాయి.

ప్రతి కుటుంబం కూడా బైబిలును ఒక సరియైన స్థలంలో గౌరవనీయంగా ఉంచటం చాలా ముఖ్యమైన విషయం. దైవవాక్కును తల్లిదండ్రులు నిత్యం పఠిస్తూ

ఉండాలి. కుటుంబ ప్రార్థనలో నిత్యం పిల్లల చేత దైవవాక్కును చదివించటం, అర్థం చేయించటం తల్లిదండ్రుల తప్పనిసరి బాధ్యత. ఎందుకనగా దైవవాక్కును మదిన నిలుపుకొనుట వల్ల క్షేమకరమైన బాటలో నడుస్తారని, వారి అనుభవాల ద్వారా తెలియపర్చాలి. తద్వారా పిల్లలు తమ చిన్న చిన్న అనుభవాలు సంఘటనల వల్ల దేవుని ప్రేమలో చిన్ననాటి నుండి పాదుకొని విశ్వాసపథంలో నడుస్తారు. విశ్వాసం, ప్రేమ వారిని సంతోషంగా వుంచునని, సత్యమార్గం గొప్ప ఆనందం ఇస్తుందని, పిరికితనం, సోమరితనం, అభద్రతాభావం, విశ్వాసం సన్నిగిల్లడం వల్ల కలుగుతాయని తల్లిదండ్రులు పిల్లలకు తెలియపర్చాలి. పాఠశాలలో, కళాశాలలో, ఉద్యోగంలో రోజూ వారికి కలిగిన అనుభవాలు ఎలా విశ్వాసంలో బలపర్చాయో సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత పిల్లలు, తల్లిదండ్రులు, ఒకరితో ఒకరు పంచుకోవాలి. సంభాషణలవల్ల సనన్నిహితత్వం, స్నేహ వాతావరణం కుటుంబంలో నెలకొంటుంది. దీనికి తల్లిదండ్రులు ఎంతో కృషి చేయాలి. పిల్లలు చెప్పే విషయాలు విసుగు చెందక తల్లిదండ్రులు వినాలి. తద్వారా పిల్లలు ప్రతి విషయంలోనూ క్రీస్తు ప్రభువు ప్రేమను, ఆదరణను చవిచూస్తారు. ఇంతకు మించిన గొప్ప నడవడిక వేరే లేదు.

కుటుంబ ప్రార్థన యొక్క ప్రాధాన్యతను తెలియపరుస్తూ, నిత్యం కుటుంబ ప్రార్థన చేయాలి. ఇది తల్లిదండ్రుల ముఖ్య విధి. పాట్రిక్ పెయ్టన్ చెప్పినట్లు "ఏ కుటుంబమైతే కలిసి ప్రార్థిస్తుందో అది కలకాలం కలిసి జీవిస్తుంది". ప్రార్థనకున్న శక్తిని వారు తెలుసుకునేలా చెప్పాలి. ఎందుకనగా ప్రభువే చెప్పారు. "ఎక్కడైతే ఇద్దరు ముగ్గురు నా నామమున ప్రార్థిస్తారో వారి మధ్య నేనుంటానని". ఈ ఒక్క విషయం పట్ల నమ్మకముంటే పెద్ద కొండను సైతం ఎత్తి నీటిలో పడమని చెప్పవచ్చు. చిన్న మరియు పెద్ద సమస్యలకు చలించక వాటి నివారణోపాయాలు తెలియపర్చేది 'దైవజ్ఞానం' అయితే స్థిరంగా నిలువగలగటం విశ్వాసం. తల్లిదండ్రులు తమ బిడ్డలకు విశ్వాస కవచం ధరింపచేసే ఆ ప్రభువు ఆజ్ఞలతో జీవిస్తూ యోధుల వలె జీవిత రణరంగంలో పోరాడటానికి సిద్ధపరచవలయును. ఇది వారి బాధ్యత. సంఘ ప్రార్థనలోను తమ ఈ విశ్వాసమును ప్రకటింప పిల్లలను సిద్ధపరచవలెను.

బిడ్డల ఆధ్యాత్మిక, భౌతిక అవసరాలను తీర్చుటలో, వారిని పెంచుటలో చూపించే శ్రద్ధాసక్తుల్లో తల్లిదండ్రుల గౌరవ ప్రేమలు వ్యక్తమవుతాయి. పెరిగే కొలది వారు తమ వివేకాన్ని స్వేచ్ఛను సక్రమంగా ఎలా వినియోగిస్తున్నారో గమనించవలసిన బాధ్యత తల్లిదండ్రులదే. అన్నదమ్ములు, అక్క చెల్లెల్లతో ప్రేమతో, సహనంతో, ఐక్యతతో జీవిస్తూ ఒకరిని ఒకరు క్షమిస్తూ, మన్నిస్తూ జీవించులాగున సంరక్షించవలసిన బాధ్యత తల్లిదండ్రులదే. తద్వారా వారు పెద్దవారయ్యాక సమాజంలో మంచి పౌరులుగా, మంచి క్రైస్తవులుగా తమ వంతు సేవను ప్రేమను అందివ్వగలుగుతారు. కుటుంబమే మొదటి పాఠశాల. అమ్మనాన్నలే పిల్లలకు తొలి ఉపాధ్యాయులు. కనుక బిడ్డలకు విద్య గరుపు బాధ్యత తల్లిదండ్రులదే. తరువాత వారి స్వంత ధృఢ విశ్వాసాలకు సరిపడు పాఠశాలను ఎంపిక చేసుకొని సాధ్యమైనంత వరకు ఉత్తమమైన విద్య వారికి అందునట్లు చూసే విధి తల్లిదండ్రులదే. పిల్లలు పెరిగి యవ్వనులు అయినపుడు వారి జీవన విధానాన్ని, వృత్తిని ఎన్నుకొను హక్కును, బాధ్యతను కలిగియున్నారు. తల్లిదండ్రుల సలహాలను ఇష్టపూర్తిగా కోరుకుంటూ వారితో నమ్మక పాత్రమైన సంబంధాలను కలిగి తమ కొత్త బాధ్యతలు చేపట్టాలి. జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకొనుటలోను, వృత్తిని ఎన్నుకోవడంలోను తల్లిదండ్రులు తమ బిడ్డలపై ఎలాంటి ఒత్తిడి చేయకూడదు. కాని తల్లిదండ్రులు తమ వివేకపూరిత, అనుభవంతో కూడిన సలహాలను ఇవ్వడం మానివేయరాదు. మరీ ముఖ్యంగా బిడ్డలు కొత్త కుటుంబాన్ని ప్రారంభించే సమయంలో వాస్తవిక సలహాలివ్వాలి. అన్నిటికి మించి బైబిలు సందేశానుసారం జీవించటం కన్న వేరొక మించిన విషయం లేదు. బిడ్డలు తమ తల్లిదండ్రులు క్రీస్తు ప్రభువు విలువలు కలిగి ప్రతిరోజు జీవిస్తున్నారా లేదా అని చూడగలగాలి. క్రైస్తవ తల్లిదండ్రులకంటే కేవలం వాక్యాన్ని వినడమే కాకుండా, వారి జీవితం ద్వారా సువార్తను అందించే వారుగా ఉండాలి.

తల్లిదండ్రులు బప్తిస్మమనే పుణ్య సంస్కారం ద్వారా ప్రవక్తలుగా సాక్ష్యమివ్వాలి. కనుక ప్రతిరోజు తమ పలుకుల ద్వారా మాత్రమే కాక మంచి చేతల ద్వారా, విలువల ద్వారా, క్రీస్తు ప్రభువుకు సాక్షులుగా నిలవాలి. తద్వారా లోకము అందులోని పాపము దాని రూపాన్ని క్రైస్తవ విలువల ద్వారా నిర్మూలించాలి.

ప్రథమంగా ఈ విలువలు 'సేవ' ద్వారా వెలుగొందుతాయి. ఇలా మంచి చేయటం ద్వారా (మన చుట్టూ వున్న) 'చెడు' రాజ్యాన్ని ఎదురించవచ్చు. అవినీతి మధ్య నివసిస్తున్న తల్లిదండ్రులు (మనం) ప్రేమ, క్షమ, గౌరవం, సౌభ్రాతృత్వం అనే విలువలను పిల్లలలో పెంపొందించవలయును. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు, ఇంకా పెద్దలు వున్న కుటుంబాలలో వృద్ధులను ఎలా గౌరవించాలో సేవించాలో తల్లిదండ్రుల నుండే బిడ్డలు నేర్చుకుంటారు. అదే విధంగా రేపు సమాజంలో వయోజనుల పట్ల తమ గౌరవాన్ని సేవను చూపుట ద్వారా నిజ సేవ ఇంటి నుండే ప్రారంభమవుతుంది.

భార్యభర్తలు ఒకరిపట్ల ఒకరు చూపుకునే సేవను పిల్లలు గమనించి తిరిగి వారు సమాజంలో పెద్ద వారికి అందివ్వగలుగుతారు. చర్చి క్రీస్తు రాజు యొక్క కార్యాలయం. అందులో పనివారై వారికున్న తలాంతులను తల్లిదండ్రులు పెట్టుబడిగా పెట్టి వినియోగించినచో పిల్లలు కూడా చర్చి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. చర్చిలో జరిగే ప్రార్థన కూటాల్లో, సంగీత వాయిద్యాలను వాయించటంలో, పండుగలలో గురువుకు సహకరించటం వల్ల దేవుడెంతగానో ఆనందించి ఆశీర్వదిస్తారని తమ బిడ్డలకు తెలియపర్చాలి.

చర్చి అభివృద్ధి మార్గంలో నడపటానికి, ముందు సాగటానికి అనేకులైన అవిశ్వాసులను దేవుని సన్నిధికి నడపటాన్ని తమ సేవ, సహకారం, గురువుకు అందించటం చాలా ముఖ్యమైన అవసరమని తమ బిడ్డలకు తెలియపరిచి కుటుంబమంతా కలిసి పనిచేయాలి. ఆదివారం ఒక్కరోజు చర్చికి వచ్చి వెళ్లిపోతే సరిపోదని సువార్త బోధనలలో గురువుకు సహకరించవలసిన బాధ్యత తమ అందరిదని తమ బిడ్డలకు తెలియపరచటం తల్లిదండ్రుల బాధ్యతే.

దివ్య బలిపూజలో పాల్గొని క్రీస్తు ప్రభుని ప్రేమలో, విశ్వాసంలో బలపడటం సామాన్య ప్రజలుగా తమ సేవను చర్చి కొరకు అందివ్వటం క్రైస్తవ కుటుంబం యొక్క ముఖ్యమైన బాధ్యత.

## క్రైస్తవ కుటుంబాల్లో విశ్వాసాన్ని పెంపొందించటంలో గురువుల పాత్ర

ముందుగా విశ్వాసం గురించి తల్లిదండ్రుల పాత్ర విధులను గూర్చి చర్చించాను. ఇందుకు గురువుల పాత్ర ఎంతైనా వుందని నాకనిపిస్తుంది.

కతోలిక గురువు 'అభిషిక్తుడు'. గురుక్రమం ఒక దివ్య సంస్కారం. అభిషిక్తుడు అనగా దేవునిచే ఎన్నిక చేయబడినవారు. పునీత తోమాసు అక్వినాసు గారు అన్నట్లు "క్రీస్తు ప్రభువు మాత్రమే నిజమైన గురువు. మిగిలినవారు ఆయన సేవకులు" అనగా వారు ఆ ప్రభుని సేవకులని అర్థమవుతుంది. పూర్వ నిబంధనల యాజకులు – పరలోకానికీ, భూలోకానికీ, దేవునికి, దైవ ప్రజలకు మధ్యవర్తిత్వం వహించటం తమ ప్రధాన ధర్మంగా భావించేవారు. తరువాత క్రీస్తు ప్రభువు అవతరించారు. "దేవుని మనుజులను ఒకచోట చేర్చు మధ్యవర్తి క్రీస్తుప్రభువు ఒక్కరే (1 తిమోతి 2:5) ప్రభువు పూర్వ నిబంధన కాలపు యాజకత్వానికి సమగ్రతను చేకూర్చగలిగారు. క్రీస్తు ప్రభువు అనంతరం అభిషేకించబడిన గురువులు తమ ధర్మాలను నిర్వరిస్తున్నారు. ఈ విధంగా క్రీస్తుప్రభువు నుండి స్వీకరించిన అపోస్తలిక ధర్మం ద్వారా గురువులు తమ మధ్యవర్తిత్వ బాధ్యతను నిర్వర్తిస్తారు.

ఒక కతోలిక గురువు తన స్వంత శక్తితోనూ, తనకున్న నైతిక అధికారంతోనో దివ్య సంస్కారాలను ఆచరింపజేయరు. వారు తమ గురు ధర్మాలను క్రీస్తు స్థానంలో నిలబడి నిర్వహిస్తూ వుంటారు. ఒక 'గురువు' గురుపట్టాభిషేకం పొందే గడియలోనే క్రీస్తు ప్రభులోని దివ్య శక్తి పరివర్తన శక్తి, స్వస్థతా శక్తి, రక్షణ శక్తిలో అంటుగట్టబడతారు. ఆయనలో మూర్తీభవిస్తారు. ఎందుకంటే ఒక 'గురువు'కు తనదంటూ ఏదీ వుండదు. ఆయన కేవలం ఒక సేవకప్రాయుడై, దీనాత్ముడై ఉంటారు. అందుకే నిజమైన కతోలిక గురువు తనవంటి దీనున్ని దేవుడు తన సేవకు పిలిచినందుకు తరుచు సంభ్రమాశ్చర్యాలకు గురవుతూ ఉంటారట. అవును, కతోలిక గురువుకు గల ప్రధాన లక్షణాలలో ఈ వినమ్ర గుణం ఒకటి. శ్రీసభ విశ్వాసం ప్రకారం సాక్షాత్తు క్రీస్తు ప్రభువే గురువు ద్వారా దివ్య పూజను సమర్పిస్తారు. ఈ దివ్యబలిలో క్రైస్తవులమైన మనకు సముచితమైన

స్థానం ఉంటుంది. క్రీస్తు సమర్పించే స్వీయబలి అర్పణంతో మనమూ మన పనిపాటలను, మన శ్రమలను, మన కష్ట సుఖాలను ఏకం చేసి దేవునికి సమర్పించవచ్చును. ఈ పూజాబలి ప్రాముఖ్యతను తెలియజేయవలసిన బాధ్యత గురువునదే. మనలను మనం దివ్యబలి పూజలో ఏకం చేసి సమర్పించటం ద్వారా మన జీవితాలు సంపూర్ణంగా పరివర్తన చెందుతాయని. మనం దేవునికి ప్రీతిపాత్రులమవుతామని, సాటి మానవులకు మంచి మిత్రులమై వారికి మన సేవా సహకారాలను అందజేయగలుగుతామని తెలియజేయవలసిన బాధ్యత గురువునదే. క్రైస్తవ కుటుంబంలో పవిత్ర వివాహ సంస్కారం, జ్ఞానస్నానం, భూస్థాపితం అనగా జననం నుండి మరణం వరకు గురువు పాత్ర చాలా ప్రాముఖ్యమైనది. క్రైస్తవ జీవనయాత్రలో జరిగే తప్పిదాలు, పాపాలు, పాప సంకీర్తనం ద్వారా గురువుకు చెప్పుకోవలసినవే. పాపసంకీర్తన ప్రాముఖ్యతను గురువు విశ్వాసులకు తెలియపర్చాలి. ఎందుకంటే కొందరు నేను నేరుగా దేవుని దగ్గరికే వెళ్లి పాపమన్నింపు పొందుతాను, మధ్య గురువెందుకు అంటూ మొండిగా వాదిస్తూ వుంటారు. మానవ సహజ ప్రవృత్తిరీత్యా మన పాపాలను లోపాలను హేతుబద్ధంగా సమర్థించుకోజూస్తాం. ఏమీ జరగనట్లు మిన్నకుండిపోతాం.

కాని దేవుడు మన పాపాలను మనమే మన నోటితో ఒప్పుకోవాలనీ కోరుకుంటారు. అందుకే యేసుప్రభువు తన శిష్యులతో పలికిన మాటలు గురువులకు అక్షరాల వర్తిస్తాయి. "ఎవరి పాపములనైనను మీరు క్షమించిన యెడల అవి క్షమించబడును. మీరు ఎవరి పాపములనైనను క్షమింపని యెడల అవి క్షమింపబడవు" (యోహాను 20:23). ఈ పవిత్ర సంస్కారం ద్వారా కుటుంబ కలహాలు, అవిశ్వాసం, అవిధేయత చివరకు విడిపోవటం, బిడ్డలను దు:ఖపెట్టడం లాంటివి తొలగి శాంతి, సఖ్యత, నెలకొంటాయని విశ్వాసులకు తెలియపరచటం గురువు బాధ్యతనే. క్రీస్తు ప్రభువు శ్రీసభకు ఎలా శిరసై వున్నారో, గురువు కూడా విశ్వాసుల సంఘానికి అధిపతి. కనుక విశ్వాసుల కుటుంబాల్లో చెలరేగే అల్లకల్లోలాను ఆటుపోటులను, కలహాలను, అవిధేయతలను, అవిశ్వాసాన్ని సువార్త ద్వారా నిర్మూలించవలసిన బాధ్యత గురువునదే. జీవితంలో చితికిపోయిన వారు క్రీస్తు ప్రభువు స్థానంలో వున్న గురువునకు తమ ఇబ్బందులను చెప్పుకొన్నప్పుడు

వారిని దేవుని యందు విశ్వాసంలో బలపరిచి రక్షించవలసిన బాధ్యత వారిదే. అలాంటి కుటుంబాలను దర్శించటం, కొంతమంది దైవ ప్రజలతో కలిసి వారి ఇంటికి వెళ్లి ప్రార్థన చేయటం గురువుల బాధ్యత. నేటి సమాజంలో దైవ వాక్కుకు కరువు వచ్చింది. కనుక, ప్రాముఖ్యతనిచ్చి, దైవవాక్కు సదస్సులను పెట్టాలి. కతోలికేతర సంఘాలకు వెళ్లనివ్వక మన సంఘాన్ని కాపాడాలి. ఇందుకు గురువులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. దైవాంకితులు సుఖ ప్రాంతాలను వీడి మారుమూల ఇరుకైన ప్రాంతాలలో వున్న విశ్వాసం సన్నగిల్లిన కుటుంబాలను రక్షించ అడుగిడాలి. 'యేసు – వ్యాధిగ్రస్తులకే గాని ఆరోగ్యవంతులకు వైద్యుడు అక్కరలేదు గదా! నేను పాపులను పిలువవచ్చితిని కాని, నీతిమంతులను పిలుచుటకు రాలేదు (మత్తయి 9:12-13) అని అన్నారు. అలాగే ఆయన 'నాకు కారుణ్యము కావలయును గాని బలి అవసరము లేదు (హోషేయా 6:6) అను లేఖనము ప్రకారము గురువు సువార్తను అలాంటి వారికి అందునట్లు చూడాలి. ఈ దైవ ప్రేమ కరుణలను అందరికి అందించుటకు వెనుకాడరాదు. ఇతరులను మన్నించుటకు కారుణ్యపు ఊటలు కనుకొనుటకు క్రీస్తుకు, విశ్వాసులకు మధ్య గొప్ప వారధిగా 'గురువు' వుండవలయును. తన ఆత్మ ప్రపంచంలోనికి తొంగి చూచుకొనుచూ తనను తానే నూతనంగా కనుగొంటూ దైవ కారుణ్యమును, తన జీవిత విధానముగా, ఆదర్శంగా నిలుపుకొని సమాజానికి మాతృకగా నిలవాలి.

ఈనాటి సమాజంలో సువార్త బోధన యందు కొత్త విధానాలను కనుగొనవలయును. గురుత్వ సేవలు నూతన ఉత్సాహంతో అవసరమైన చక్కని సవరణలతో వుండవలయును. తను బోధించు సువార్త సందేశమునకు తానే ప్రథమ సాక్షిగా వుండవలయును. ప్రజల హృదయాలను స్పందించే విధంగా దివ్య కారుణ్యమును మార్గమును గుర్తించే విధంగా వుండాలి. తన వద్దకు వచ్చిన అవిశ్వాస కుటుంబ సభ్యులను ఖండింపక క్షమించాలి. అందువల్ల వారు తిరిగి విశ్వాసంలో బలపడతారు (లూకా 6:37-38) లో ప్రభువు చెప్పినట్లు 'పరులను గూర్చి మీరు తీర్పు చేయకుడు, ఖండింపకుడు, క్షమింపుడు, పరులకు ఒసగుడు.. ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతో మీకును కొలువబడును" అందువలన గురువు సహనంతో వారిని క్రీస్తువైపునకు నడిపించే నావికుడై ఉండాలి. యవ్వనులను

ఉత్సాహపరిచి చర్చి కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేలాగా సువార్తతో ఆకట్టుకోవాలి. వారికి కొన్ని బాధ్యతలు అప్పగించాలి. కులానికి, ఆర్థిక స్థితిగతులకి ప్రాధాన్యత ఇవ్వక టాలెంట్ వున్న వారినందరిని ప్రభుసేవకు వాడాలి. వికలాంగులు, వయోజనులను ప్రత్యేక రీతిగ కనుగొని వారికి తగినట్లు సువార్త సేవలు అందించుచూ దైవ సన్నిధిలోకి నడిపించాలి. సేవా కార్యకలాపాలలో అనాథలు, వృద్ధులు వున్న ఆశ్రమాలను, రోగులున్న గృహాలను దర్శించి వారితో కలిసి ప్రార్థన చేసి ఆర్థిక సాయం అందించుటకు యువతను ప్రోత్సహించాలి. పేద విద్యార్థినీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించుటకు గురువు వెంట ఉండి నడిపించాలి. ఎందుకనగా "పేదవానికి సహాయము చేయువారు దేవునకు అప్పు ఇచ్చినట్లే" అని దైవవాక్కు చెబుతుంది. గురువు అలుపెరుగని శ్రామికుడిలా నిరంతరం దైవకార్యాలను చేయుటలో నిమగ్నమై ఉండాలి. విశ్వాసంలో అబ్రహాము లాగ, పరివర్తనలో పౌలువలె నమ్మకంతో జీవిస్తూ తన క్రైస్తవ సంఘాన్ని సంరక్షిస్తూ, విశ్వాస పథంలో నడిపించి వారికి పరలోక ప్రాప్తిని కలిగించు బాధ్యత గురువుదే!

విశ్వాస, వికాసానికి, నూత్నీకరణకు, సువార్త ప్రబోధానికి 'పట్టుకొమ్మగా' మాధ్యమంగా ప్రాచుర్యం పొందిన క్రైస్తవ మౌలిక సంఘాలు (బిసిసి) లేదా చిరు క్రైస్తవ సంఘాలను (యుస్‌సిసి)లను తమ గురువు ప్రారంభించి యువతను ప్రోత్సహించాలి. వీటి ద్వారా గృహస్థ క్రైస్తవుల విశ్వాస వికాసాన్ని, వికసింపజేసి ఆధ్యాత్మిక పరిణితిని సాధించాలన్నది ప్రధాన ఉద్దేశం. ఈ విధంగా క్రీస్తు కోరిన క్రైస్తవ సంఘాలను ఆదర్శ సంఘాలుగా, సువార్త ప్రబోధక సంఘాలుగా మార్చు బాధ్యత గురువుదే. సర్వోన్నత సువార్తిక విలువైన సహోదర ప్రేమ, సేవా, శీలల తమ విచారణలోని ప్రతి క్రైస్తవుని జీవితంలో, సంఘంలో వ్యాపింపచేయవలసిన బాద్యత గురువనదే! సంఘాన్ని సమూలంగా సంస్కరించి నవ సమాజ నిర్మాణానికి ప్రభునందు గట్టి పునాదులు వేసేది గురువులే. ఈ స్థానిక సంఘం నుండే మంచి నాయకులను ఎన్నిక చేసి వారికి చక్కటి తర్ఫీదు ఇచ్చి ఉజ్జీవకులనుగా మార్చవలసిన బాధ్యత గురువునదే. ఈ విధంగా గృహస్థ క్రైస్తవుల నుండి సంవత్సరానికి ఒకరినైనా లేక దంపతులనైనా ముందుకు తెచ్చి క్రొత్త బృందానికి జీవం పోయటానికి గురువు ప్రోత్సహించాలి. ఈ స్వచ్ఛంద ఉజ్జీవకులు గురువు సహకారంతో కుటుంబాలను

సందర్శించి ప్రార్థన చేయటం, రోగులను సందర్శించి స్వస్థత ప్రార్థన చేయటం, సత్యోపదేశం నేర్పటం, దివ్య సంస్కారాలకు సిద్ధపరచటం, దైవార్చన గీతాలు నేర్పించుట, పాడుట, బృందాలను ఏర్పరచటం, దేవాలయాన్ని పీఠాన్ని అలంకరించటం, వత్తాసు నేర్పించటం, పరిశుద్ధ గ్రంథ పఠనాలు చదవటం, సువార్త ప్రచారం చేయటం, విశ్వాస వికాస ఉత్సవాలలో పాల్గొనటం ద్వారా సేవా కార్యాలు చేస్తారు. దీని ద్వారా కీలక కుటుంబం నుండి అభిషిక్తుడై వచ్చిన గురువునకు క్రైస్తవ సంఘం సంపూర్ణంగా విధేయులై సహకారాన్ని ఇవ్వగలుగుతారు. కుటుంబం నుండి వచ్చిన గురువు తమ పర భేదం లేకుండ తన విచారణలోని క్రైస్తవ కుటుంబాలతో మమేకమై క్రీస్తు ప్రేమ, త్యాగం, సేవను అంకిత భావంతో నేర్పాలి. తన చిన్న మందకు మంచి కాపరియై సంఘాన్ని క్రీస్తు మార్గంలో నడిపించవలసిన బాధ్యత గురువులదే. ఉద్దేశంలో క్రైస్తవ సంఘానికి దశ దిశ నిర్దేశం గురువులే. పాస్క పండుగ రోజు ఇదిగో "క్రీస్తు జ్యోతి అని ఎలా ఎత్తి చూపెట్టగలుగుతారో అదే విధంగా నిత్యం దేవుడు తనకిచ్చిన ప్రజలను అంధకారంలో పడకుండా లోక ఆశలలో చిక్కుకొనక, నిరాశానిస్పృహలతో తల్లడిల్లకుండ సువార్తను చేతబూని ఆనాడు మోషే ప్రవక్త యిస్రాయేలీయులను ఐగుప్తు దాస్యము నుండి విముక్తి కలిగించినట్లు, ఈనాడు ప్రేమ విశ్వాసములేని క్రైస్తవ కుటుంబాలను దేవుని రాజ్యమునకు తీసుకొని వెళ్ళవలసిన బాధ్యత నూటికి నూరు శాతం గురువులదే!

## కుటుంబాల్లో ప్రేమ, విశ్వాసం, అభివృద్ధిపరచటంలో తల్లిదండ్రులు, గురువులు ఎదుర్కొంటున్న సమస్యలు

కుటుంబం ఒక క్షేత్రమైతే తల్లిదండ్రులు కర్షకులై మంచి విత్తనాలు విత్తినచో సువార్త అనే చిరుజల్లు గురువు కురిపించి బిడ్డలనే ఆ చిన్న మొలకలను పోషించి నూరంతలుగా ఫలింపజేయవలసిన బాధ్యత గురువులదే!

కాని ప్రస్తుత క్రైస్తవ కుటుంబాలలో విశ్వాసము, ప్రేమ, సేవా, విధేయత అను సద్గుణాలు బలహీనపడుచున్నాయి. దీనికి అనేక కారణాలు.

## ప్రస్తుత సవాళ్ళు

## తెలుగు రాష్ట్రాలలో క్రైస్తవ సమాజం (శ్రీసభ) ఎదుర్కొంటున్న ముఖ్యమైన సవాళ్ళు

1. వివాహం – కుటుంబ వ్యవస్థ ప్రస్తుతం పటిష్టంగా లేదనే చెప్పాలి. దీనికి కారణాలు వ్యసనాలు, కులాంతర, మతాంతర వివాహాలు మొదలైనవి. కయ్యానికైనా, వియ్యానికైనా సమ ఉజ్జీలు కావాలంటారు పెద్దలు. ఎందుకంటే నేను చూసిన కొన్ని కుటుంబాలలో నిజక్రీస్తు ప్రేమ లేక కతోలికులు, కతోలికేతర వారితో సంబంధాలను తప్పని పరిస్థితులలో కలుపుకొని తమ బిడ్డలకు వివాహాలు జరిపించి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఓ క్రైస్తవునికి క్రీస్తు ప్రేమ తప్ప వేరొకటి వారి హృదయాల్లో వుండకూడదు. కుటుంబాల్లో విమర్శకు తావు లేకుండ విచక్షణ కలిగి వుండాలి. దైవ ప్రేమ విశ్వాసం లోపించి ఈ రకమైన సమస్యలు క్రైస్తవ కుటుంబాలు ఎదుర్కొంటున్నాయి.

పాశ్చాత్య సంస్కృతి, పేదరికం, నిరుద్యోగం, పురుషాధిక్యం, ఆర్థిక సమస్యలు, వివాహానికి ముందు సంబంధాలు, వివాహేతర సంబంధాలు, వరకట్నం, దాంపత్య జీవితం గూర్చి సరైన అవగాహన లేకపోవడం, అశ్లీల చిత్రాలు, అత్తాకోడళ్ళ వైఖరి, పెద్దలకు ఎదురు తిరిగి వెళ్లిపోవడం, శ్రీసభ బోధనలు తెలియకపోవడం, ఉద్యోగరీత్యా భార్యాభర్తలు, పిల్లలు ఒకరికొకరు దూరంగా ఉండటం, పోటీ ప్రపంచంలో ముందు ఉండటానికి పిల్లలను కార్పొరేటు విద్యా సంస్థలు, హాస్టళ్లలో చేర్పించటం వంటి సమస్యలు వివాహాన్ని, కుటుంబ జీవనాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. క్రీస్తు ప్రేమను జీవితాల్లో పొందలేకపోతున్నారు. తమపట్ల తాము నమ్మకాని, పట్టును కోల్పోవుచున్నారు. నేను చర్చించు ఈ అంశాన్ని నిశితంగా పరిశీలించినట్లయితే, ఈ తరంలో చాలా మార్పులు వచ్చాయని, బిడ్డలు పెద్దవారికి గౌరవం, మర్యాద ఇవ్వటం లేదని ప్రేమ చూపటం లేదని చర్చించుకుంటారు. అందుకు పెద్దలు తమ వంతు పిల్లలకు క్రీస్తు ప్రేమను రుచి చూపకపోవటం, ఒక సమస్య. మేము అన్ని రకాలుగా మంచిగా పెంచుచున్నామని చెబుతారు. అయితే లోపం ఎక్కడ? ఎవరు కారణం? ఈ లోకం చాలా

విశాలమైనది. మంచి చెడుల మేలి కలయిక ప్రభువునకే, పవిత్రునకే, ప్రేమామయునకే శ్రమ, అవమానం,నింద,నిరాదరణ తప్పలేదు. అయితే తన తండ్రిని విడువలేదు. చివరకు తన ఆత్మను దేవునికే అప్పగించి రక్షణను, ప్రేమను మనకు ఒసగినారు. విశ్వాసం కలిగి, ప్రార్థనలో నిలకడగా ఉండి ప్రేమ కలిగి జీవించమన్నారు. ఒకరినొకరు మన్నిస్తూ దేవునికి మన జీవితాలలో మొదటిస్థానం ఇవ్వమన్నారు. ప్రతి వ్యక్తి తనను తాను క్రీస్తు ప్రభువు నందు పరిశీలించుకుంటే స్పష్టంగా కనిపిస్తాడు. ఇతరుల లోపాలను, తప్పులను సరిదిద్దలేకపోవటం సమస్యలకు దారి తీస్తుంది. ఒకరినొకరు సరిచేసుకుంటూ జీవించక విమర్శించుతూ ఉంటే సమస్యలు ఉత్పన్నమౌతాయి.

వినుట వల్ల విజ్ఞానం కలుగుతుంది. రోజూ దైవవాక్కును పఠించక పోవటం సమస్యలకు మూలకారణం. పవిత్ర గ్రంథ పఠనం చేయక గురువుల బోధ వినకపోవటం వల్ల కుటుంబాల్లో విశ్వాసాన్ని ప్రేమను కోల్పోవుచున్నారు. చిన్న చిన్న సమస్యలకు చర్చికి రావటం మాని దేవున్ని దూరం పెట్టి ప్రార్థన మర్చిపోయి సమస్యలను జఠిలం చేసుకుంటున్నారు.

కుటుంబ ప్రార్థన లేకపోవటం ఒక సమస్య. సంఘ ప్రార్థనకు రాకపోవడం మరో సమస్య. "ఎక్కడైతే ఇద్దరు ముగ్గురు నా నామమున కలిసి ప్రార్థిస్తారో అక్కడ నేనుంటానన్న" ప్రభువు మాటలు పూర్తిగా మర్చిపోవటం, 'సు'వార్తను సకల జనులకు బోధించమని ప్రభువు చెప్పిన మాటను గుర్తుంచుకోలేకపోవటం. ఆయన విలువైన రక్తం చిందించి, ప్రాణాన్ని ఫణంగా మన కోసం పెట్టారు. ఎందుకంటే ఆయన మనలను అధికంగా ప్రేమించారన్న విషయం పూర్తగా విస్మరించటం ఒక సమస్య. కుటుంబాల్లో తల్లిదండ్రుల మధ్య సఖ్యత లోపించి, అవగాహనకు బదులు అహంభావం చోటుచేసుకోవటం, హెచ్చుతగ్గులు నేనే గొప్ప అని తలంచటం కుటుంబమనే మొక్కకు ప్రేమ అనే నీరు, విశ్వాసమనే సూర్యరశ్మిని ఇవ్వకపోతే ఎలా ఎదుగుతుంది? కారణం ఎవరు అన్వేషించాలి? ఇంటర్‌నెట్, వాట్సాప్, సెల్‌ఫోన్‌లు, టీ.వి.లు మానవ జీవనాన్ని మారుస్తున్నాయని, వాటి మీద మన తప్పులను రుద్దటం మనకు లేక వాటిని

నిందించటం, వాటిని మనం టచ్ చేస్తేనే అవి పనిచేస్తాయి, వాటంతట అవి పనిచేయలేవు. ఈ లోకం చాలా చెడ్డదని అంటాము. పర్యావరణం దెబ్బ తింటున్నదని, అంతా కలుషితమేనని అంటే మనిషి, మరియు మనస్సు. అన్ని తెలిసి ఒకరినొకరు విమర్శించుకోవటం సమస్యనే, సుగంధ పరిమళాన్ని పంచే, గంధం చెట్లు, మొగలి పొదలలో విషసర్పాలుంటాయి. అంత మాత్రాన అవి విషపూరితం కావు. విషాన్ని కూడా ఇవ్వవు. ప్రకృతి ఇంత చక్కగా తెలియపరిస్తే, ఈ లోకాన్ని దాన్ని ఆశలను, ఆకర్షణలను మనం స్వీకరించి, విషపూరితులం కాకూడదన్న విషయాన్ని గ్రహించాలి. ప్రేమ, విశ్వాసము, విశ్వసనీయత కొనుక్కుంటే రావు, కనుక్కుంటే వస్తాయి. ఐక్యత, కుటుంబాల్లో, సంఘంలో వుంటేనే క్రీస్తు ప్రేమ జ్వలిస్తుంది, తేజరిల్లుతుంది.

పెద్దలు గురువర్యులు నన్ను ఈ అంశంపై చర్చించమని అడిగినప్పుడు నేను ముందు ప్రార్ధన చేసాను. ప్రభువుని అడిగాను. నేనేమైన ఉపయోగపడతానా అని విశ్వాసంతో ప్రయత్నించాను. క్రైస్తవ తల్లిదండ్రులు, బిడ్డలు, గురువులు, పీఠాధిపతులు మనమందరము మనలో వున్న చిరులోపాలను వెతికితే ఈ పెద్ద సమస్యలకు పరిష్కారం వెదకవచ్చు. ఇది కేవలం దైవజ్ఞానం, దైవానుగ్రహంతోనే సాధ్యం.

**ముగింపు**

చివరిగా, ఒక మొక్క గాని, జంతువుగాని, మనిషిగాని దశలవారిగా ఎదుగుతాయి. ఒక దశలో ఎదుగుదల ఆగిపోతుంది. వృద్ధాప్యం, నీరసం, అనారోగ్యం, చివరకు ఏదో రకంగా మృతి చెందటం సర్వసామాన్యం. కాని, క్రీస్తు ప్రభువు నందు, మన విశ్వాసానికి, ప్రేమకు, మృత్యువు లేదు. మనం లేకున్న మన ప్రేమ, విశ్వాసం, జీవించే వుంటాయి.

❋ ❋ ❋ ❋

# 4. అడ్డకత్తెరలో కాపురాలు: కుటుంబాలకు కారుణ్యపూరిత ప్రేషిత సేవలు మరియు తోడ్పాటు

**- ఫాదర్ మద్దినేని ఆనంద ప్రసాద్, MSFS**

## ఉపోద్ఘాతం



పెళ్లంటె పందిళ్లు.. సందళ్లు.. తప్పెళ్లు.. తాళాలు.. తలంబ్రాలు.. మూడే ముళ్లు.. ఏడే అడుగులు.. మొత్తం కలిసి నూరేళ్లు.. అంటూ వివాహ వేడుకను వర్ణించాడో సినీ కవి! ఆకాశం దిగివచ్చీ మబ్బులతో వెయ్యాలీ మన పందిరీ.. ఊరంతా చెప్పుకునే ముచ్చటగా జరగాలి పెళ్లంటే మరీ, అంటూ వివరించాడు మరో కవి! ఈ వర్ణనలు, వివరణల సంగతెలా ఉన్నా, ఇప్పుడు పెండ్లి మూన్నాళ్ల ముచ్చటగా మారుతోంది. మూడు ముళ్ల బంధంతో ఒక్కటైన జంట మూడు రోజులకే వీడిపోతున్నది. గురువుల ప్రార్థనలు, వివాహ వాగ్దానాలు మంత్రోచ్చరణలు.. పెద్దల ఆశీర్వచనాలతో నిండు నూరేళ్లు సాగాల్సిన వారి కాపురం, అనుమానమనే మంటల్లో కాలిపోతున్నది. భార్యాభర్తల మధ్య మనస్పర్థల వల్ల అగ్ని సాక్షిగా ఏడు అడుగులు వేసిన జంట, ఇప్పుడు విడాకులు తీసుకునేందుకు కోర్టు మెట్లు ఎక్కుతున్నది.. సమాజంలో వస్తున్న మార్పులు, ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న తరుణంలో భార్యాభర్తల వివాహ బంధం తెగిపోతున్నది. విడాకులు కోరుకుంటుండడంతో పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. పిల్లల ఆలన, పాలన విషయంలో ఎటూ తేల్చుకోలేకపోతుండడంతో వారు మానసిక వేదనకు గురి కావాల్సి వస్తున్నది.

ఆలుమగలు ఒకరినొకరు అర్థం చేసుకొని, పెద్దల సూచనలు, సలహాలు పాటిస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. పంతాలు, పట్టింపులకు పోకుండా అవగాహనతో ఏకాభిప్రాయాన్ని కుదుర్చుకుంటే సంసారం నూరేళ్ల పంటగా సాగిపోతుంది.

"కుటుంబము సమాజానికి పునాది, కుటుంబము ప్రేమకు నిలయము; కుటుంబ ప్రేమ, జీవితంలో ఒక గొప్ప దీవెన; ఎక్కడ జీవితము ప్రారంభమై, ప్రేమకు అంతము ఉండదో అదే కుటుంబము; కుటుంబము అనేది ఒక గొప్ప విషయము కాదు, కానీ అదే సమస్తము" అనే గొప్ప సూక్తులు కుటుంబ వ్యవస్థ యొక్క ఔన్నత్యమును, విలువను చాటిచెప్తూ కుటుంబమును ఉన్నత శిఖరములో నిలబెట్టాయి. కానీ నేడు విశ్వవ్యాప్తంగా అనేకకారణాల వల్ల కుటుంబాలు మరియు వివాహాలు ప్రమాదకరమైన విచ్ఛిన్న పరిస్థితుల్లో ఉందనడంలో అతిశయోక్తి లేదు. ఈ నవీన శాస్త్రీయ ఆధునిక ప్రపంచంలో మనిషి అనేక అద్భుతాలు సృష్టిస్తున్నప్పటికి, బంధాలు, బంధుత్వాలు, మానవత్వము, మంచితనము, గౌరవము, మర్యాద, క్షమాగుణము, సర్దుబాటు మనస్తత్వము అను మానవ/ సామాజిక విలువలు క్షీణించి మనుష్యులు అమానుషమైన వ్యక్తులుగా మారుతున్నారు.

ఇటువంటి నేపథ్యంలో బైబులు ఆధారముగా, దైవశాస్త్రపరంగా మనషి తన ఔన్నత్యాన్ని గ్రహించి తన మూలాలల్లో ఉన్న దైవత్వాన్ని గుర్తించి సంబంధ బాంధవ్యాలను, కుటుంబము మరియు వివాహ వ్యవస్థను కాపాడుకోవాలి. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మన ఫ్రాన్సిస్ పాపుగారు 2014, 2015 సం॥లలో కుటుంబము, వివాహ వ్యవస్థలను గూర్చి "విశ్వకతోలిక మేత్రాణుల సదస్సులు" నిర్వహించి మానవ వివాహ, కుటుంబ వ్యవస్థలను ధృడపరుస్తూ సమాజంలో వాటి పటిష్టమైన స్థానాన్ని మరోసారి బహిరంగపరుస్తూ "అమోరిస్ లతిషియా" "Amoris Laetitia" ("Joy of Love" "ప్రేమానందము") అను అపోస్తోలిక ప్రభోదంను తిరుసభకు అందించడం ప్రశంసనీయము. ఈ విశ్వలేఖ ప్రస్తుత కాల సంకేతాలకు అనుగుణంగా వివాహము మరియు కుటుంబ వ్యవస్థలో

నెలకొన్న అకాల గాయములైన విడాకులు, వ్యభిచారం, అక్రమ సంబంధము, బాల్య వివాహాలు, మతాంతర, కులాంతర వివాహ సవాళ్ళు, వరకట్నము, ఆత్మహత్య, భ్రూణహత్యలు, గర్భనిరోధక మార్గాలు, డబ్బు ప్రలోభం, అత్యాచారం, పైశాచికత్వం, త్రాగుబోతుతనం, లైంగికజ్ఞానలోపం, స్త్రీలపై పెరుగుతున్న అకృత్యాలు, ఒంటరితల్లి/ఒంటరి తండ్రితో ఉన్న కుటుంబాలు మొదలగు ప్రతికూల పరిస్థితుల వలన బాధింపపడుతున్న కుటుంబాలకు ఒక కారుణ్య తైలముగా మారి మంచి స్వస్థతను, బలమైన సఖ్యతను ప్రసాదిస్తుందని ఆశించుదాం, ఆస్వాదించుదాం.

ఇటీవల టీవీలో ప్రసారమౌతున్న "రచ్చబండ", "బ్రతుకు జట్కాబండి", "సంసారం ఒక చదరంగం" మొదలగు కార్యక్రమాల ద్వారా బహిర్గతమౌతున్న వివిధ రకాల కుటుంబ సమస్యలను గమనిస్తే, ఎన్ని కాపురాలు శాంతి సమాధానాలు లేకుండ వివాహ, కుటుంబ జీవితంలో, బాధలను, ఇబ్బందులను అనుభవిస్తున్నాయో అర్థమౌతుంది.

## 1. మానవుని ఔన్నత్యము: దేవుని ప్రతిరూపము, ప్రేమ బంధము

వివాహ వ్యవస్థను బట్టి కుటుంబ వ్యవస్థ ఉంటుంది; కుటుంబ వ్యవస్థను బట్టి సమాజము ఉంటుంది; సమాజమును బట్టి విశ్వ ప్రపంచం ఉంటుంది. "దేవుడు మానవుని తన రూపములో సృష్టించాడు, వారిని స్త్రీ, పురుషులనుగా సృష్టించాడు" (అ.కా. 1:27). ఇటువంటి అత్యున్నతమైన, దైవాంశసంభూతమైన బంధమే భార్యభర్తల పవిత్ర బంధము. వీరు తమ దాంపత్య జీవితం ద్వారా, దేవుని తోడ్పాటుతో జీవనోత్పత్తికి సహకరిస్తూ దేవుని రక్షణ చరిత్ర పురోగమనానికి నాంది పలుకుతున్నారు (ప్రేమానందం 11). దేవుడు ప్రేమ బంధము (గాడ్ ఈజ్ లవ్) ప్రతి కుటుంబము ఈ ప్రేమను బాహాటముగా ప్రకటిస్తుంది. "మన దేవుడు తన అత్యంత లోతైన రహస్యములో ఒంటరివాడు కాదు, కాని ఆయన ఒక కుటుంబము; తనే పితృత్వము, పుత్రత్వము మరియు కుటుంబానికి అవసరమైన విలువైన ప్రేమ" ఆ ప్రేమే వసుదైక కుటుంబము, పరిశుద్ధాత్మ దేవుడు" (పునీత 2వ జాన్ పాల్ పాపుగారు). ఈ విధంగా కుటుంబ వ్యవస్థ దేవునితో ముడిపడి

ఉంది. నూతన వేదంలో కుటుంబము యొక్క మరొక నూతన కోణాన్ని మనం గమనించాలి. ఆదిమ క్రైస్తవ సంఘము వారి ఇండ్లలో/గృహాలలో సమావేశమైనట్లుగా మనం చదువుతున్నాము (1 కొరింతీ 16:19; రోమీ 16:5; కొలస్సీ 4:15; ఫిలో 2) ఈ విధంగా కుటుంబము యొక్క నిజమైన స్థానము చిన్న తిరుసభ లేదా గృహస్త దేవాలయము. ఇది దివ్యసత్ప్రసాద దివ్యసంస్కారపు బల్ల వద్ద ఆసీనుడైన క్రీస్తుకు అమరికగా ఉన్నది (ప్రేమానందం 15). "ఇదిగో నేను తలుపుతట్టుచున్నాను, ఎవరైనా నా స్వరమును విని తలుపు తెరచిన లోనికి వత్తును. వానితో భుజింతును. అతడు నాతో భుజింతును" (దర్శన 3:20). ఇక్కడ కుటుంబములో నెలకొనియున్నది సాక్షాత్తు "దేవుని సన్నిధి" అని మనము గుర్తిస్తున్నాము.

కుటుంబము బిడ్డలను వారి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఎదుగుదలకు కావలసిన వాతావరణాన్ని కలిగించాలని పవిత్ర గ్రంథం బోధిస్తుంది. తల్లిదండ్రులు ఈ గొప్ప బాధ్యతను నిర్విఘ్నంగా నెరవేర్చాలి. (సామెతలు 3:11,12, 6:20-22, 13:1, 22:15, 23:1314, 29:17) పిల్లలు వారి బాధ్యతగా దేవుని ఆజ్ఞలను పాటించాలి. పది ఆజ్ఞలలో 4వది "తల్లిదండ్రులను గౌరవించుదువు గాక" (నిర్గమ 20:12). ఇక్కడ "గౌరవించుదువుగాక" అనేది సాంఘీకపరంగా, కుటుంబపరంగా ఒక కట్టుబాటు క్రియ (పని, నిబద్ధత) (ప్రేమానందం 17). "తండ్రిని గౌరవించువాడు తన పాపములకు ప్రాయశ్చిత్తము చేసికొనినట్లే; తల్లిని సన్మానించువాడు నిధిని చేకొనినట్లే" (సిరా 3:-4).

పిల్లలు తమ కుటుంబము యొక్క సొత్తు కాదు; కానీ వారి వారి జీవిత ధ్యేయం మరియు సంఘంలో వారి దైవ పిలుపును బట్టి వారు జీవించాలని సువార్త మనకి జ్ఞాపకం చేస్తుంది. యేసుక్రీస్తు తన తల్లిదండ్రులకు విధేయుడై తనను వారి సంరక్షణలో ఉంచుకొనెను (లూకా 2:51). సమయము ఆసన్నమైనపుడు పిల్లలు వారి జీవిత నిర్ణయాలు/బాధ్యతల మేరకు, దైవరాజ్యము కొరకు కుటుంబము నుండి దూరము కావలసి ఉంటుందని ప్రభువు సూచించారు (మత్తయి 10:34-37, లూకా 9:59-62). 12 సం॥ల ప్రాయములోనే ప్రభువు

వారి తల్లిదండ్రులైన మరియ, యోసేపులకు తాను దేవుని సన్నిధిలో నిమగ్నమై సాధించవలసినది చాల ఉన్నదని చెప్పి ఉన్నారు (లూకా 2:48-50) (ప్రేమానందం 18).

ఈ నేపథ్యంలో మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మనం పిల్లలను ఎటువంటి వాతావరణంలో పెంచుతున్నాము? వారికి కావలసిన మానసిక, శారీరక, ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఎంత వరకు న్యాయం చేస్తున్నాము? ఈ మధ్యకాలంలో చాలామంది పిల్లలు ఇంటి నుండి పారిపోవడం, కిడ్నాప్ చేయబడడం, చెరచబడడం, మత్తుపదార్థాలకు అలవాటు పడడం, ఆత్మహత్యకి పాల్పడడం, తల్లిదండ్రులతో విభేదించి, అవిధేయించి కుటుంబానికి దూరముగ ఉండడం మనం గమనిస్తున్నాము. ఇవి తల్లిదండ్రులకు, కుటుంబాలకు దు:ఖం కలిగించే విషయాలు. ఈ మధ్యకాలములో ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిన తరువాత యువత అనేక చెడు అలవాట్లకు బానిస అవుతున్నారు. అశ్లీల చిత్రాలు (పోర్నోగ్రఫి), వివిధ రకాలైన వీడియోగేమ్స్, పిల్లలను, యువతను తప్పుత్రోవలో నెడుతున్నాయి. ఉదా: బ్లూ వేల్ ఛాలెంజ్, ఇటువంటి ఆందోళనకర పరిస్థితులలో వివిధ మైత్రాసన యువత సదస్సులో ఈ దురలవాట్లను గురించి అవగాహన సదస్సులు నిర్వహించి యువతను మేల్కొల్పి సక్రమమైన మార్గములో వారిని ప్రోత్సహించడం మన అందరి బాధ్యత. తల్లిదండ్రులు అప్రమత్తముగా ఉంటూ తమ పిల్లలు కంప్యూటర్ మరియు సెల్‌ఫోన్లో ఏమి చూస్తున్నారు, చేస్తున్నారో గమనించాలి, జాగ్రత్తపడాలి.

లోక రక్షకుడైన మన ప్రభువు కుటుంబంలో ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులు, సవాల్లు గురించిన పరిజ్ఞానమును సువిశేష ఉపమానాలుగా మలచి మనకు అందించారు (ప్రేమానందం 21). "ఇంటిని విడిచి దూరప్రాంతాలకు వెళ్లి తండ్రి ఆస్తిని దుబార చేసిన కొడుకు" (లూకా 15:11-32). "తండ్రి మాటని వినని కుమారుడు" (మత్తయి 21:28). "కౌలుదారులకు చిక్కి హింసకు లోనైన కుమారుడు" (మార్కు 12:1-9). "విందును నిరాకరించిన ఆహ్వానితులు" (మత్తయి 22:1-10). నాణెమును పోగొట్టుకొని బాధపడిన పేద కుటుంబము (లూకా 15:8-10). ఇటువంటి ప్రతికూల పరిస్థితుల నుండి మన పిల్లలను

కాపాడుకొనవలసిన బాధ్యత మనపై ఉన్నది. "యేసు జ్ఞానమందును, ప్రాయమందును వర్ధిల్లుచు దేవుని అనుగ్రహమును, ప్రజల ఆదరాభిమానములను పొందుచుండెను" (లూకా 2:52). ఈ నేపథ్యములో తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రతి ఆదివారము/ప్రతి రోజు దివ్య బలిపూజకు మరియు సత్యోపదేశ తరగతులకు, యువత సదస్సులకు, వడకములకు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమములకు ప్రోత్సహించాలి.

## 2. కుటుంబము ఒక వేడుక

"ఎటువంటి కొరతలు లేని సంపూర్ణమైన కుటుంబము స్వర్గం నుండి ఊడిపడదు; అందుకే కుటుంబాలు నిరంతరం అభివృద్ధి చెందుతూ, పరిపక్వమైన ప్రేమలో ఎదుగుతూ ఉండాలి" (ప్రేమానందం 325). అనేక కారణాలు పరిస్థితులు, ప్రతికూల అంశాలు కుటుంబము యొక్క పవిత్రతను, విశిష్టతను ప్రభావితం చేశాయని తెల్పుచూ, దీని వలన వివిధ దేశాలల్లో, సంఘాల్లో వివాహాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయాయని పాపుగారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ విలువలను సజీవంగా అందిపుచ్చుకోవడానికి పవిత్ర గ్రంథ ప్రేరణను స్వీకరించాలని ఆహ్వానిస్తున్నారు. "కుటుంబ జీవితాలు, పుట్టుక వృత్తాంతాలు, ప్రేమ కథలు మరియు కుటుంబ కలహాలు పవిత్రగ్రంథమంతా నిండియున్నాయి (ప్రేమానందం 8). బైబులు గ్రంథము ఆదాము, ఏవల కుటుంబము, వారి సాధకబాధలు మరియు దేవునియందు ఆ కుటుంబ పటిష్టతతో ప్రారంభమై (ఆది 4). నూతన వధువు మరియు గొర్రెపిల్ల వివాహ వేడుకతో ముగుస్తుంది (దర్శన 21:2-9). పవిత్ర గ్రంథ ప్రారంభం నుండి చివరి పుట వరకు కుటుంబ జీవితాన్ని పటిష్టం చేసి, బలపరచి, ఆదర్శవంతముగా, సూత్రీకరించగలదు అని ఫ్రాన్సిస్ పాపుగారు అభిప్రాయపడుతున్నారు. క్రీస్తు తన నిరాడంబర జననము ద్వారా మరియ యోసేపుల కుటుంబ జీవితాన్ని పవిత్రపరిచారు. అలానే తన సందర్శన ద్వారా కానాపల్లెలోని వివాహ గృహమునకును, మరియా మార్త, లాజరు గృహమునకును, జక్కయ్య గృహమునకును, పేతురు గృహమునకును, యాయీరు గృహమునకును, ఆనందము, సంతోషము, రక్షణ, స్వస్థత, జీవము అను వరాలను ప్రసాదించారు.

ఈ మధ్యకాలములో కుటుంబ వ్యవస్థ అనేక మార్పులకు లోనైన ఫలితముగా క్రొత్త సవాళ్ళను ఎదుర్కొంటుంది. వివాహము యొక్క ఐక్యతను, శాశ్వతత్వమును, పవిత్రతను నిర్వీర్యం చేయడానికి అనేక వ్యతిరేక శక్తులు పోరాడుతున్న సందర్భములో తిరుసభ నాయకత్వం వారి ప్రేషిత సేవ కార్యక్రమాలలో వీటిని గురించి ఆలోచించి క్రియాశీలక నిర్ణయాలను చేపట్టాలని ఫ్రాన్సిస్ పాపుగారు సూచిస్తున్నారు (ప్రేమానందం 35). "దాంపత్య జీవితం ద్వారా భిన్న శరీరులు కాక ఏక శరీరులై ఉండే దంపతులు (మత్తయి 19:16) - ఒకరికొకరు సహాయ సహకారాలను అందజేసుకుంటూ, ఒకరికొకరు సేవలు చేసుకుంటూ అన్యోన్యంగా జీవించాలి" (విశ్వాస వికాస సాధన-1; పేజి 3) వివాహము దేవుని ఆలోచన నుండి వెలువడిన ఒక వరము. ఈ దివ్యమైన కానుకను కాపాడుకోవలసిన ఆవశ్యకత శ్రీసభపై ఉన్నది. నజరేతు కుటుంబము కనబరచిన, జీవించిన ప్రేమ, విశ్వసనీయత ప్రతి కుటుంబములో ప్రతిభింబించి ప్రస్తుతం నెలకొన్న గడ్డు పరిస్థితులను ఎదుర్కొనే శక్తిని కలిగి ఉండాలి. ప్రతి కుటుంబములో బలహీనతలు ఉన్నప్పటికీ అదే కుటుంబము చీకటి ప్రపంచములో ఒక దీప స్తంభముగా ఉండగలదు (ప్రేమానందం 66).

వివాహము కూడ దైవ పిలుపు కావున, వివాహమాడి కుటుంబాన్ని నిర్మించుకోవాలన్న నిర్ణయం, ప్రార్థనా పూర్వక ఆలోచన పద్ధతిలో జరగాలి (ప్రేమానందం 72). కుటుంబములో ఉండే సమస్యలను ఇబ్బందులను పొడిగించకుండా వాటిని మృదువుగా, స్నేహపూర్వకముగా పరిష్కరించకుండా ఒకరోజు కూడా ఉండకూడదు అని నా సలహా. ఈ విధంగా మీరు వేసే ప్రతి అడుగు, చేసే ప్రతి ప్రయత్నము కుటుంబములో ఐక్యతను, సఖ్యతను, సామరస్యాన్ని నింపుతుంది" (ప్రేమానందం 71). కుటుంబము దేవుడు ఇచ్చిన వరము కనుక దీని ద్వారా కుటుంబ సభ్యులు ప్రేమ, కారుణ్యము, పవిత్రతలో పెరిగి మానవ విలువలను కలిగిన యథార్థవంతమైన, నీతివంతమైన జీవితమును జీవించాలి.

### 3. కుటుంబ/వివాహ వ్యవస్థలోని గాయములను గుర్తించి తగిన చికిత్సను అందించుట

నేటి సమాజంలో మన కుటుంబాలల్లో అనేక కారణాల వల్ల దంపతుల మధ్య అవగాహన లోపించి అనేక వివాదాలకు దారితీస్తున్నాయి. వాటిలో మచ్చుకు కొన్ని...

- ఒకరిపై ఒకరికి అనుమానాలు రావడం
- పంతాలు, పట్టింపులకు పోవడం, సర్దుబాటు మనస్తత్వము లోపించడం
- తాము తక్కువ కాదని ఒకరికి మరొకరు భీష్మించుకోవడం
- కుటుంబ పాలన లేని చోట్ల వీరి మధ్య ఏర్పడిన మనస్పర్థలను నివృత్తి చేసేవారు లేకపోవడం
- ఇంటి పనుల్లో ఒకరికి మరొకరు తోడ్పాటు అందించుకోకపోవడం
- సంతానలేమి వలన కలిగే నిరాశ నిస్పృహలు
- ఎవరో గిట్టనివారు చెప్పిన మాట విని ఒకరిని ఒకరు అనుమానించడము
- సెల్‌ఫోన్‌లలో తరుచుగా మాట్లాడుతుంటే ఎవరితో మాట్లాడుతున్నారోనని అనుమానాలు రావడం
- రాత్రి వేళల్లో తరచుగా స్నేహితులతో గడపడం, చెడు అలవాట్లను అలవరచుకోవడం
- దైవభక్తి లోపించడం

**నివారణ ప్రయత్నం: ప్రార్థనా జీవితం** (a family that prays together stays together)

- ఆధ్యాత్మిక మరియు మానసిక కౌన్సిలింగ్ కొరకు ప్రయత్నించడం
- ఒకరిపై ఒకరికి నమ్మకం ఉండాలి. (cordial trust)
- నా మాట చెల్లుబాటు కావాలనో, నాదే పైచేయిగా ఉండాలనే పంతాలు పట్టింపులకు తావివ్వకుండా, ఇద్దరిలో ఎవరి మాట సరైందోనన్న అభిప్రాయానికి వచ్చిన తర్వాతనే నిర్ణయాలు తీసుకోవాలి.
- ఏదైనా సమస్య వస్తే కుటుంబ పెద్దలకు తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేసుకోవాలి.

– ఇంటి పనులను భార్యనే చూసుకోవాలని కాకుండా ఇంటి పనుల్లో కాస్త తోడ్పాటు అందిస్తూ ఒకరికి ఒకరు సహాయపడుతూ ఉండాలి (ఎఫేసీ 5: 24–25)
– పిల్లలు లేకపోవడానికి కారణాలను వైద్యులను అడిగి తెలుసుకోవాలి. అందుకు వైద్యుల సూచన మేరకు మందులను వాడాలి; బిడ్డలను దత్తత తీసుకోవడము తదితర సానుకూల అంశాలపై దృష్టి సారించాలి.

కుటుంబాలకు గురుత్వ సేవలు అందించడము అంటే కొన్ని నియమ నిబంధనలు రూపొందించడము కాదు. దానికి బదులుగా నేటి సమాజానికి అవసరమైన సువిశేష విలువలను అందించాలి (ప్రేమానందం 201). విచారణ క్రైస్తవ సంఘము దీనికి నిలయముగా మరియు నిదర్శనముగా వుండాలి. గృహస్థ క్రైస్తవుల నిపుణుల సేవలు ఈ కోణములో విరివిగా ఉపయోగించుకోవాలి. గృహస్థ క్రైస్తవ నిపుణులు దంపతులకు ఇచ్చేటటువంటి కౌన్సిలింగ్ సేవలో "ఆధ్యాత్మిక సూచనలు, తిరుసభ యొక్క ఆధ్యాత్మిక సంపద, సఖ్యతా దివ్యసంస్కారము (కన్ఫెషన్) మొదలగు గొప్ప అంశములను జోడించి వారి జీవిత అనుభవాలను పంచుకోవాలి.

స్థానిక శ్రీసభ, వివాహ జీవితానికి సిద్ధమౌతున్న వారికి "జ్ఞాన వివాహ దివ్యసంస్కారము యొక్క విశిష్టతను, పవిత్రతను, వివాహము, కుటుంబ జీవితము యొక్క బాధ్యతలు, కర్తవ్యాలను సూచించే ఒక పాఠ్యాంశమును సిద్ధం చేయాలని 'ప్రేమానందము' సూచిస్తుంది (ప్రేమానందం 206–207). వివాహము తరువాత కొద్ది సంవత్సరములు నూతన దంపతులతో సంప్రదింపులు కొనసాగిస్తూ వారికి ప్రేమపూరిత తోడ్పాటును అందించాలి (ప్రేమానందం 217–221). కుటుంబ నియంత్రణ అంశములో దంపతులు పరస్పర అవగాహన మరియు గౌరవ మర్యాదలను, తిరుసభ బోధనలను పాటించాలి.

దురదృష్టవశాత్తు వివాహములో మరియు కుటుంబ జీవితములో ఎదురయ్యే సమస్యలను బాధలను చాలామంది దంపతులు గురువులతో పంచుకోవడం లేదు; దీనికి ప్రధాన కారణము గురువుల నుండి దయాపూరితమైన, సంరక్షణమైన స్పందన లోపించడమే (ప్రేమానందం 234). కాబట్టి గురువులు,

కన్యాస్త్రీలు మరియు గృహస్త క్రైస్తవ నిపుణులు ఇటువంటి విషయములలో తగిన తర్ఫీదును పొంది సిద్ధముగా వుండాలి. “వివాహ జీవితములో అన్యాయంగా విడిపోయినవారు, విడిచిపెట్టబడినవారు, విడాకులు తీసుకొన్నవారు, భార్య ద్వారాగాని, భర్త ద్వారాగాని గృహ హింసకు లోనైనవారికి సరైన గౌరవము, సముచిత స్థానము మరియు వారికి తగిన మరియు ప్రోత్సాహము అందించాలి (ప్రేమానందం 242).

ఈ ప్రబోధం (ప్రేమానందము) వివాహ జీవితంలో విడాకులు తీసుకొని విడిపోయిన వారిని, సక్రమముగాలేని బంధాలను అనగ తిరుసభ చట్టాలకు ప్రతికూలముగా పెండ్లి చేసుకున్న వారిని తప్పుపట్టి, వేలెత్తి చూపెట్టే విధంగా కాకుండా, చాలా సహనముతో ఆధ్యాత్మిక, మానసిక ప్రోత్సాహముతో, వారి సాధక బాధలను అర్థంచేసుకుంటూ కారుణ్యముతో తోడ్పాటును అందించాలని పిలుపునిస్తోంది. ఈ విధంగా బాధపడ్తున్న వారిని వెదకి, శ్రీసభలో వారిని సభ్యులుగా గుర్తించాలి. క్రీస్తు ప్రబోధించిన “పోగొట్టుకోబడిన నాణెము”, “రహస్యముగ పొలములో దాచబడిన సంపద” అను ఉపమానములు వీరికి అన్వయిస్తాయి. వీరు కూడా శ్రీసభ సంపదే. గురువులు, కన్యాస్త్రీలు మరియు తదితర సంబంధిత భాధ్యత గల వ్యక్తులు వారికి తోడ్పాటును అందించాలి. చట్టాలు, న్యాయశాస్త్ర అంశాల మీద దృష్టి సారించక, వాటిలో నెలకొనియున్న మానవ విలువలను గుర్తించాలి. “ఈ క్రమములో శ్రీసభ, వైవాహిక, కుటుంబ జీవితంలో అనేక కారణాల వల్ల గాయపడి, బాధింపబడుచున్న వారికి చేయూతనిచ్చి, వారు జీవితంలో దైవవరప్రసాదిత అంశాన్ని అర్థం చేసుకోనేల చేసి, దేవుని యొక్క సమృద్ధి జీవనాన్ని, దేవుని ప్రణాళికను, పవిత్రతను సహృదయముతో అందుకొనేల సహాయపడాలి” (ప్రేమానందం 297).

## 4. శ్రీసభ కారుణ్య పూరిత ప్రమేయము, తోడ్పాటు, ప్రేషిత చర్యలు

ప్రేషిత సంరక్షణ కార్యములో మొట్టమొదటగా, బాధితుల సాధక బాధలను జాగ్రత్తగా ఆలకించాలి, (to listen is to heal) దంపతులు లేదా కుటుంబ సభ్యుల యొక్క సమస్యలలో, ఇబ్బందులలో పాలుపంచుకొని ప్రేమపూర్వక

తోడ్పాటును అందించాలి. విడాకులు తీసుకుని మరల వివాహము (తిరుసభ చట్టానికి విరుద్ధముగా) చేసుకున్న వారి యొక్క ప్రస్తుత బాంధవ్యములో ఉన్న అనుకూల అంశాలను గుర్తించి ఆ దిశగా వారిని ప్రోత్సహించాలి. ఎవరైతే సక్రమమైన బాంధవ్యములో లేరో వారిని నిర్లక్ష్యము చేయక, క్రీస్తు శరీరమైన శ్రీసభలో భాగంగా గుర్తించి స్నేహపూర్వక హస్తాన్ని అందించాలని పాపుగారు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సంఘటిత సమైఖ్య సమాజ (ఇన్‌క్లూసివ్ సొసైటీ) నిర్మాణానికి, ప్రేషిత చర్యలో భాగంగా, పేదవారిని, బాధితులను, సంఘము నుండి వెలివేయబడిన వారికి పెద్దపీట వేయాలి. ఈ విధమైన ప్రేషిత సేవలు కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారికి కూడా అందించాలి. మన తెలుగు శ్రీసభలో, ఉభయ తెలుగు రాష్ట్రాలల్లో కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారి పరిస్థితి ఎలా ఉంది? ఈ దిశగా ప్రయత్నించే వారికి మనం అందించే తోడ్పాటు ప్రేషిత సేవలు ఎలా ఉన్నాయి? ఈనాటి తల్లిదండ్రులు, పిల్లల చదువుకోసం నాణ్యత కలిగిన, పేరుగాంచిన విద్యాసంస్థల కోసం వెదకి, ఎంత ఖర్చైన అది ఏ కులానికి చెందినదైన, ఏ మతానికి చెందినదైన సరే ఎంపిక చేసి పిల్లలను చదివిస్తున్నారు. అంతవరకూ బాగానే ఉంది! మరి పిల్లల పెళ్లి విషయానికి వచ్చేటప్పటికి మాత్రము ఈ సానుకూల స్వభావాన్ని చూపించలేకపోతున్నారు. ఇది చాలా ఆలోచించవలసిన విషయమే?

వివాహ బాంధవ్యములో సక్రమముగా లేని దంపతుల మీదకు రాళ్లు విసిరినట్లుగా, నైతిక నియమములను విసరకూడదు. "ఇది తిరుసభ బోధనల తెర వెనుకనుండి, మోషే ఆసనము మీద కూర్చుండి అధికారికంగా, న్యాయనిర్ణేతలుగా ఉండి క్లిష్టమైన సమస్యలతో, గాయపడిన కుటుంబాలకు తీర్పు ఇచ్చినట్లు అవుతుంది (ప్రేమానందం 305). గురువులు కారుణ్యపూరిత ప్రేషిత క్రియల ద్వార, పరిశుద్ధాత్మతో నడిపించబడి, వివాహ/కుటుంబ జీవిత బాధితులకు స్ఫూర్తినివ్వాలి. ఆ కుటుంబాలను తరచుగా సందర్శిస్తూ వారికి తగిన సూచనల ద్వారా ప్రేమపూర్వక తోడ్పాటును అందించాలి. ఈ మార్గములో స్థానిక శ్రీసభ అనేక కార్యాచరణ పద్ధతులను ఆవిష్కరించుకొని, అనుసరించాలి.

వివాహము మరియు కుటుంబ జీవితం మెరుగుపరచడాని కోసమే ప్రాంతీయ తెలుగు శ్రీసభ ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంతే కాకుండా ప్రతి మేత్రాసనములో వివాహ తర్ఫీదు సదస్సులు, పెళ్లైన వారికి ప్రత్యేక వడకాలు, కౌన్సిలింగ్ సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ఇదే విధంగా వివాహ/కుటుంబ జీవితములో వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి, విడాకులు తీసుకోవాలని నిశ్చియించుకున్న వారికి తగిన కౌన్సిలింగ్ సేవలు ఏర్పాటు చేయాలి. గృహహింస, అక్రమ సంబంధము, వ్యభిచారము మొదలగు అసాంఘిక, అనైతిక దురలవాట్లలో ఇరుక్కున్న వారి కొరకు కూడా స్వస్థత, సంరక్షణ చర్యలు చేపట్టాలి. వివాహము, కుటుంబ జీవితానికి సంబంధించిన విషయాల్లో సామాన్య క్రైస్తవులకు సరైన సూచనలు, సలహాలు అందించడానికిగాను, గురువులు, కన్యాస్త్రీలు, గృహస్త క్రైస్తవులు ప్రత్యేక శిక్షణ పొంది ఉండాలి. "విశ్వాసులకు దాంపత్య జీవితం యొక్క విలువలను, కుటుంబము యొక్క ప్రామాణ్యత, ప్రాధాన్యత అను మొదలగు అంశాలను వివరించాలి" (ప్రేమానందం 52).

ఉభయ తెలుగు రాష్ట్రాలల్లో కుటుంబ వ్యవస్థ, వివాహ వ్యవస్థలలో ఉన్న లోటుపాటులను గుర్తించి వాటిని ప్రక్షాళన చేసి, పటిష్టం చేయడానికి తెలుగు శ్రీసభ తగిన కార్యాచరణ పద్ధతులను కనుగొని ఆచరించాలి. కుటుంబ, వివాహ జీవిత సంక్షేమము కోసం మరిన్ని సేవాసంస్థలను ఏర్పాటు చేయవలసిన అవసరం శ్రీసభకు ఎంతైనా ఉంది. మేత్రాసన పరిధిలో వివాహ జూబిలేరియన్స్‌ని (25 మరియు 50 సం॥ల) గుర్తించి వారిని సన్మానించి ప్రోత్సహించాలి. విచారణ పరిధిలో కూడా వారిని గుర్తించి సన్మానించి గౌరవించడం సముచితము. ఈ ఆచారం యువతకు ప్రోత్సాహకరంగా, ఆదర్శప్రాయముగా ఉంటుందని నా అభిప్రాయము. దివ్యవాణి టీవీలో ప్రసారమౌతున్న "దివ్య నిలయం, శ్రీసభ న్యాయశాస్త్రములోని కుటుంబ మరియు వివాహ సంబంధమైన పాఠ్యాంశాలు" ప్రసారము కావడము ప్రశంసనీయము.

**ముగింపు**

లోక శ్రేయస్సు, శ్రీసభ శ్రేయస్సు; మానవ దు:ఖం (Gaudium et Spes. 1) క్రీస్తు మార్గమే, శ్రీసభ మార్గం; అదే కారుణ్య మార్గం. "నాకు బలులు

అవసరము లేదు. కాని కారుణ్యము కావలయును" (హోషేయ 6:6). యేసుక్రీస్తు తన మొట్టమొదటి అద్భుతాన్ని కానపల్లెలోని వివాహ వేడుకలో "నీటిని ద్రాక్షారసముగా మార్చి అందరికి ఆనందాన్ని, సంతోషాన్ని పంచి యిచ్చారు". ముఖ్యముగా నవదంపతులకు మరియు కుటుంబ సభ్యులకు ఇది చాలా దీవెనకరం. మానవ సంబంధ బాంధవ్యాలలో, కుటుంబ జీవితములో మనము క్రీస్తు క్షమాగుణాన్ని అనుసరించాలి. వ్యభిచారంలో పట్టుబడిన స్త్రీతో ప్రభువు "నేను కూడా నిన్ను శిక్షింపను; వెళ్లి పాపము లేకుండా జీవించు" అని పలికినట్లుగా, కుటుంబ వివాహ జీవతంలో ఆధ్యాత్మికంగా, శారీరకంగా, మానసికముగా గాయపడిన వారికి, న్యాయనిర్ణేతలుగా కాకుండా, కారుణ్యపూరిత ప్రోత్సాహకరమైన తోడ్పాటును అందించి వారికి బాసటగా నిలవాలి. ఈనాటి సమాజములో తిరుసభ ప్రేషితకార్యములందును, సువార్తాబోధనయందును, సృజనాత్మక విధానాలను కనుగొని విశ్వాసులకు తోడుగా ఉండాలి. గురుత్వ సేవలు, నూతన ఉత్సాహముతో, అవసరమైన చక్కని సవరణలతో దంపతులకు, కుటుంబ సభ్యులకు, పిల్లలకు, యవ్వనస్తులకు, వృద్ధులకు, వికలాంగులకు, నిరాశ్రయులకు, పేదలకు, అనాధలకు, రోగస్తులకు, క్రీస్తు ప్రేమను, ఓదార్పును అందించేవిగా ఉండాలి. గురువులు తాము బోధించే సువార్త సందేశమునకు, తనే ప్రథమ సాక్షిగా ఉండవలయును. ప్రజల హృదయము స్పందించే విధముగా దివ్యకారుణ్య మార్గమును గుర్తించి వారికి తోడ్పాటును అందించాలి. మన కతోలిక సంఘాలు ఎడారిలోని జలాశయము వలె కరుణను అందించే 'కరుణాశయము' వలె ఉండాలని ఆశించుదాం, ప్రయత్నించుదాం, ప్రార్థించుదాం.

❊ ❊ ❊ ❊

# 5. కుటుంబ సత్యోపదేశంలో బైబిలు యొక్క భావసార్థకత

- శ్రీ గొర్డెన్ మోరిస్, B.Th.

- అనువాదం: బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్

**ఉపోద్ఘాతం**

ప్రస్తుత కాలమాన పరిస్థితులలో కుటుంబములోని స్థితిగతులు చిన్నాభిన్నముగా తయారవుతున్న తరుణములో, నేటి 'పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారి అపోస్తోలిక ప్రబోధం: ప్రేమానందం' మన ఆంధ్ర, తెలంగాణ శ్రీసభలో ఉన్న కుటుంబాలకు సమతుల్య ఆధ్యాత్మికతను, కుటుంబ ప్రేమను పెంపొందిస్తున్న అంశముపై లోతుగా గ్రహించుదాం. చాలామంది విశ్వాసులు అనుదిన కుటుంబ జీవితంలో ఎన్నో ఇబ్బందులు



ఎదుర్కొంటూ, శ్రీసభను ఆశ్రయిస్తూ పరిష్కారం కోసం వెదకుతున్నారు. ఈ సందర్భములో తల్లియైన శ్రీసభ ప్రతి కుటుంబం సమాజంలో ఎదుర్కొనే కష్టనష్టాలను గుర్తించి వారికి భరోసాగా ఉంటూ ఆదరిస్తుంది. అదే విధముగా, ప్రతి కుటుంబం విశ్వసనీయమైన ప్రేమబంధానికీ చెరగని సంకేతముగా నిలిచి శ్రీసభ ప్రేషిత కార్యములో ఉత్సాహముగా పాల్గొంటూ జాలి, దయ, ప్రేమ అనే సుగుణాలను వెల్లివిరియాలి. మరి ఇటువంటి సుగుణాలను, విషయాలను ప్రతి యొక్క వ్యక్తి కుటుంబం అనే ప్రేమ సమాజం నుండి నేర్చుకుంటాడు. ప్రభువు మనందరికి యోహాను సువార్త 8:31-32 వచనాలలో ఈ విధముగా తెలియజేయుచున్నారు "మీరు నా మాటపై నిలిచియున్నచో నిజముగా మీరు నా

శిష్యులై ఉందురు. మీరు సత్యమును గ్రహించెదరు. సత్యము మిమ్ము స్వతంత్రులను చేయును". ప్రియ పాఠకులారా! ఇటువంటి పరిచయ పలుకులతో నేను 'కుటుంబ సత్యోపదేశంలో బైబిలు యొక్క భావసార్థకత - సువార్తా ప్రేమానందం నుండి దృష్టికోణం' గూర్చి లోతుగా తెలుసుకుందాం.

పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారికి కుటుంబాన్ని ఏ విధంగా అయినా ప్రోత్సహించాలి, సమస్యల నుండి విముక్తి చేయాలనే తలంపు 2013 సంవత్సరములో కలిగింది. వెంటనే 2014-15 సంవత్సరాల్లో కుటుంబం మరియు వివాహం అనే అంశాలపై విశ్వ కతోలిక మేత్రానుల సమాఖ్య సదస్సులు నిర్వహించారు. ఇదే ప్రక్రియలో, కొన్ని ప్రాంతీయ సంస్కృతుల్ని, సంప్రదాయాల్ని దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల్లో చర్చలు జరిపిన తదనంతరం 'ప్రేమానందం' అనే అధికార అపోస్తోలిక ప్రబోధాన్ని 2016 మార్చి 19న విడుల చేసారు. 'ప్రేమానందం'లో 325 అధికరణాలు (ఆర్టికల్స్) ఉన్నాయి. ఇవన్నీ కూడా 9 అధ్యాయాలుగా ఇవ్వబడినవి. ప్రేమానందం కేవలం కుటుంబ సత్యోపదేశంలో బైబిలు యొక్క భావసార్థకతను, ప్రాముఖ్యతను గూర్చి తెలియజేయుటయే కాకుండా, ఇంకా కుటుంబ జీవితంలో దేవుని ప్రేమను, కుటుంబ ప్రేమను గూర్చి నొక్కి వక్కాణిస్తుంది. "ప్రియ మిత్రులారా! ప్రేమ దేవుని నుండి పుట్టినది. కనుక మనము పరస్పరము ప్రేమింతుము. ప్రేమించువాడు దేవుని బిడ్డ. అతడు దేవుని ఎరిగినవాడగును" (1 యోహాను 4:7). కుటుంబాల సమ్మేళనమే ఒక సమాజం. ఆ ప్రకారము, విశ్వాస కుటుంబాల సమ్మేళనమే శ్రీసభ. కుటుంబ సంతోషమే. శ్రీసభ సంతోషం. కుటుంబాల కన్నీరే, శ్రీసభ కన్నీళ్లు. అందుకే కుటుంబాల ప్రేమానందమే శ్రీసభ ఆనందము.

ఆగష్టు 23, 2004 సంవత్సరములో 8వ 'ఆసియా సర్వపీఠాధిపతుల సమాఖ్య' జరిగింది. ఈ సమావేశములో పీఠాధిపతులందరు 'ఆసియాలో కుటుంబము మరియు సంస్కృతికమైన జీవితం' అనే అంశముపై చర్చించారు. ఈనాటి ప్రపంచము సంస్కృతిక పరముగా, సాంకేతికపరముగా, ఆర్థికపరముగా, రాజకీయ పరముగా ఎన్నో విధాలుగా అభివృద్ధి చెందుతుంది. కాని ఒక ప్రక్క ఈ

విధముగా అభివృద్ధి చెందుతూనే, మరో ప్రక్క చాలా కుటుంబాలు ఈ లోక పోకడలకు గురవుతూ, సాంఘిక, రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మికపరమైన సంబంధాలలో కనుమరుగవుతున్నారు.

ఏది ఏమైనప్పటికీ, ఇక్కడ మనం ఆసియాలో ఒక సక్రమమైన మానవ సంబంధాలను, కుటుంబ, సంస్కృతిక, మతపరమైన అనుబంధాలను చూడవచ్చు. చాలా తరాల నుండి మన దగ్గర ఉన్న ప్రజలందరూ ఎల్లప్పుడు సమైక్యతతో, సోదరభావంతో, అన్యోన్య ప్రేమానురాగాలతో, అంకిత భావములో, నైతిక విలువలతో జీవిస్తున్నారు. కుటుంబ జీవితంలో మిళితమై ఉండు ఒప్పందములు, బాధ్యతలు వివాహమును, కుటుంబమునకు గల పిలుపును అంగీకరించునవిగా గుర్తించి, అంగీకరించునదిగా ఉండును. ఈ అంకిత భావములు, బాధ్యతలు వివాహమైన దంపతులను వారి వ్యక్తిగత, స్వీయాభివృద్ధిని కాంక్షించు దృక్పథములను, మార్గములను రూపాంతరము చెందించును. ఎందుకనగా కుటుంబ జీవితము మొత్తము, కుటుంబములోని సభ్యులందరి బాగోగులు, సంక్షేమము ప్రధాన బాధ్యత అగును. ఏవో కొన్ని మినహాయింపులు తప్ప, అధిక కుటుంబాలలో మొత్తము కుటుంబము అనే భావన, కుటుంబ సభ్యులందరికి అనే తలంపు ఎంత అధికమంటే వారిలో త్యాగము కూడా అధికముగా నుండి, వారు తమ కోరికలను, సుఖ సంతోషాలను, అవసరములను ప్రక్కన పెట్టుదురు. క్రైస్తవ కుటుంబాలకు, జ్ఞాన వివాహ సాంగ్య కృపావరముతో బాటు, విశ్వాస జీవితము ద్వారా లభించు దైవీక సహాయము కూడ తోడ్పడును. దంపతులకు తమ దాంపత్య జీవితము, కుటుంబ జీవితము దేవుడు ప్రసాదించిన ప్రత్యేక పిలుపుగ గుర్తించి, దేవుని సృష్టి కార్యములో తమ తోడ్పాటునందించు వారిగా తమ సహకారము నందించాలని శ్రీసభ వారికి పదే పదే నిరంతరము ఉద్బోధ చేయుచు ప్రోత్సాహింపవలెను. తద్వారా, ప్రతి కుటుంబం దేవుని ప్రణాళికను గుర్తు చేసుకుంటూ, గృహస్థ శ్రీసభగా ఏర్పడుతూ సువార్త పరిచర్యలో భాగస్తులు కావాలి.

గృహస్థ శ్రీసభగా పరిగణింపబడే కుటుంబంలో తల్లిదండ్రుల పాత్ర గురుతరమైనది. తమ సంతానానికి వారే తొలి ఆధ్యాత్మిక గురువులు. తమ

మాటల ద్వారా, చేతల ద్వారా ఆదర్శ ప్రాయమైన భక్తిజీవనం ద్వారా తల్లిదండ్రులే తమ పిల్లలకు విశ్వాస సత్యాలను బోధిస్తారు, ఉగ్గు పాలతోనే వారికి దేవుని పట్ల భక్తి విశ్వాసాలను రంగరించి పోస్తారు. క్రైస్తవ విలువలతోనే వారిని పెంచి పెద్ద చేస్తారు, విద్యాబుద్ధులు నేర్పిస్తారు. అలాగే యుక్తవయస్కులైన పిల్లలు తమకు అనువైన దైవ సంకల్పానికి అనుగుణమైన జీవన మార్గాన్ని ఎంపిక చేసుకోడానికి తల్లిదండ్రులు తోడ్పడాలి. ఈ సందర్భములో తోబీతు గ్రంథము 14:8,9 వచనాలు ఈ విధముగా తెలియజేస్తున్నాయి. "నాయనలారా! మీరు నా ఉపదేశములను పాటింపుడు. దేవుని చిత్తశుద్ధితో సేవింపుడు. అతనికి ప్రియమైన కార్యములను చేయుడు. దేవుని ఆజ్ఞల ప్రకారము జీవింపవలయునని, పేదలకు దానధర్మములు చేయవలయుననియు, ఎల్లవేళలందును ప్రభువును జ్ఞప్తియందుంచుకొని అతనిని పూర్ణ హృదయముతో కీర్తింపవలయుననియు మీ బిడ్డలకు నేర్పుడు". అదే విధముగా, ఆరవ పౌలు జగద్గురువులు మాటల్లో "క్రైస్తవ విశ్వాసుల మధ్య ఏర్పడే దాంపత్య బంధం వలన క్రైస్తవ కుటుంబం ఏర్పడుతుంది. కుటుంబ వ్యవస్థ మానవ సమాజానికి నూతన పౌరసంతతిని ప్రసాదిస్తుంది. క్రైస్తవ దంపతులకు కలిగే సంతానం జ్ఞానస్నాన సంస్కారం ద్వారా పవిత్రాత్మ కృపావరాలను పొంది దైవసంతతిగా మారుతుంది". ఆ విధముగా దైవ ప్రజా సంఘం శ్రీసభ దినదిన ప్రవర్ధమానమవుతుంది. తరతరాల వరకు అవిచ్ఛిన్నముగా కొనసాగుతూ వస్తుంది. కుటుంబములో ప్రతి వ్యక్తి ఒక సువార్తీకుడిగా, సువార్తీకురాలుగా ఉంటూ, క్రీస్తు బోధనలను తీపిచేస్తూ మన పొరుగువారికి, బంధుమిత్రులకు తెలియజేయాలి.

యాజక సంఘమైన శ్రీసభ పవిత్ర స్వభావము, సంస్థాగతమైన శ్రీసభ స్వభావము. అది ఆచరించే దివ్యసంస్కారాల ద్వారా, పాటించే నియమ నిష్ఠల ద్వారా గుణ శీలాదుల ద్వారా ప్రపంచానికి వెల్లడవుతాయి. జ్ఞానస్నానము ద్వారా శ్రీసభలో సభ్యులుగా చేరే విశ్వాసులు, తమ బాప్తిస్మ ధర్మం ప్రకారం క్రైస్తవ మతారాధనలో, అర్చనకాండలో పాల్గొన బద్ధులై ఉంటారు. దేవుని కుమారులుగా, కుమార్తెలుగా పునర్జన్మించిన విశ్వాసులు, శ్రీసభ ద్వారా దేవుడు తమకు ప్రసాదించిన విశ్వాస వరాన్ని మానవుల ఎదుట తమ ఆదర్శజీవనం ద్వారా సజీవంగా ప్రదర్శించాలి, స్పష్టముగా ప్రకటించాలి. సకల జాతి జనులకు సువార్తా ప్రబోధం

చేయడం శ్రీసభ ధర్మం. విశ్వజనీనమైన రక్షణ సంస్కారంగా తన వ్యవస్థాపకులైన క్రీస్తు ప్రభువు ఆదేశం ప్రకారం (మత్తయి 16:15), తన సార్వత్రిక సహజ ధర్మాన్ని అనుసరించి, శ్రీసభ అన్ని జాతుల వారికి క్రీస్తు సువార్తను బోధించడానికి అంకితభావంతో కృషి చేస్తూ ఉంటుంది. శ్రీసభ నిర్మాణం అపోస్తోలిక పునాదులు మీదనే జరిగింది. అపోస్తులులు ప్రభు క్రీస్తు అడుగు జాడల్లో నడుస్తూ దైవవాక్కు ప్రబోధం చేసి క్రైస్తవ సంఘాల ప్రాదుర్భావానికి కారకులయ్యారు. ఈ సందర్భములో మనం పునీత పేతురు గారి సందేశమును జ్ఞాపకపరచుకొందాము. తాను పెంతెకొస్తు దినమున పవిత్రాత్మతో నింపబడిన తరువాత రమారమి మూడువేల మందికి జ్ఞానస్నానం ఇచ్చి ప్రభు శిష్యులుగా చేర్చుకొనెను. "మీరు హృదయ పరివర్తన చెంది మీ పాప పరిహారమునకై ప్రతి ఒక్కరు యేసుక్రీస్తు నామమున, బాప్తిస్మము పొందవలయును. అప్పుడు మీరు దేవుని వరమగు పవిత్రాత్మను పొందుదురు" (అపొ.కార్య.2:38). ఇదే కర్తవ్యాన్ని నిష్ఠగా నిర్వర్తించడం అపోస్తులుల వారసులందరి విధి. అప్పుడే ప్రభువు వాక్కు త్వరగా వ్యాపించి విజయము పొందగలుగుతుంది. దైవరాజ్యం ప్రపంచవ్యాప్తమవుతుంది, నూత్నీకరింపబడుతుంది.

మరి ఇటువంటి రక్షణ సాధనలో కుటుంబం యొక్క ప్రాముఖ్యత ఎంతో ఆవశ్యకమైనది. అలనాడు ఏ విధముగానైతే క్రీస్తు ప్రభువు తన శిష్యులను తనతో ఉండుటకు, సువార్తా ప్రకటనకు పంపుట కొరకు (మార్కు 3:14) నియమించెనో, ఈనాడు ప్రతి కుటుంబం కూడా సువార్త పరిమళాలను శ్రీసభలో, విశ్వాసుల గుండెల్లో వెదజల్లాలి. సువార్తా పరిచర్యలో సత్యోపదేశం అనేది ఎంతో ప్రాథమికమైనది, కీలకమైనది. మరి ముఖ్యముగా ఈ ప్రక్రియలో దేవుని వాక్కును గూర్చి తెలుసుకుంటూ, విశ్వాసములో స్థిరముగా బలబడి, ఎదగాలి. ప్రతి కుటుంబం విశ్వాసములో, దేవుని వాక్కులో ఎదగాలంటే దివ్యగ్రంథ పారాయణం ఎంతో అవసరం. ఈ సందర్భములో ద్వితీయ వాటికన్ మహాసభ అధికార పత్రము "దైవవాక్కు" అంశము 1 మనకు తేటతెల్లముగా తెలియజేస్తుంది. దేవుని వాక్కును అనునిత్యమూ మనం గౌరవ భావంతో ఆలకించాలి, విశ్వాసంతో ప్రకటించాలి. ఇదే భావాన్ని రెండవ వాటికన్ మహాసభ పునీత యోహాను గారి

మాటల్లో ఇలా వ్యక్తం చేస్తోంది: "సృష్టి ఆరంభం నుండి గల జీవవాక్కును గూర్చి మేము మీకు తెలుపుచున్నాము. మేము దానిని చెవులారా విని, కన్నులారా కాంచితిమి. కన్నులారా కాంచుటయే గాదు, మా చేతులు దానిని స్పృశించినవి. ఈ జీవము ప్రదర్శింపబడినపుడు మేము దానిని చూచితిమి. కనుకనే మేము దానిని గూర్చి మాట్లాడుచు, మనకు విధితము చేయబడినదియు, పితతో ఉండునదియు అగు నిత్యజీవమును గూర్చి మీకు విశదమొనర్చుచున్నాము. పిత తోడను, కుమారుడగు యేసుక్రీస్తు తోడను మాకు గల సహవాసములో మీరును మాతో చేరుటకై, మేము వినినవియు, కనినవియు అగు వానిని మీకును తెలియజేయుచున్నాము" (1 యోహాను 1:1–3).

శ్రీసభ క్రీస్తు ప్రభువు దివ్య దేహాన్ని ఎంతటి భక్తి విశ్వాసాలతో ఆరాధిస్తూ గౌరవిస్తుందో, అలాగే దేవుని దివ్యవాక్కును కూడా గౌరవిస్తుంది, ఆరాధిస్తుంది. కనుకనే, దైవార్చనా సాంగ్యాలలో ప్రభు దివ్యశరీర రక్తాలను, దైవవాక్కును కూడా ఒకే పీఠం నుంచి అందజేస్తుంది. ఆది నుంచి ఇది శ్రీసభలో అనుచానంగా కొనసాగుతూ వస్తోంది. అలాగే విశ్వాస వికాసానికీ పరిరక్షణకు అపోస్తోలిక సంప్రదాయాన్ని ఏ విధంగా ప్రామాణికంగా భావిస్తుందో, అదే విధంగా పవిత్ర గ్రంథాన్ని విశ్వాసానికి సర్వోన్నత ప్రమాణంగా స్వీకరిస్తుంది. పవిత్ర గ్రంథములోని రచనలన్నీ దేవుని ప్రేరణతో వ్రాయబడినవి. యుగయుగాల వరకు శాశ్వతముగా నిలిచి ఉండేవి. కనుక వాటిల్లో దేవుని పవిత్ర వాక్కు సుస్థిర రూపంలో మనకు సాక్షాత్కరిస్తుంది. పవిత్ర గ్రంథంలోని ప్రవక్తలు, అపోస్తలులు పలికిన మాటల్లో సాక్షాత్తు పవిత్రాత్మ స్వరమే పదే పదే మనకు వినిపిస్తూ ఉంటుంది. మన అంతరంగాలలో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. ఈ కారణంగానే శ్రీసభ ప్రబోధాలన్నీ పవిత్ర గ్రంథం మీదనే ఆధారపడి ఉంటాయి. నిజానికి క్రైస్తవ మత విశ్వాసానికంతటికీ పునాది పవిత్ర గ్రంథమే అవుతుంది. మరో మాటలో చెప్పాలంటే పవిత్ర గ్రంథంలోని దైవోపదేశాలే యావత్ క్రైస్తవ్యానికి దిశానిర్దేశం, భావసార్థకత చేస్తుంటాయి.

క్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారా, విశ్వాసులకు అందించే పవిత్రాత్మ కృపావరమే సువార్తా చట్టం. అది ప్రేమ ద్వారా పనిచేస్తుంది. ఏది చేయాలో

బోధన చేయటానికి కొండమీద ప్రసంగాన్ని వాడుకుంటుంది. పనిని చేయడానికి కావలసిన కృపావరాన్ని మనకు అందివ్వటానికి సంస్కారాలను వాడుకుంటుంది. మత్తయి సువార్తలో మనం చదివే ప్రభువు కొండమీద చెప్పిన ప్రసంగాన్ని ఎవరైనా భక్తిపూర్వకంగా తీక్షణదృష్టితో ధ్యానిస్తే, క్రైస్తవ జీవన పరిపూర్ణ మార్గాన్ని అతడు తప్పకుండా కనుగొంటాడు. ఒకరి జీవితాన్ని రూపొందించుకోవటానికి అవసరమయ్యే ధర్మసూక్తులు ఈ ప్రసంగంలో ఉన్నాయి. అదే విధంగా అపొస్తులుల ప్రబోధంలోని నైతిక ఉపదేశాన్ని ప్రభుని కొండమీద ప్రసంగానికి చేర్చడం ఉత్తమం. అవి రోమీ 12:15, 1 కొరింతీ 12:13, కొలొస్సీ 3:4, ఎఫెసీ 4:5 మొదలైనవి. అపోస్తులుల అధికారంతో ఈ మత సిద్ధాంతం ప్రభుని బోధనలను అందిస్తుంది. క్రీస్తునందు గల విశ్వాసం నుండి వెలువడే సుగుణాలను అందించటంలో ప్రత్యేక శ్రద్ధ ఉంది. ప్రేమ, పవిత్రాత్మ ప్రధాన వరాలు ఈ సుగుణాలను ఉజ్జీవింపచేస్తాయి. "ప్రేమ నిష్కపటంగా ఉండాలి. సోదర భావంతో ఒకరినొకరు ప్రేమించుకోండి. మీ నిరీక్షణలో ఆనందించండి. కష్టంలో ఓర్పు వహించు, సర్వత్రా ప్రార్థించు అవసరాల్లో ఉన్న భక్తులకు దానం చేయి, అతిథి సత్కార్యాన్ని ఆచరించు" (రోమీ 12:9-13). మనకు క్రీస్తుతో, శ్రీసభతో ఉన్న సంబంధం వెలుగులో అంతరాత్మ నిర్ణయించాల్సిన విషయాల పట్ల ఎలా వ్యవహరించాలో కూడా ఈ ఉపదేశం బోధిస్తుంది.

పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారి అపోస్తోలిక ప్రబోధం 'ప్రేమానందం' ఏడవ అధ్యాయం బిడ్డలకు విద్యాబుద్ధులు నేర్పుటను గూర్చి తెలుపుతుంది. నైతిక శిక్షణ, నేర్చుకోవలసిన క్రమశిక్షణ, తప్పు చేసిన బిడ్డలను దండించుట, సహనంలో గల గొప్పతనం, లైంగిక విద్య, తల్లిదండ్రులు బిడ్డలను విశ్వాసములో నడిపించుట తెల్పుతూ గృహమే ఒక విద్యాలయంగా పేర్కొనబడింది. అవగాహన చేసుకొని, అంగీకరిస్తూ, అభినందించే విధముగా క్రమేణ ఒక దాని వెంబడి ఒక విషయాన్ని గూర్చి చెప్పడంలో ఎంతో శ్రద్ధ చూపిస్తూ తెల్పుతుంది. ఫ్రాన్సిస్ పాపుగారు ఎంతో శ్రద్ధతో, ఎంతో బోధనా చాతుర్యంతో మనసంతా నిండిన అతి స్వీయ భావవైఖరి నిజమైన విద్యకాదన్నారు. ఒక పిల్లవాడి అనుభవంలో జరిగిన ఒక సంఘటన మన ఆధీనంలో ఉండదు. కనుక తల్లిదండ్రులు అతిగా పిల్లల అన్ని

విషయాలను తెలుసుకోవాలనుకోవడం, వారి ప్రతి కదలికను అదుపులో ఉంచడానికి ప్రయత్నించడం ద్వారా వారు పిల్లలపై పెత్తనం చెలాయించి నట్లవుతుంది. ఈ విధానంలో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పటం, వారిని బలపరచటం, భవిష్యత్తు సవాళ్ళను ఎదుర్కొనే వారిగా చేయటం తల్లిదండ్రులకు సాధ్యపడదు. ప్రేమపూర్వకంగా పిల్లలకు సాయమందించటం, వారిని స్వతంత్రముగా, పరిపక్వతలో ఎదిగేటట్లు చేయటం ముఖ్యం. ఈ విధముగా సంపూర్ణమైన, సమగ్రమైన, నిజమైన నిర్ణయాధికారాన్ని, స్వతంత్రాన్ని పిల్లలకు ఇవ్వడం ముఖ్యం.

పిల్లలు తెలిసీ తెలియక తప్పులను చేస్తారు. తల్లిదండ్రులుగా, ఉపాధ్యాయులుగా, పెద్దలుగా మనం ఆ తప్పులను గుర్తెరిగి వారిని తగిన రీతిలో, వారి మనస్సు నొప్పించకుండ వారు చేసిన తప్పు ఏమిటో వారికి తెలియజేయాలి. పిల్లలు ఇతరులకు ఇబ్బందిగాని, హానిగాని కలిగించినట్లయితే వెంటనే వారి నుండి క్షమాపణ కోరటం మంచిదిగా వారికి తెలియజేయాలి. ఈ సందర్భములో, ద్వితీయోపదేశకాండము తల్లిదండ్రులు వారి యొక్క బిడ్డలను దైవవాక్కుతో నింపబడేటట్లు ప్రోత్సాహిస్తూ, బలపరచమని ఈ పరిశుద్ధ వచనం ద్వారా తెలుపుతుంది. "వీనిని మీ పిల్లలకు బోధింపుడు. మీరు ఇంటనున్నను, బయటనున్నను, విశ్రాంతి తీసికొనుచున్నను, లేచినప్పుడును వీనిని గూర్చి ముచ్చటింపుడు" (ద్వితీయో 6:7). అదే విధముగా, సామెతలు గ్రంథము 29:15 వచనము ఈ విధముగా తెలియజేస్తుంది. "దండనమును, మందలింపును బాలునికి బుద్ధిగరపును. విచ్చలవిడిగా తిరుగు కుర్రాడు తల్లికి అపకీర్తి తెచ్చును", కనుకనే, కుటుంబ జీవిత సత్యోపదేశంలో తల్లిదండ్రులు తమ బిడ్డలను ఒక సక్రమమైన మార్గములో పయనింప చేయుటకు దోహదపడుతూ, వారి శ్రేయస్సును కోరాలి.

పరిశుద్ధ గ్రంథాన్ని క్రైస్తవ విశ్వాసులందరికీ అందుబాటులోకి తేవాలి. అయితే అన్ని కాలాలలో అన్ని తరాల వారికి దోషరహితమైన సమగ్రమైన పవిత్ర గ్రంథాన్ని అందజేయడం తల్లిగా శ్రీసభ బాధ్యత. కనుక, వివిధ ప్రాంతీయ భాషలలోనికి బైబులు గ్రంథాన్ని అనువాదం చేసేటప్పుడు మూలభాషల్లో ఉన్న

పవిత్ర గ్రంథ ప్రతులు ఆధారముగా అనువాదాలు చేయవలసిందిగా కోరుతోంది. అదే విధముగా తగిన అవకాశం లభిస్తే, స్థానిక శ్రీసభల అధిష్ఠానం వారు అంగీకరిస్తే ఆయా ప్రాంతాలలో ఆయా భాషలకు చెందిన కతోలికేతర క్రైస్తవ సంఘాలతో కలిసి పవిత్రగ్రంథ అనువాదానికి సమిష్టిగా కృషి చేయవచ్చును. అప్పుడు ఆయా అనువాదాలను ఆయా ప్రాంతాల క్రైస్తవ సంఘాలన్నీ ఉపయోగించుకునే వీలు కలుగుతుంది. అలాగే, విశ్వాసులందరు "యేసుక్రీస్తును గూర్చిన అధికమైన విలువ గల జ్ఞానమునకై" (ఫిలిప్పీ 3:8) తరచుగా పవిత్ర గ్రంథాన్ని భక్తి శ్రద్ధలతో చదువుతూ ఉండాలి. దేవుని వాక్కును ఎరుగనివారు, క్రీస్తును ఎరుగని వారితో సమానం. కనుక, దేవుని వాక్కులోని లోతైన భావాన్ని దైవార్చన ద్వారాగానీ, వాక్యపఠన ధ్యానాల ద్వారా గానీ, అలాగే స్థానిక శ్రీసభ కాపరుల అనుమతి పొందిన బైబులు సదస్సులు, రోజు రోజుకు ప్రాచుర్యం పొందుతున్న ప్రార్థనా కూటాలు మొదలైన వాని ద్వారా గానీ విశ్వాసులు ఆస్వాదించి, భగవదనుభవాన్ని పొందాలని ద్వితీయ వాటికన్ మహా సభలోని 'దైవవాక్కు' అధికార పత్రము సుస్పష్టముగా తెలియజేస్తుంది.

ఇంతకు ముందు చెప్పుకున్నట్టు మానవులందరికీ రక్షణ భాగ్యాన్ని ప్రసాదించడం శ్రీసభ ధర్మం. ప్రభు క్రీస్తు కృపకు పాత్రులు కావడం ద్వారా, ఆయన పట్ల అచంచల విశ్వాసాన్ని ప్రకటించడం ద్వారా మానవులు రక్షణ పొందగలుగుతారు. కనుక లోకములోని సకల మానవులకు మాటల ద్వారా, చేతల ద్వారా ప్రభు క్రీస్తు సువార్తను ప్రబోధించడం, ఆయన కృపావరాలను వారిపై వర్షింపజేయడం శ్రీసభ ధర్మమవుతుంది, శ్రీసభలో సభ్యులందరి అపోస్తోలిక ధర్మ ప్రధాన లక్ష్యమవుతుంది. ఈ లక్ష్యసాధనకుగాను, శ్రీసభ సమకూర్చే ఆధ్యాత్మిక సాధనాలు – వేద ప్రబోధా పరిచర్య, దివ్యసంస్కారాల ఆచరణం. ఈ అపోస్తోలిక ధర్మాలు ప్రధానంగా గురువులకు చెందినవైనప్పటికీ, ఈ ధర్మనిర్వహణంలో గృహస్థ క్రైస్తవులకు కూడా అత్యంత కీలకమైన భాగస్వామ్యం ఉంటుంది. అంతే కాదు సాటి మానవులకు సువార్తా ప్రబోధం చేయడానికి, వారిని పవిత్రీకరణ మార్గంలో నడిపించడానికి గృహస్థ క్రైస్తవులకు అనేక అవకాశాలుంటాయి. ప్రభు క్రీస్తుకు సాక్షులుగా వారు గడిపే ఆదర్శ జీవనం, పారలౌకిక విలువలతో వారు

చేసే పనిపాటులు వృత్తి ధర్మాలు - ఇవన్నీ సాటివారి హృదయావరణాలలో సువార్తా బీజాలను వెదజల్లుతాయి, వారిని దైవసాన్నిధ్యానికి నడిపిస్తాయి. యేసుప్రభువిచ్చిన ఆదేశం కూడా ఇదే: "ప్రజలు మీ సత్కార్యములను చూచి పరలోకమందున్న మీ తండ్రిని సన్నుతించుటకు మీ వెలుగును వారి యెదుట ప్రకాశింపనిండు" (మత్తయి 5:16). ఇక్కడే గృహస్థ క్రైస్తవులు ఒక సత్యాన్ని గుర్తుంచుకోవాలి. అదేమిటంటే కేవలం ప్రభు సాక్షులుగా జీవించడం ద్వారానే వారి అపోస్తొలిక ధర్మం పరిపూర్ణం కాదు. ప్రత్యక్ష సువార్తా ప్రబోధానికి గల ప్రతి అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలి. అంటే, అన్యజనులకు సువార్తా ప్రబోధం చేస్తూ వారిని ప్రభు క్రీస్తు విశ్వాసులుగా తీర్చిదిద్దడానికి, సాటి క్రైస్తవ విశ్వాసులకు పున:సువార్తా ప్రబోధం చేస్తూ వారి విశ్వాసాన్ని పటిష్టపరచి వారిలో నవచైతన్యాన్ని వికసింపజేయడానికి గల సదవకాశాలన్నింటినీ గృహస్థ క్రైస్తవులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభు క్రీస్తు ప్రేమ ప్రభావంతో వారు సువార్తా ప్రబోధానికి పూనుకోవాలి (2 కొరింతీ 5:14). "సువార్తను బోధింపకున్నచో నా పరిస్థితి ఎంతో దారుణమగును" (1 కొరింతీ 9:16). అంటూ పునీత పౌలుగారు పలికిన మాటలు గృహస్థ క్రైస్తవుల హృదయాలలో నిత్యము ప్రతిధ్వనిస్తూ ఉండాలి.

మరి పైవన్నీ జరగాలంటే ప్రతి కుటుంబం శ్రీసభకు వెన్నెముక అయి ఉండాలి. శ్రీసభ కూడా కుటుంబ సత్యోపదేశము గూర్చి తెలియజేస్తూ, విశ్వాసులను అనునిత్యము ఒక సక్రమమైన మార్గములో నడిపించుటకు దోహదపడాలి. అందుకే, కుటుంబం సంపూర్ణ మానవ వికాసానికి దోహదం చేసే పాఠశాల వంటిది. ఈ కుటుంబ పాఠశాల సక్రమంగా పనిచేయాలన్నా సత్ఫలితాలను సాధించాలన్నా అందుకు భార్యాభర్తల సంపూర్ణ సహకారం అవసరం. ముందుగా దంపతుల మధ్య సఖ్యత స్నేహబంధాలు వర్ధిల్లుతూ ఉండాలి. కుటుంబ నిర్వహణంలోను, పిల్లల పెంపకంలోను పరస్పరం వారు తమ ఆలోచనలను అభిప్రాయాలను స్పష్టముగా వ్యక్తం చేసుకోవాలి, కలిసి చర్చించాలి. ఉమ్మడిగా తీసుకున్న నిర్ణయాలను ఆచరణలో పెట్టడానికి ఒకరికి ఒకరు సహకరించుకోవాలి.

చివరిగా, మన తెలుగు కతోలిక పీఠాధిపతుల సమాఖ్య ఈ 'ప్రేమానందం' ద్వారా ప్రతి కుటుంబం నిరంతరము విశ్వాసములో ఎదుగుతూ, కుటుంబ సత్యోపదేశంలో బైబిలు యొక్క భావసార్ధకతను తెలియజేస్తూ, వివాహం – కుటుంబం వాటి ఘనత, పవిత్రత, పటిష్టత గురించి, వాటి సమగ్రతకు గొడ్డలి పెట్టుగా ఉన్న ఆధునిక సవాళ్లు, అవరోధాల గురించి, వాటిని అధిగమించే పద్ధతులను సూచిస్తూ, శ్రీసభ బాధ్యతను గుర్తు చేశారు. కుటుంబాలు ఎంత మాత్రం సమస్యగా కాక, ప్రప్రథమంగా వాటిని అవకాశముగా పరిగణింపబడాలి. కుటుంబాలు సువార్తా విలువల ప్రకారం, ప్రేమ విషయంలో క్రైస్తవ బోధనల ప్రకారం నడవాలి. అదే విధముగా ప్రతి విశ్వాసికి, విశ్వాసురాలికి కంఠరవేణ కాకుండా లేదా బలవంతంగా ఆత్మపరిశీలన చేసుకొనే సమయం వచ్చిద్ధి: నీవు ప్రకటించే దానిని నిజముగా విశ్వసిస్తున్నావా? నీవు విశ్వసించే దానిని గూర్చి జీవిస్తున్నావా? నీవు జీవిస్తున్న దానిని గూర్చి నిజముగా బోధించుచున్నావా? కనుకనే, పరిశుద్ధ గ్రంథం పునీత యోహాను గారు వ్రాసిన దర్శన గ్రంథము 2:7 వచనములో సెలవిస్తుంది. "మీకు చెవులు ఉన్నచో దైవ సంఘములకు ఆత్మ ఏమి బోధించుచున్నదో శ్రద్ధగా ఆలకింపుడు! గెలుపొందిన వారికి దేవుని ఉద్యానవనమున పెరుగు జీవవృక్షపు ఫలమును ఆస్వాదించు భాగ్యమును అనుగ్రహింతును".

❊ ❊ ❊ ❊

# 6. గృహస్య శ్రీసభగా కుటుంబం

**- ఫాదర్ సెల్వకుమార్ అలోషియస్**

**- అనువాదం: బ్రదర్ మానూరి మార్కో**



"కుటుంబం అనుభవించు ప్రేమానందమే శ్రీసభ ఆనందము" అని మంచి వాక్యముతో పరిశుద్ధ జగద్గురువులు తన అపోస్తోలిక అధికార పత్రంను (Exhortation) అనబడు అమోరిస్ లెతీషియా ను మొదలుపెట్టడం జరిగింది. ఓ వైపు పాపుగారి ఈ అధికారిక పత్రం నేటి శ్రీసభలో కుటుంబాల స్థానం గూర్చి కుండబద్దలు కొట్టినట్లు వివరిస్తూ మరోవైపు సాధారణ కతోలిక దంపతులు మరియు తల్లిదండ్రులు అనునిత్యము సత్యానికి, సువార్తానందానికి ముగ్దులై అంటిపెట్టుకొని జీవించడానికి వారు చేసే ప్రయత్నాల నుండి స్ఫూర్తిదాయకమైన ఆదర్శాన్ని తిరుసభ గుర్తించి తీసుకుంటుందని ఈ పత్రం వివరిస్తుంది.

కావున "వివాహ జీవితంలోకి అడుగుపెట్టి కుటుంబ జీవితాన్ని నిర్మించుకోవాలి అనే ఆశ ఝుళిపించతగ్గది (కదల్చి వేస్తుంది). ఇది ముఖ్యంగా యువకులలో చాలా అమితంగా ఉంటుంది. ఇది తిరుసభకు స్ఫూర్తిదాయక విషయం" కావాలని పాపుగారు నొక్కి వక్కాణించి చెబుతున్నారు (పీఠాధిపతుల మూడవ సమాఖ్య రిలేషియో పినోది, 18 అక్టోబరు 14, పేజి.2)

అందుచేతనే కుటుంబ జీవితం నేటి సమాజంలో ఓ సవాలుగా మారినప్పటికి, కుటుంబ జీవితం పట్ల ఆశ కొనసాగుతూనే ఉంది. ఎందుకనగా, కుటుంబ సభ్యులుగా జీవించ పిలుపునందుకొని దేవుని చిత్తాన్ని నెరవేర్చడం

వలన పొందే సంతోషం వలన క్రైస్తవులు కుటుంబ జీవితం యందు ఆశతో సాగుతున్నారు.

మనం తెలుసుకోబోయే అంశం ఏమనగా – గృహస్థ శ్రీసభగా కుటుంబం; సువార్తా ప్రబోధమే ప్రథమ వనరుగా కుటుంబం కనక, కుటుంబంలోని ప్రేమానందమే శ్రీసభ యొక్క సంతోషము. ఏ వ్యక్తి ఏకాకి కాదు. కుటుంబం ఏవిధంగా ఉంటుందో అదే విధంగా శ్రీసభ ఉంటుంది. ఒకవేళ కుటుంబం పెనుగులాడుతుంటే, శ్రీసభ కూడా పెనుగులాడుతున్నట్లే. కుటుంబంనందు సంతోషం, ఆశ నెలకొని ఉండే శ్రీసభనందు కూడా నెలకొనియున్నట్లే. మనం ఈ అంశాన్ని (కుటుంబం నుండి శ్రీసభ మరియు శ్రీసభ నుండి కుటుంబం) నాలుగు కోణాల్లో చూద్దాం. మన ప్రభువైన యేసుక్రీస్తునందు మన ఆశ ఏ విధంగా నెరవేరునో చూద్దాం.

## కుటుంబం – గృహస్థ శ్రీసభ

శ్రీసభ నాలుగు అంతస్తుల గూర్చి మనం చర్చించుకుందాం. రోము పీఠాధిపతులైన పాపుగారు మరియు ఆయనతో ఐక్యమై ఉన్న పీఠాధిపతుల సమాఖ్య సహకారంతో నడిపించబడేదే విశ్వశ్రీసభ. సమయ, సంస్కృతులకు తగ్గట్టుగా మన విశ్వాసాన్ని ఉన్నతంగా వెల్లడి చేయడానికి సహకరించే శ్రీసభ మేత్రాసన శ్రీసభ ఇది. మేత్రాసన కాపరియైన పీఠాధిపతుల సహకారంతో నడుపబడుతుంది. చాలా వరకు మన అన్ని ఆధ్యాత్మిక బోధనలు, దివ్య సంస్కారాలు స్వీకరించేదే విచారణ శ్రీసభ నుండియే. చివరగా గృహస్థ శ్రీసభ. ఈ శ్రీసభయే మనం పవిత్రులం కావటానికి ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఈ శ్రీసభయందే అందరూ సమూహంగా జీవిస్తూ, ఒకరికొకరు ప్రేమను పంచుకుంటూ జీవించడం అలవాటవుతుంది.

"లోకానికి వెలుగు శ్రీసభ" అనే అధికార పత్రమే మొట్టమొదటిసారిగా కుటుంబాన్ని ఓ శ్రీసభగా వర్ణించడం జరిగింది. క్రైస్తవ వివాహ బంధం నుండి ఓ కుటుంబం ఏర్పడుతుంది. ఈ కుటుంబంనందే సమాజ పౌరులు జన్మించటం జరుగుతుంది. ఈ కుటుంబంనందు పుట్టిన బిడ్డలే పవిత్రాత్మ దేవుని వరము

ద్వారా దేవుని బిడ్డలుగా మారతారు. ఈ విధంగా దేవుని ప్రజ దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. కావున కుటుంబం ఓ శ్రీసభ ("లోకానికి వెలుగు శ్రీసభ" "లూమెన్ జెన్షియుమ్") కుటుంబాలు సమాజ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. అదే విధంగా సామాన్య విశ్వాసులతో నిండిన తిరుసభ కొనసాగడానికి, బలపడడానికి కుటుంబాలే పునాది.

'గృహస్థ శ్రీసభ'గా పరిగణింపబడే కుటుంబంలో తల్లిదండ్రుల పాత్ర గురుతరమైనది. తమ సంతానానికి వారే తొలి ఆధ్యాత్మిక గురువులు; తమ భక్తి జీవనం ద్వారా తల్లిదండ్రులే తమ పిల్లలకు విశ్వాస సత్యాలను బోధించాలి. యుక్తవయస్కులైన పిల్లలు తమకు అనువైన దైవ సంకల్పానికి అనుగుణమైన జీవన మార్గాన్ని ఎంపిక చేసుకోడానికి తల్లిదండ్రులు తోడ్పడాలి. మరీ ముఖ్యంగా పిల్లలు దైవసేవకు అంకితమవుతామనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినపుడు వారిక పెంపకం పట్ల సత్యైకమైన శ్రద్ధాసక్తులను చూపాలి అని "లోకానికి నేనే వెలుగు" అనే విశ్వలేఖ (లూమెన్ జెన్షియుమ్ 11) వివరిస్తుంది. ఈ అధికార విశ్వ లేఖ ద్వారా ద్వితీయ వాటికన్ పవిత్ర సభ గురువులు "క్రీస్తు లోకానికి వెలుగు" కావున తిరుసభ ఉన్న మనమందరము ఆ వెలుగును మన పొరుగువారికి అందించాలి అని నొక్కి వక్కాణించి చెబుతున్నారు.

ఈ ప్రకృతినందు దేవుని వరము సదా కురిపించబడునని తిరుసభ గుర్తించును. దేవుడు మనకు ఇచ్చిన అత్యవసరమైన, ముఖ్యమైన వరము కుటుంబం. స్త్రీ పురుషులు వారి వివాహ బాంధవ్యము వలన, విశ్వాసం నందు చురుకుగా పాల్గొనడం ద్వారా, పిల్లలను దేవుడు మరియు శ్రీసభ పట్ల ప్రేమ కలిగి జీవించేలా పెంచుతాము అని చేసే ప్రమాణముల ద్వారా యువకులు వారి జీవితాలలో విశ్వాసపు కాంతి రేఖను అనుభవించడానికి గృహస్థ శ్రీసభ ఓ ముఖ్యమైన మాధ్యమంగా నిలుస్తుంది. కుటుంబంలోనే సహనం, ప్రేమ, దాతృత్వం, క్షమాగుణం, దేవుని ఆరాధించడం, త్యాగపూరిత జీవితం అలవడును (సి.సి.సి. 1657).

పుట్టిన జీవి వలన వచ్చే సంతోషము, కుటుంబంలోని చిన్న వారి నుండి పెద్దవారి వరకు ఒకరికొకరు ప్రేమతో చూపించే శ్రద్ధ ఇవి అన్నీ కుటుంబ జీవితంలోని కొన్ని ఫలాలు. వీటి వలన కుటుంబ జీవితమనేది ఇటు తిరుసభలోను, అటు సమాజంలోను ప్రత్యేకమైనది, ప్రత్యమ్నాయం లేనివని తెలుస్తుంది (రిలేషియో ఫినాలిప్ 49–50, అమోరిస్ లతీషియా 88).

## కుటుంబంలో ప్రేమానందం

బలపడుతూ, అభివృద్ధి చెందుతూ, పెంపొందుతున్న వైవాహిక మరియు కుటుంబ ప్రేమను ప్రోత్సహిస్తూనే విశ్వాసకంగా, ఒకరినొకరు సంపూర్ణంగా అర్పించుకుంటూ జీవించే మార్గాన్ని ప్రోత్సహించడం కొరకై పరిశుద్ధ పాపుగారు 1 కొరింతీ 13:4–7 వచనాలపై వ్యాక్యానించి (అమోరిస్ లతీషియా 90–119) పౌలుగారి మాటలను ప్రస్తుత కాలంలో ఉన్న మనకు అన్వయించుకొనమని, కుటుంబంలోను, క్రీస్తు అడుగుజాడలలో నడిచే తిరుసభలోని మన సంబంధాన్ని పరీక్షించుకొని, సరిచేసుకొని ముందుకు సాగాలి.

## సహనం కలది ప్రేమ

ఈ వాక్యము అనాలోచనతో నడువక పాపాన్ని పరిత్యజిస్తూ జీవించే లక్షణం కలిగిన వ్యక్తిని సూచిస్తుంది (ఉదా: “సులభముగా కోపపడువాడు కాడు” నిర్గమ 34:6; సొలొ. 11:23; 12:2, 15–18). ఈ విధానం పశ్చాత్తాపానికి అవకాశమేర్పరుస్తుంది. సంబంధాలు, ప్రజలు లోపరాహిత్యంగా ఉండాలని కోరుకున్న ప్రతీసారి, లేదా మనల్ని మనమే కేంద్రబిందువుగా చేసుకున్నపుడు మరియు అన్ని మనం అనుకున్నట్లుగా జరగాలి అనుకున్నపుడు అధిక సమస్యలు ఎదుర్కొనవలసి వస్తుంది. కావున సహనం అనేది కరుణా సుగుణంలోని ఓ కోణము పొరుగువారు మనకు నచ్చిన విధంగా నడుచుకోకపోయిన వారిని అంగీకరించడానికి సహనం నడిపిస్తుంది (అమోరిస్ లతీషియా 91–92).

## పరుల సేవయందు ప్రేమ

ఇది మంచి పనులు చేస్తూ మంచితనాన్ని చూపించే మంచి వ్యక్తిని సూచిస్తుంది. కనుక సహనం ఉదాసీనమైన (చురుకుదనం లేని) ప్రవర్తన కాదు.

సహనం ఎప్పుడు క్రియాత్మకం మరియు శక్తివంతమైనది. సహనాన్ని అనేకమార్లు "దయ"గా తర్జుమా చేస్తుంటారు (అమోరిస్ లతీషియా 93-94).

## ప్రేమ స్వార్థపూరితమైనది కాదు

ఒకరి శ్రేయస్సు కొరకై మరొకరిని నష్టపెట్టడానికి తావివ్వనిదే ప్రేమ (అపొ 2:8; 17:5). అసూయ అనేది ఓ రకమైన దుష్టకార్యం. ఇది ఎదుటివారి సౌఖ్యాన్ని చూసి భయటపడుతుంది (అమోరిస్ లతీషియా 95-96).

## గొప్పలు చెప్పుకొనునది ప్రేమ కాదు

ప్రేమించేవారు కేవలం ఎక్కువగా మాట్లాడకుండా ఉండటమే కాకుండా ఎదుటివారిని గూర్చి కూడా ఆలోచిస్తారు. ప్రేమించేవారిని కేంద్ర బిందువుగా ఉండాలని, అందరి ఆకర్షణ పొందాలనుకోరు. అందరిముందు ఉబ్బిపోరు.

క్రైస్తవులు వారి కుటుంబాలలో విశ్వాసం పట్ల పూర్తి అవగాహనలేని వారి పట్ల సున్నితంగా ప్రవర్తించుకోవడమేకాక వారి నిర్ణయాల పట్ల బలహీనమై లేక ఖచ్చితత్వంలేని కుటుంబ సభ్యుల పట్ల ప్రేమను కనబరచడం చాలా ముఖ్యం. చాలాసార్లు దీనికి వ్యతిరేకంగా జరుగుతుంది. విశ్వాసం పరిణతి చెందుతున్న కుటుంబ సభ్యులే భరించలేని భారంగా మారుతుంటారు (అమోరిషియా లైతీషియా 97-98).

## అమర్యాదకానిది ప్రేమ

ప్రేమించడమంటే సాధుశీలునిగా మరియు ఆలోచన కలిగి జీవించడమే. ప్రేమ మోడైనది మరియు అమర్యాద కలిగినది కాదు. ప్రేమ పలుకులు, క్రియలు కర్కశంగా కాక సంతోషపూరితంగా ఉంటాయి. ఇతరులను బాధపెట్టడాన్ని ప్రేమ అసహ్యించుకొనును. ఇతరులపట్ల విశాల దృక్పథం కలిగి జీవించాలంటే "దయాపూరిత చూపు" చాలా ముఖ్యమైనది. మన బలహీనతలను అధిగమించి చూడడానికి, సహనం కలిగి ఉండడానికి, ఎన్ని విభేదాలు ఉన్నప్పటికి ఇతరులకు సహకరించడానికి ఈ దయాదృష్టి సహకరించును (అమోరిస్ లతీషియా 99-100).

## దాతృత్వం కలది ప్రేమ

దీని అర్థం ఏమనగా 'ప్రేమ తన సౌఖ్యం కొరకు తాను వెతుకదు లేదా తినడాని కొరకు తపించదు'. "మీలో ప్రతిఒక్కరు స్వార్థమునే చూచుకొనక, పరస్పరము ఉపకారులై ఉండుడు" (ఫిలిప్పీ 2:4; లూకా 6:35; యోహాను 15:13). "ప్రేమించబడాలి అనే కోరిక కంటే ప్రేమించాలి అనే కోరికయే గొప్ప దాతృత్వం" అనే పునీత అక్వినాస్ గారు వివరించడమైనది (అమోరిస్ లతీషియా 101-102).

## ఆగ్రహం, వ్యతిరేఖమైనది ప్రేమ కాదు

ఇది మన అంతరంగానికి సంబంధించినది, కనబడకుండా కదల్చి వేస్తుంది. ఇది దాగి ఉన్న ఆగ్రహాన్ని సూచిస్తుంది. దీని వలన ఎదుటివారిని మన సమస్యగానీ, భయపెట్టేవారుగానో పరిగణించుకొని వెలివేయ నిర్ణయించు కుంటాము. ఈ విధమైన అంతరంగిక వ్యతిరేకత దేనికి కూడా ఉపయోగపడదు (మత్తయి 7:5; రోమీ 18:21; గలతీ 6:9; ఎఫెసీ 4:26) (అమోరిస్ లతీషియా 103-104).

## క్షమించునది ప్రేమ

మన పొరుగువారి బలహీనతలను అర్థం చేసుకొని మన్నించగలిగే మంచి ప్రవర్తన యందు వేళ్లూనుకున్న సుగుణమే క్షమాగుణం (లూకా 23:34) "తండ్రీ వీరు చేయునదేమో వీరు ఎరుగరు వీరిని క్షమింపుము". మనం నిందించబడినప్పుడు లేదా త్రోసివేయబడినప్పుడు క్షమకు అవకాశముంది, మరియు ఆశించవచ్చు. కాని క్షమించడం సులభమైనది అని ఎవరూ చెప్పలేరు. దేవుని ప్రేమ పరిధులు లేనిదని, తండ్రి ప్రేమను కానలేము మరియు అమ్మలేమని అంగీకరించినపుడు మాత్రమే మన పొరుగువారిని ప్రేమించగలము. వారు మనకు చెడు తలపెట్టినప్పటికి క్షమించగలము. అట్లా కాని యెడల కుటుంబ జీవితం అర్థం చేసుకోవడం, ఆధారపడడం మరియు ప్రోత్సహించుకునే స్థలంగా కాకుండా బిగువ మరియు నిందించుకునే స్థలంగా మారిపోతుంది (అమోరిస్ లతీషియా (105-108).

## ఇతరులతో కలిసి ఆనందించునది ప్రేమ

దీని అర్థం ఏమనగా ఇతరుల మంచితనము, వారి చైతన్యము, సామర్థ్యాలను, వారి పరువు, మంచి పనులను చూసి సంతోషించడం. ఎప్పుడూ పోల్చిచూసుకుంటూ, పోటీపడే వ్యక్తులకు ఈ విధమైన సంతోషం పొందడం కష్టం. చివరకు వారి జీవిత భాగస్వామితో సహా ఎందుకనగా వారు నావి ప్రత్యర్థుల విఫలాలను చూసి ఆనందిస్తారు కాబట్టి (అమోరిస్ లతీషియా సంఖ్య 109–110).

## అన్నింటిని ఓర్చుకొనునది ప్రేమ

ఇది సాతానుకు లోబడి జీవించకుండా ఉండడం కంటే మిన్నయైనది. ఇది మనం వినియోగించే నాలుకతో ముడిపడియున్నది. ఎదుటి వ్యక్తి ఏ విధమైన చెడు తలపెట్టినప్పటి అతన 'సమాధానాన్ని' పాడుచేయకుండా ఉండడమేనని ఈ క్రియ పదం (ఓర్పు) యొక్క అర్థం (తీర్పు చేయకు, తీర్పుకు గురికాకుందువు (యాకోబు 4:11; 3:6,5–9) (అమోరిస్ లతీషియా 111–113).

## అన్నింటిని విశ్వసించునది ప్రేమ

దీనిని 'నమ్మకం' అనే తాత్పర్యంతో అర్థం చేసుకోవాలి. నమ్మకం సంబంధాలు స్వేచ్ఛలు ఉండడానికి తోడ్పడుతుంది. ఈ స్వేచ్ఛ వ్యక్తులను నిష్కపటులను పారదర్శకత కలిగిన వారిగా చేస్తుంది. ఎందుకన మేము నమ్మబడ్డాము, మేము ప్రోత్సహించబడుతున్నాం అని తెలిసినవారు మరింత విశాల దృక్పథంతో కలిగి ఏమి దాయకుండా జీవించగలరు. (అమోరిస్ లతీషియా 114–115).

## అన్నింటికై నిరీక్షించునది ప్రేమ

దీని అర్థం ఏమనగ భవిష్యత్తును గూర్చి ప్రేమ నిరాశ చెందదు. అంత్యకాలపు ఆశ గూర్చి మాట్లాడం లేదు. ఇతరులు మార్పు చెందగలరు, అభివృద్ధి పథంలో పయనించగలరు, అనుకోని అందాన్ని మరియు తెలియని శక్తులకు సంబంధించిన ఆశ అనే విషయాల గూర్చి పౌలుగారు మాట్లాడుతున్నారు (అమోరిస్ లతీషియా 116–117).

## అన్నింటిని భరించునది (తాలిమి) ప్రేమ

సత్ప్రవర్తన కలిగి అన్నింటిని భరించునది ప్రేమ. ఏ విధమైన సవాలును ఎదుర్కొనడానికి ఎపుడూ సిద్ధపడి ఉండడమే ప్రేమ. ఈ విధమైన ప్రేమ సమస్యను చూసి భయపడి పారిపోకుండా, కఠిన సమయంలో కూడా నిలకడ కలిగి ప్రతి మనిషి మోమునందు "దేవుని రూపాన్ని"చూడగలరు (అమోరిస్ లతీషియా 118).

ప్రేమ ఎల్లపుడు వ్యతిరేకతకు, ఇతరులను అలక్ష్యపెట్టుటకు, ఇతరులను బాధపెట్టాలనే ఆశకు గాని లేదా ఇతరుల నుండి కొంత ఫలితాన్ని పొందాలనే ధోరణిలో పోదు. క్రైస్తవులలో ముఖ్యంగా కుటుంబాల నందు మనం పొందగలిగే ఆదర్శం ప్రేమ. ఈ ప్రేమ ఏనాడు వెనుకంజు వేయదు (అమోరిస్ లతీషియా 119).

## కుటుంబంలాంటి తిరుసభ సంతోషం

"కుటుంబ శ్రీసభలోని విశ్వాసుల వలన ఎల్లపుడు అతిశయం పొందే, అభివృద్ధి చెందే కుటుంబాల కుటుంబమే శ్రీసభ". వివాహం అనే దివ్య సంస్కారం వలన ప్రతి కుటుంబం కూడా తిరుసభకు మంచిని చేకూరుస్తుంది. తిరుసభ కుటుంబానికి మంచిది, దోహదపడుతుంది. అదే విధంగా కుటుంబము తిరుసభకు మంచిది. వివాహ దివ్య సంస్కారంలో పొందిన దైవ వరాన్ని భద్రంగా కాపాడడం అనేది కేవలం ఆ కుటుంబీకుల బాధ్యత మాత్రమే కాక క్రైస్తవ కుటుంబాలలో అందరు ఈ బాధ్యతను కలిగి ఉన్నారు. కుటుంబాలలో అనుభవించగలిగే ప్రేమయే తిరుసభ మనుగడకు ఎడతెగని మూలాధారము (అమోరిస్ లతీషియా 87-88).

కుటుంబాలు వివాహ దివ్య సంస్కారం వలన కుటుంబ ప్రేషిత సేవల ప్రముఖ ప్రేషిత వ్యక్తులుగా మరిముఖ్యంగా కుటుంబాల సంతోషానికి సాక్షులుగా ఉండాలి. విత్తువాని ఉపమానంలో (మత్తయి 13:3-9) పేర్కొనబడినట్లుగా విత్తువానికి సహకరించడానికి మనము పిలువబడ్డాము. మిగిలినదంతా దేవుని పని (అమోరిస్ లతీషియా 200).

కుటుంబాలు పొందే ఆధ్యాత్మిక శ్రద్ధ అంతయు విచారణ నుండి అందుతుంది. విచారణ కూడా కుటుంబాల కుటుంబమే. ఈ కుటుంబం నందు చిన్న చిన్న తీగలు, శ్రీసభ కదలికలు, సంస్థలు అన్ని అన్యూన్యంగా సాగిపోతాయి. కావున కుటుంబాల పట్ల తప్పనిసరియైన శ్రద్ధ తీసుకోవాలి. కుటుంబాలకు అందించే ప్రత్యేక తీర్థముతో పాటుగా తప్పనిసరియైన ఆధ్యాత్మిక శ్రద్ధ తీసుకోవాలి (అమోరిస్ లతీషియా 201-202). కావున శ్రీసభ కుటుంబాల అభివృద్ధి కొరకై చాలా సమయాన్ని, శక్తియుక్తులను వెచ్చించి కుటుంబంలోని ఏ ఒక్కరూ వెలివేయబడుట లేక మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు అనే ఆలోచన రాకుండా ప్రయత్నిస్తుంది.

కుటుంబంలో ఎదురయ్యే లోటుపాటులు, సమస్యలు, ప్రయాసలు విషయముల యందు తిరుసభ పరిజ్ఞానం కలిగిన ప్రవర్తనతోనే ఉంటుంది. ప్రతి కుటుంబానికి కూడా ఖచ్చితంగా అన్ని రకాల సమస్యలు చేస్తుంటాయి. అయినప్పటికి ఇవన్నీ అందమైన కుటుంబ జీవితంలో భాగమే. ఏదైన విపరీతమైన సమస్య ఎదురైనప్పుడు సంబంధాలు బలహీనపడకుండా ఉండుటకు దంపతులకు సాయం అందించాలి. అంతేకాక ఆ సమస్యలు మరింతగా వారి బాంధవ్యాన్ని, ఐక్యతను అభివృద్ధి, పరిపక్వ విధానానికి చేర్చునని తెలుసుకొనేలా సహాయపడాలి. వారికి ఎదురయ్యే ప్రతి సమస్య వారు మరింత దగ్గర కావడానికి వచ్చిన సదవకాశమనుకొని వివాహం చేసుకోవడంలోని అంతరార్థాన్ని మరింతగా నేర్చుకోవాలి (అమోరిస్ లతీషియా 232).

పిలువబడ్డ పిలుపునందు విశ్వాసపరంగా ఉండడానికి సహనం మరియు ఆపేక్ష (తలంపు) చాలా ముఖ్యమైనది. ఆ పిలుపులోని సంతోషం మరియు త్యాగాలు వలన చేకూరే ఫలాలు చాలా సంవత్సరాల తరువాత కనిపిస్తుంటాయి. దంపతులు పిల్లల పిల్లలను చూసి చాలా ఆనందిస్తారు. వివాహ జీవితంలోకి అడుగుపెట్టినప్పటి నుండి ఉన్న ప్రేమ ప్రామాణికముగా, స్థిరత్వముగా, పరిపక్వంగా వృద్ధి చెందుతుంది. ఎప్పుడైతే వారు రోజు రోజుకి, సంవత్సర సంవత్సరానికి ఉత్సాహంగా ఒకరినొకరు నూత్నీకరించుకుంటారు. ఈ విధానం కలిగిన వీరు బాహ్యాపరంగా

ఏ విధమైన హానికరమైన, శక్తివంతమైన, ఉద్వేగాలకు లోను కాకుండా ఎల్లపుడు చివరకు ముదుసలి ప్రాయంలో చేరినప్పటికి కూడా హృదయాంతరంగంలో దాగి ఉన్న ప్రేమను చవి చూడగలరు. ఆ విధమైన పరిపక్వత చెందిన సత్సంబంధం చాలా అవసరం. అటువంటి సంబంధాన్ని చురుకుగా పోషించాలి (అమోరిస్ లతీషియా 231).

## సువార్త వ్యాప్తి యొక్క ముఖ్య కారకాలు

పిల్లలు నీతియందు, ఆధ్యాత్మికతయందు, సమాజంలో అభివృద్ధిపరంగాను సక్రమంగా ఉండాలన్నా లేదా చెడిపోవటానికైన తల్లిదండ్రుల ప్రభావం ఎల్లపుడు ఉంటుంది. కావున అమోరిస్ లతీషియా (కుటుంబంలో ప్రేమానందం) అనే అధికారిక పత్రం ఒక పాఠ్యాంశాన్ని పూర్తిగా పిల్లలను మంచిగా పెంచడం గురించి కేటాయించడం జరిగింది (అమోరిస్ లతీషియా 232).

కుటుంబాలు ప్రత్యక్షంగా సాయం చేయలేకపోయిన క్రమశిక్షణకు, కాపుదలకు, ఊరటకు ముఖ్యమైన కేంద్రం కుటుంబమే. ఈ ఆధునిక కాలంలో ఎన్ని నూతన పద్ధతులు, మూలాలు కనుగొన్నప్పటికి అవి కుటుంబాన్ని భర్తీ చేయలేవు. మెళుకువ కలిగి ఉండడం చాలా అవసరం అదేవిధంగా నిర్లక్ష్యత ఎపుడూ లాభదాయకమైనది కాదు. పిల్లలు మరియు యువకులు వారి జీవితాలలో ఎదురయ్యే అనేక సమస్యలు ఎదుర్కొనడానికి సిద్ధపడే విధంగా తల్లిదండ్రులు సాయం అందించాలి అర్థరహిత జ్ఞానాన్ని నింపడం చదువు కాదు, సరైన పెంపకం కాదు. స్వేచ్ఛ పరిపక్వత, క్రమశిక్షణ కలిగి పెరిగే విధంగా ప్రేమతో తల్లిదండ్రులు సహాయపడాలి. వారి నిర్ణయాలు, గట్టి నమ్మకం, కోరిక, కలలను అడిగి తెలుసుకొని నిజంగా వారు, వారి మనస్సు ఎటు పయనిస్తుందో చూడాలి. వారి మనస్సు ఎక్కడ ఉందో నిజంగా మనకు తెలుసా?

❊ ❊ ❊ ❊

# 7. కుటుంబం ఒక అపురూప నిలయం

**- ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**



దేవుడు ఈ లోకానికి వచ్చినపుడు ఎదిగిన మనిషిగ రాలేదు. కాని ఓ తల్లి గర్భంలో మనుష్యవతారం ఎత్తాడు. పుట్టుకనుండి గిట్టినవరకు కుటుంబ జీవిత అనుభవాలను రంగరించుకున్నాడు. ఇదంతా ఆయన తల్లి కళ్లముందు జరిగిన విషయాలే! యేసు మానవ జీవితాన్ని పరిశుద్ధ పరచడమేగాక, కుటుంబ జీవితాన్ని కూడ పవిత్రపరచి, దానిని ఆశీర్వదించాడు. ఆదికాండంలో మానవుడు ఒంటరిగ ఉండుట మంచిది కాదని తెలుసుకుంటాం. సహజంగ మానవుడు సంఘజీవి. లౌక్యంగ ఆలోచిస్తే, మానవులు తమకు సహచరులు ఎక్కడ ఉంటారన్నది తెలుసుకోడానికే దేవుడు కుటుంబాన్ని ఏర్పరిచాడు. హెబ్రీయ పత్రికలో గ్రంథకర్త, వసుదైక కుటుంబమైన శ్రీసభలోనికి మనలను సహోదరి సహోదరులుగా యేసు ఆహ్వానిస్తున్నాడని చెబుతాడు (2: 9-11). యేసు వివాహాన్ని పరిశుద్ధ పరుస్తు, బిడ్డలను దీవిస్తు, దంపతులను ఐక్యంగ ఉండమని కుటుంబ వ్యవస్థను అందలం ఎక్కించాడు.

## ఆలుమగల అనురాగ తోరణం

స్త్రీపురుషులు ఆదిలో చెరిసగమని ప్లేటొ వేదాంతి తెలియజేసాడు. ఈ చెరిసగాలు ఎదుటి సగాన్ని కనుగొని, పెళ్లి చేసుకోవడం ద్వారా నిజమైన సంతోషం కలుగుతుంది. ఆ విధంగ వారు ఏకమవుతారు. అందువలన ఎవరి వ్యక్తిత్వం అణగారదు. వివాహం వారి వ్యక్తిత్వాలను వికసింపజేస్తుంది, వారి మనసులను ఉత్తేజపరుస్తుంది. ఒక యోగి అన్నట్లు, “ఇద్దరు కలిసి ఉండుట

వలన, ఇద్దరు కలిసి తియ్యని కలలు కంటారు. మంచి వివాహం వారిని నేలను అంటిపెట్టుకొని ఉండేలా చేస్తుంది. తమ కలలు సాకారం కావటాన్ని వారు గమనిస్తారు." పాట్రిక్ పెయ్టన్ అంటాడు: "కలిసి ప్రార్థించే భార్యాభర్తలు కలిసి ఉండటానికి మామూలు కన్న ఎక్కువ అవకాసం ఉంది" (ఎఫేసీ 3: 14-15).

విడాకులు కూడదన్న నిబంధనను దేవుడు ఏర్పరిచాడని క్రీస్తు స్వయంగ తెలియజేసాడు (మార్కు 10: 2-16). పునీత పౌలు దీనిని చక్కగ అర్థం చేసికొని, విడాకులు తీసికోరాదని తన లేఖలలో ధీటుగ చెబుతున్నాడు. ఆ విధంగ దంపతులకు దన్నునిచ్చి, వివాహపు వ్యవస్థను నిలబెట్టుటకు సాయశక్తుల కృషిసల్పాడు. సంఘ ఆరాధన, వ్యక్తిగత పరిశుద్ధ గ్రంథ పఠనం-ధ్యానం మంచి వివాహానికి బీమా (Insurance) లాంటిది. వివాహం అంటె, విడిపోని విశ్వాసనీయత అని క్రీస్తుని చిత్తం. దంపతులు ఇరువురు "వివాహంలో మనకు ఏమున్నది?" అని ప్రశ్నంచుకొని, "మనం ఒకరి కొకరం ఏవిధంగ సేవ చేసుకోగలం?" అనే కచ్చితమైన ప్రశ్న వేసుకోవడమేనని యేసు ఆలోచన. ఆల్బర్ట్ ష్వట్జర్ ఈ విధంగ చెబుతాడు, "ఎలా సేవ చేయాలని వెదకి మరీ కనుగొంటారో వారే నిజమైన ఆనందాన్ని పొందుతారు." నైల్ డైమండ్ పాట రూపంలో ఇలా అంటాడు: "భార్యాభర్తలు సంఖ్య తరగడానికి కారణం స్వార్థం." (ఈ రోజుల్లో వివాహం లేకుండ, బాధ్యత లేని సహజీవనం గడపడానికి మొగ్గు ఎక్కువగ చూపుతున్నారు.) బాధ్యతగల వివాహ బంధంలో తమనుతాము ఏవిధంగ చూసుకొంటారో అదే విధంగ భార్యాభర్తలు ఒకరిని ఒకరు బాగా చూసుకొంటె, వారి దాంపత్య జీవితం అధిక ఆకర్షనీయంగను, రుచికరంగాను ఉంటుంది.

ఈ చిప్ యుగంలో కుటుంబ జీవితం కష్టతరమైన ఒక ప్రణాళికగ తయారయింది. తొందరగా పెళ్లి చేసుకోవడం, అంత తొందరలోనే విడిపోవటం జరుగుతుంది. త్రాగుడు, మాదకద్రవ్యాలు, క్రమశిక్షణా రాహిత్యం, వ్యభిచారం, వివాహేతర సంబంధాలు, ఇంకను అనేక బాధాకరమైన కారణాలు ఈనాడు కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో పౌలు కొలస్సీయులకు వ్రాసిన లేఖను పట్టించుకోవాలి. కతోలిక కుటుంబంలో ఉండవలసిన సలక్షణాలను ఆయన అందిస్తున్నాడు (3:12-21). ఆయన

వ్రాసిన మాటలను కుదురుగ కూర్చొని, ధ్యానించినట్లయితే, అద్భుతమైన ఆ మాటలు హృదయాలలోకి చొచ్చుకుంటాయి. పౌలు చెప్పిన మాటలు క్రైస్తవ కుటుంబాలలో కనిపిస్తే, అటువంటి గృహాలు ఎంత అమోఘంగ ఉంటాయో చెప్పలేం. ఆ గృహాలను సందర్శించాలని విచారణ గురువులు, సలహా సంఘ సభ్యులు, మరియదళ సభ్యులు, ఇతర సభ్యులు ఉవ్విళూరుతుంటారు. మీ కుటుంబాన్ని ఆ విధంగ తీర్చిదిద్దుకుంటే ఎంత బాగుంటుంది!

**కుటుంబం ఓ పాఠశాల**

"ఎపోకా" అనే వార పత్రిక ఒక కథనాన్ని ఆగష్టు 1993 సంచికలో ప్రచురించింది. దానిని ఇక్కడ పొందుపరుస్తున్నా - పదమూడు సంవత్సరాల బాలుడు హితబోధలో (Counselling) ఆరితేరిన టొనిని అనే వ్యక్తికి సలహా కోసం ఇలా ఉత్తరం వ్రాసాడు: "నాకు పదమూడు సంవత్సరాలు. ఇరువది రోజుల క్రితం నా తల్లిదండ్రులు విడాకులు తీసుకున్నారు. నన్ను అడగకుండానే జడ్జిగారు నా బాధ్యతను నా తల్లికి అప్పగించారు. కాని, నేను నా తండ్రితో ఉండాలనుకున్నాను. వారు నా జీవితాన్ని శిథిలం చేసారు. నేనిపుడు చాలా నిరాశతో ఉన్నాను. ఇతర పిల్లలు వారివారి తల్లిదండ్రులతో సంతోషంగ ఉన్నారు. వారిలానే నేనెందుకు సంతోషంగ ఉండకూడదు? తండ్రి లేని జీవితం ఎలా ఉంటుందో నా తల్లిదండ్రులకు తెలియదా? ఇపుడు ఇతరులంటే నాకు ఏహ్యాభావం కలుగుతుంది. రోజురోజుకు నేను క్రుంగిపోతున్నాను. తల్లిదండ్రులు ఉన్న నాతోటి బాలురంటే నాలో ద్వేషభావం కలుగుతుంది. . . . ."

సమాజానికి మూలం కుటుంబం. ఆ కుటుంబాన్నే మూలంగ తీసుకున్నాడు యేసు. కుటుంబం ద్వారా క్రీస్తు తననుతాను ఆవిష్కరించుకున్నాడు. కుటుంబం అనే మాద్యమం ద్వారా అతను ప్రపంచానికి దర్శనమిచ్చాడు. ప్రపంచంలో అందరిని కలుసుకోడానికి కుటుంబం ద్వారా ప్రయత్నించాడు. ఇంతకన్న మంచి వేదిక, మంచి పద్ధతి, మంచి సంకేతం, మంచి మూలం వేరొకటి అతనికి కనిపించలేదు. మానవ జీవం కుటుంబం నుండే పుడుతుంది. కుటుంబం మానవ జీవాన్ని కాపాడుతుంది, గమనిస్తుంది, పెంచుతుంది, చదివిస్తుంది, ఎదగనిస్తుంది, బాధ్యతగల పౌరునిగా తీర్చిదిద్దుతుంది. ఆ విధంగ

పరిపూర్ణ వ్యక్తిగా శ్రీసభలోకి, సంఘంలోకి మనుష్యులు ప్రవేశిస్తారు. ప్రేమకు నిలయం, సంఘీభావానికి ప్రథమ తరగతి గది కుటుంబం.

పై కథనంలో బాలుని లేఖను తీసుకుంటె, విడాకుల వలన పిల్లలు సంఘ విద్రోహులుగ మారడానికి దోహదపడుతుందని మనం గ్రహించాలి. ప్రతీ నేరస్తుని వెనుక తల్లిదండ్రుల బాధ్యత కొంతవరకైనా ఉంటుంది అన్నది సత్యదూరం కాదు. దీనినిబట్టి మనకు అర్థమయే దేమంటే – చక్కటి విధానంలో బిడ్డలు ఎదగాలంటే కుటుంబ వ్యవస్థ, శ్రీసభ నీడపట్టు, సాంఘిక సేవలు వంటివి ఎంత అవసరమో తెలుస్తుంది. మానవ విలువలకు మాత్రమేగాక, ఆధ్యాత్మిక విలువలకు కూడ కుటుంబం విప్పారి (Open) ఉండాలి. విశ్వాసాన్ని ప్రకటించడంలో కుటుంబానికి ప్రథమ పాత్ర ఉంది, అలానే బిడ్డలను ఆ విశ్వాసంలో పెంచుటకు బాధ్యత కలిగున్నారు. క్రీస్తుని యాజకత్వంలో సామాన్య భాగస్వామ్యాన్ని కలిగున్న వ్యక్తులు, తమ బిడ్డలకు జ్ఞానోపదేశం నేర్పించడం ద్వారా దానిని ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రక్రియలో తల్లిదండ్రులకున్న దైవానుగ్రహానికి ఎవరు సాటికారు, వారికి ప్రత్యమ్నాయం కూడ లేదు. బిడ్డల రక్షణ భాగ్యానికి బాధ్యులై ఉన్నారు.

కుటుంబం ఒక ప్రార్థనా సమాజం. ప్రార్థన చేసుకోవడమే కాదు, కాని కలిసి ప్రార్థించడం ముఖ్యం. దివ్యబలులందు, దివ్యసత్ప్రసాదమందు, ఇతర సంస్కారాలందు, ముఖ్యంగ ఆదివారాలలో కుటుంబ సమేతంగ పాల్గొనాలి. నైతిక విలువలు, ఆధ్యాత్మిక ప్రభావాలు, సాంఘిక పుణ్యక్రియలు వంటివి మొదట నేర్చుకొనేది కుటుంబంలోనే. విశ్వమానంగ శక్తి, చనువుగల ప్రేమ కుటుంబంలోనే తప్ప మరెక్కడ ఆ అనుభవాన్ని పొందలేరు. ఇక్కడే వ్యక్తిగత, సాంఘిక కోణాలలో జీవితం మొదలవుతుంది, బలపడుతుంది. ఇక్కడనే బిడ్డలు ఆరోగ్యకరమైన ఆత్మగౌరవాన్ని నేర్చుకుంటారు. తమ భావాలను ఎలా వ్యక్తం చేయాలోనన్న తర్ఫీదు పొందేది ఇక్కడే. ఆధ్యాత్మిక సత్యాలు జీర్ణించుకొని, వంట పట్టించుకొనేది ఇక్కడే. దేవునితో సత్సంబంధం ఏర్పరచుకొనేది ఇక్కడనే సుమా!

**తిరుకుటుంబంలా క్రైస్తవ కుటుంబం**

ప్రతి క్రైస్తవ కుటుంబం తిరు కుటుంబాన్ని ఆదర్శంగ తీసుకోవాలి. భర్త యోసేపుగా, భార్య మరియగా, పిల్లలు యేసుగా పరకాయ ప్రవేశం చేయాలి.

మత్తయి 1:24; 2:13-14, 20-23 వాక్యాలను గమనిస్తే యోసేపుకు రెండవమారు చెప్పవలసిన అవసరం ఉండదని తెలుస్తుంది. “మంచి గొడ్డుకు ఒక దెబ్బ - మంచి మనిషికి ఒక మాట” అని సామెత. దేవుని మాట మీద యోసేపుకు గురి ఎక్కువ! దేవుని మాట దూతనోటి ద్వారా ఇలా జారేసరికి అలా ఆచరించాడు యోసేపు. “లేడికి లేచిందే ప్రయాణం” అన్న సామెత యోసేపునందు కనిపిస్తుంది. అతనికి దేవుని సన్నిధాన విషయంలో మంచి ప్రావీణ్యం ఉంది. ఆయన విశ్వాసం, దైవసన్నిధి అనుభవం అతనిని దేవునిమాట ఆలకించి ఆచరించేటట్లు చేస్తుంది. దాంతో బాలయేసుని, కన్యమరియను కాపాడే బాధ్యతను భుజాలకెత్తుకొని, చక్కగ ఒక ఇంటి యజమానిగ కర్తవ్యాన్ని నెరవేర్చిన ధన్యమూర్తి యోసేపు. ఒక మంచి విరక్తత్వ భర్తగ, ఒక సాకుడు తండ్రిగ బాధ్యతలను పరిపూర్ణంగ నెరవేర్చాడు. సంసారం గురించి కలలుగన్న యోసేపు అవన్నీ వదులుకొని, దేవదూత మాట ప్రకారం తల్లిబిడ్డను కాపాడ వలసిన బాధ్యతను నెత్తిన వేసికొని, పనిచేయలేదా? ఇది క్రైస్తవ కుటుంబంలో ప్రతీ తండ్రికి ఉండవలసిన బాధ్యతాయుతమైన లక్షణం. కొందరు పురుషులు త్రాగుడుకు, జూదానికి, స్నేహితులతో విచ్చలవిడి విలాసాలకు బానిసలై ఇల్లు వల్లు గుల్ల చేసికొని, భార్యాబిడ్డలను అథోగతికి వదిలేసిన వారున్నారు. ఇది బాధ్యతారహితమైన జీవితం. పైగా కుటుంబ వ్యవస్థకు గొడ్డలిపెట్టు. కనుక, ఒక భర్తగ ఒక తండ్రిగ క్రైస్తవ కుటుంబంలో ధర్మాలను ఆచరణలో పెడుతూ భార్యాబిడ్డలను అనురక్తితో కాపాడాలి, అనురాగంతో లాలించాలి, ప్రేమతో కుటుంబాన్ని సాకి పాలించాలి. దేవునియందు పూర్ణ విశ్వాసంతో జీవించాలి.

నిజానికి తిరుకుంటుంబం ఒక్కటేకాదు ఐగుప్తుకు పలాయనం చిత్తగించింది. పీత బాధలు పీతవని, క్లిష్ట పరిస్థితుల్లో యూదులనేకులు కైరో, అలెగ్జాండ్రియా ప్రాంతాలకు వలస వెళ్లారు. యేసు మరియ యోసేపులు కైరో ప్రాంతంలోనే నాల్గున్నర యేండ్లు ఉండినారు. ఆనాడది ఒక మురికివాడ. అంతకంటే యోగ్యత వారికి లేదు. అయినా వారు అదే మహా ప్రసాదమని భావించారు. మరియ విషయానికొస్తే, ఆమె పేదరికానికి సొనగక, కష్టాలకడలిలో ఈదటానికే నిర్ణయించుకుంది. జీవితంలో అనిశ్చలత - నిలువ నీడలేని పరిస్థితి. బాలింతరాలకు అనుకోని ప్రయాణాలు, ఎముకులు కొరికే చలిలో చిరుగుల

బ్రతుకు, కడుపు చేతబట్టుకొని మెతుకుల కోసం, ప్రాణం నిలబెట్టుకోడం కోసం నిత్యం పోరాటం. ఏక్షణంలో ఏం జరుగుతుందోనని తెలియని అనూహ్యామైన పరిణామాలు. కాని వీటన్నిటి మధ్య అయోమయ పరిస్థితుల్లోకూడ మరియతల్లి దేవునియందు విశ్వాసంతోను, యోసేపునందు నమ్మకంతో నిశ్చలంగ జీవించింది. నిశ్చితార్థం జరిగి, కుటుంబ జీవితానికి సిద్ధపడిన మరియ దేవదూత సందేశం ప్రకారం కన్యగా లోకరక్షకుని మోసి కని పెంచి పెద్దచేయలేదా? ఇంటిని చక్కదిద్దుకొని, కష్టాలన్నిటిని వడికట్టుకొని (లూకా 2: 51), బంగారు కుటుంబంగ ప్రపంచ పటంలో చిత్రించింది మరియమాత. అందుకే ఆమె ఆదర్శ మహిళ – అత్యున్నతమైన మాతృక. చాలా కుటుంబాలలో స్త్రీలు నగలు, చీరలు, సోకులు, ఆర్భాటాల మీద దృష్టిపెట్టి గృహిణిగ, తల్లిగ బాధ్యతలు మరచి, విహారాలకు, వినోదాలకు ప్రాముఖ్యత నిస్తారు. గృహం మాత్రం గ్రహచారంగ మారిపోతుంది. క్షణం క్షణం నరకప్రాయం. క్రైస్తవ గృహిణి మరియమ్మను ఆదర్శంగ తీసికొని, సంఘంలో విలువలను చూపుతు భర్తతో సంతోషాన్ని పంచుకుంటు, బిడ్డలకు తల్లిప్రేమను అందించగలగాలి.

## ద్రాక్షా – ఓలీవుల్లా కుటుంబం

గృహం ఎలా ఉండాలో 128 వ భక్తికీర్తన చెబుతుంది. అందుకే గురువులు ఇంటిని ఆశీర్వదించేటపుడు ప్రార్థనలో ఈ కీర్తనను తప్పనిసరిగ ఉపయోగిస్తారు. నీ కష్టార్జితం అంటే గృహయజమానిగ కుటుంబాన్ని పోషించవలసిన బాధ్యతను గుర్తు చేస్తుంది. నీ భార్య నీ లోగిలిలో ద్రాక్ష తీగవలె అంటే గృహిణి ద్రాక్షలా ప్రేమ మాధుర్యాన్ని కుటుంబానికి అందించాలి. అందుకు ఇంటిలో తగిన వాతావరణం భర్త ఏర్పాటు చేయాలని బోధిస్తుంది. అపుడు బిడ్డలు ఓలీవు మొక్కలవలె ఒప్పారుదురని కీర్తనకారుడు చెబుతున్నాడు. తైలాలలో స్వర్ణతైలమైన ఓలీవు నూనె ప్రసస్థమైంది. అలాంటి బిడ్డలను పొందటానికి ఎవరు కోరుకోరు? అటువంటి బిడ్డలలో ప్రథముడు బాలయేసు. అతడు తల్లిదండ్రులకు విధేయుడై జ్ఞానమందును, ప్రాయమందును వర్థిల్లి, దైవానుగ్రహం, ప్రజల ఆదరాభిమానాలను పొందాడు (లూకా 2: 51–52). ఇదంతా ఎలా సాధ్యమయింది? తిరుకుటుంబం దేవునికి అతి సన్నిహితంగ ఉండి, దేవునిమీద పూర్తి నమ్మకాన్ని పెట్టుకుంది.

తమ లేమికి ఏడవక, అసౌకర్యాలకు చింతించక, వాటికన్నింటికి కారణమేమిటో ఏదో ఒకరోజు తెలుస్తుందని గ్రహించినందున దేవునినుండి వారు కావలసిన ఊరటను, భరించే శక్తిని పొందారు. పిల్లలు తల్లిదండ్రుల మాటవిని, చక్కగ చదువుకొని, అట్టే అల్లరి లేకుండ సరదాగ ఉండాలి.

**Sources:**

**1.** Rev. Fr. James Gilhooley. **Reflections on Sunday Gospels.** Allahabad: Holy Family International, 2000. Pp. 143-44; 237-38.

**2.** Fr. Adrian Mascarenhas. **Bible Diary 2015.** Octave of Christmas. Bangalore: Claretian Publications, 2014.

**3.** **Daily Eucharist.** September 2015. Ranchi: Xavier Publications, 2015. Pp. 68, 69.

**4.** Thomas Pazhayampallil SDB. **Words of Eternal Life.** Bangalore: Kristu Jyoti Publications, 2009. Vol. 1., Pp. 762 - 766.

❊ ❊ ❊ ❊

క్రైస్తవ సంజ్ఞలు ప్రతీకలను శాస్త్రీయంగ తెలుగులో మొట్టమొదటి సారిగ వెలువడిన పుస్తకం. అవగాహన నేపథ్యంలో వచ్చిన ప్రతీకల మొదటి సంకలనమిది. తత్త్వమనస్తత్వ, దైవ, అర్చన, సంస్కారాల శాస్త్రాలు మిలితమైన భావాల పరంపర వేదిక ఈ పొత్తం. బైబిలులోని గుర్తులు, సనాతన చిహ్నాలు, పునరుజ్జీవన కాలంలో వెలసిన క్రైస్తవ చిత్రలేఖనాలలో కనిపించే సంజ్ఞలు, సంస్కారాలలో అగుపించే సంకేతాలను వివరించే రచనయిది. ఈ ఉపగ్రంథం క్రైస్తవులను అలరింపజేస్తుంది.




## విషయసూచిక

పరిచయము

తొలిపలుకు

పీఠిక

1. ఆదిలో (In the Beginning)
2. నిరాకార శూన్యము (Chaos)
3. సృష్టి (Creation)
4. పాపము, పతనము, వాగ్దానము (Sin, Fall, Promise)

పదసూచిక

పారి భాషక పదములు

గ్రంథ పట్టిక

ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్, విశాఖ అగ్రపీఠపు గురువు. సెయింట్ ఆన్స్ మైనర్ సెమినరి, విశాఖ రెక్టరుగా (1983-1987); సెయింట్ జాన్స్ సెమినరి, కొండడాబాలులో వేదాంత శాస్త్రంను బోధించి (1989-91) ; ప్రస్తుతం సెయింట్ జాన్స్ రిజినల్ సెమినరి, హైదరాబాదు లో ఆధ్యాత్మిక మార్గ చూపరిగాను, ఆధ్యాత్మిక దైవశాస్త్ర అధ్యాపకులు ఉన్నారు. ఇది వారి ఎనిమిదవ పుస్తకం, మరో పది పుస్తకాలు అచ్చుకోసం వేచి ఉన్నాయి. పతిపన్నం ఏడు పుస్తకాలు రచనలో ఉన్నాయి. ఒక ప్రతి - రూ. 70/- పుటలు : 88 ఎక్కువ మొత్తంలో పుస్తకాలు తీసుకొంటే 10 నుంచి 15 శాతం వరకు తగ్గింపు ఉంటుంది.

ప్రతులకు ఫోన్ : 7995860807

**St. John's Publications, St. John's Regional Seminary,**
Ramanthapur, Hyderabad - 500 013.
Phone : 040-27201427, Email : stjohnshyd2@gmail.com













# తెలుగు కథోలిక వేదశాస్త్ర సమాఖ్య ఆరవ సదస్సు

**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
www.stjohnseminaryhyd.org

*Holycrossprinters 9848145417*